www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 26-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 312 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 11.17 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర తె. 4.32 తదుపరి హస్త; వర్జ్యం: ఉ. 9.33-11.21; దుర్ముహూర్తం: మ. 12.52-1.39, మ. 3.12-3.58; అమృతఘడియలు: రా. 8.23-10.12; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కడుపు నింపేవి.. కలుపు మొక్కలే!

గాజాలో ఆహార సమస్య తీవ్రం

కలుపు మొక్కల్ని కొనుక్కొని తింటున్న ప్రజలు

జబాలియాలో గుర్రాల్నీ తింటున్న శరణార్థులు

రంజాన్‌లోగా కాల్పుల విరమణ? 11







సముద్ర గర్భంలో కృష్ణుడికి మోదీ పూజలు.. అనంతరం చిరునవ్వులు చిందిస్తూ పైకి వచ్చిన ప్రధాని

మోదీ స్కూబా డైవింగ్

గుజరాత్ సముద్రగర్భంలో ద్వారక సందర్శన.. శ్రీకృష్ణుడికి పూజలు, నెమలి ఈకల సమర్పణ

ద్వారకను స్పృశించినపుడు నాటి ప్రాచీన వైభవాన్ని దివ్యత్వాన్ని అనుభూతి చెందా: మోదీ

దేశంలోనే అతిపెద్ద తీగల వంతెన సుదర్శన్ సేతును ప్రారంభించిన ప్రధాని

కాంగ్రెస్ హయాంలో అన్నీ స్కాంలే.. వాటిని అడ్డుకోవడం వల్లే భారీ ప్రాజెక్టులు వచ్చాయి

నాడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో దేశం ర్యాంకు 11.. ఇప్పుడు 5.. ప్రధాని మోదీ వ్యాఖ్యలు

దేవభూమి ద్వారక, ఫిబ్రవరి 25: సముద్రంలో మునిగిపోయిన ప్రాచీన నగరం ద్వారకను ప్రధాని మోదీ ఆదివారం స్కూబా డైవింగ్ ద్వారా సందర్శించారు. సముద్రగర్భంలో శ్రీకృష్ణుడికి భక్తిపూర్వకంగా ప్రార్థనలు జరిపారు. అనేక సంవత్సరాలుగా ద్వారకను సందర్శించాలని అనుకుంటున్నానని, ఇప్పటికి ఈ కోరిక నెరవేరిందని, ఇదొక దివ్య అనుభూతి అని సముద్రం నుంచి బయటకు వచ్చిన అనంతరం మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని ద్వారకలో ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఓఖా-బెట్ ద్వారక మధ్య నిర్మించిన దేశంలోనే అతిపెద్ద కేబుల్ బ్రిడ్జ్ (తీగల వంతెన)ను ప్రారంభించారు. అనంతరం, సముద్రంలో ఉన్న ద్వారక నగర అవశేషాలను సందర్శించటానికి పంచ్‌కుయి బీచ్ నుంచి స్కూబా డైవింగ్ చేశారు. ఆయనకు సాయంగా నౌకాదళ డైవర్లు కూడా సముద్రంలోకి వెళ్లారు. సముద్ర గర్భంలో మోదీ పద్మాసనం వేసి, ముకుళిత హస్తాలతో

మిగతా 12వ పేజీలో...



దేశ సత్వరాభివృద్ధే లక్ష్యం

దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఎయిమ్స్ సేవల విస్తరణ

మంగళగిరి ఎయిమ్స్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా కార్యక్రమం

జగన్ పాపాలకు జేపీ వెంచర్స్ బలి



- రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాల లీలలు అన్నీ ఇన్నీ కావు. తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. పర్యావరణ ఉల్లంఘనలకు గాను కాంట్రాక్టు సంస్థ జేపీ వెంచర్స్‌కు ఎన్జీటీ ఏకంగా రూ.1908 కోట్లు పెనాల్టీ విధించింది. గతేడాది మార్చిలోనే ఈ మేరకు భారీ జరిమానా వేసింది. అయితే ఈ విషయం ఆలస్యంగా తాజాగా వెలుగులోకి వచ్చింది.
- రాష్ట్రంలో బీ2 కేటగిరీ సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు 110 ఉన్నాయి. ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున మొత్తం 1908 కోట్ల పెనాల్టీని జేపీ వెంచర్స్ చెల్లించాల్సి ఉంది. ఇసుక కాంట్రాక్టు విలువే 1535 కోట్లు కాగా ఎన్జీటీ విధించిన పెనాల్టీ 1908 కోట్లు!
- జగన్ సర్కారు వచ్చాక జేపీ వెంచర్స్‌కు రెండేళ్ల పాటు ఇసుక అమ్మకాల కాంట్రాక్టు ఇచ్చింది. పేరు జేపీ వెంచర్స్‌ది కాగా తెరవెనుక లాభపడింది ముఖ్యమంత్రి, ఆయన పార్టీ నేతలే. అడ్డగోలుగా ఇసుక తవ్వేసి కోట్లకు కోట్లు సొమ్ము చేసుకున్నారు. నెలనెలా 'తాడేపల్లి'కి వాటాలు వెళ్లినట్టు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. జగన్ సర్కారు పాపాలకు చివరకు కాంట్రాక్టు సంస్థ బలవుతోంది.

ఇసుక కాంట్రాక్టు సంస్థకు 1908 కోట్లు పెనాల్టీ



ఒక్కోబీ2 కేటగిరీ రీచ్‌కు 18 కోట్లు చొప్పున

మొత్తం 110 రీచ్‌లకు జరిమానా విధింపు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీ కొరడా

పేరుకే జేపీ.. తవ్వకాలన్నీ వైసీపీ నేతలవే

'తాడేపల్లి'కి వాటాలు వెళ్లినట్లు ఆరోపణలు

అధికారికంగా బుక్కైంది కాంట్రాక్టు సంస్థే

జగన్ చేతులెత్తేస్తే ఆ భారం జేపీ వెంచర్స్‌దే

సుప్రీంకు నివేదికలు ఇవ్వనున్న కేంద్ర ఏజెన్సీలు

నేడు కొత్త కంపెనీలకూ అక్రమాల సమస్య

ఈసీలు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నాయని కేంద్ర ఏజెన్సీల వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదలకు ఉచితంగా ఇసుక ఇస్తే వారికి మాత్రమే లాభం. పాలక పెద్దలకు, అధికార పార్టీ నేతలకు ఏం లాభం ఉండదు. అందుకే జగన్ సర్కారు వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసింది. ప్రైవేటు చేతిలో పెట్టి అమ్మిస్తే లాభంతో పాటు ప్రైవేటు పేరిట పాలక పెద్దలు, అధికార పార్టీ నేతలు కూడా వ్యాపారం చేసుకోవచ్చనుకుంది. అదే పని చేసింది కూడా. జేపీ వెంచర్స్ అనే ప్రైవేటు సంస్థకు రెండేళ్ల పాటు ఇసుక అమ్మకాల కాంట్రాక్టు ఇచ్చింది. ఆ సంస్థ పేరిట వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేశారు. వేల కోట్లు అక్రమార్జనకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. కానీ కాంట్రాక్టు తీసుకున్న జేపీ వెంచర్స్ పరిస్థితి దారుణంగా ఉంది. నేతలు చేసిన అడ్డగోలు అక్రమాలకు పరిహారం చెల్లించే భారం జేపీ వెంచర్స్‌పై పడింది. పదో, వందో కాదు.. ఏకంగా రూ.1908 కోట్ల పెనాల్టీ. పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినందుకు గతేడాది ఎన్జీటీ ఈ మేరకు

మిగతా 11వ పేజీలో...

11

నేడు అనంతలో కాంగ్రెస్

శంఖారావం

హాజరుకానున్న పార్టీ చీఫ్ ఖర్గే

11

రేపే బీజేపీ భేరి!

ఏలూరులో 16 వేల మంది బూత్ కార్యకర్తలతో భేటీ

రాజ్‌నాథ్ దిశా నిర్దేశం

నెల్లూరు, విశాఖ, బెజవాడ, అనంత క్లస్టర్ భేటీలకు షా, నడ్డా

ఏదో ఒకచోట ప్రధాని కూడా?

గ్రూప్-2లో 'ఆడుదాం ఆంధ్రా'

మెంటల్ ఎబిలిటీ ప్రశ్నల్లో వైసీపీ ప్రభుత్వ పథకాలకు చోటు

కఠినంగా 'ఇండియన్ సొసైటీ'

తక్కువ సమయంతో అభ్యర్థులకు 'పరీక్ష' 12

4.04 లక్షల మంది హాజరు

2 వేలకోట్ల డ్రగ్స్ రాకెట్

గుట్టురట్టు

ఓ తమిళ నిర్మాత మాస్టర్ మైండ్

న్యూజిలాండ్, ఆస్ట్రేలియాకు సరఫరా 12

ఢిల్లీలో ముగ్గురి అరెస్ట్

ఐఏఎస్‌లకూ జగన్ టోపీ

రెండేళ్లుగా ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ ఎగవేత

రిటైర్‌మెంట్ తర్వాత మిగిలేది శూన్యం

రెండేళ్లుగా సొంత అవసరాలకు వినియోగం


అఖిల భారత సర్వీసు అధికారుల ఆవేదన

ప్రభుత్వంతో తేల్చుకునేందుకు సిద్ధం

నేడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అత్యవసర భేటీ

అజెండాలో చేరిస్తే మీడియాకు తెలుస్తుందని బెంగ

అందుకే టేబుల్డ్ ఐటమ్‌గా చేర్చాలని నిర్ణయం



సాధారణ ఉద్యోగులకే కాదు.. అఖిల భారత సర్వీసు ఉద్యోగులైన ఐఏఎస్‌లకు కూడా జగన్ ప్రభుత్వం టోపీ పెడుతోంది. రెండేళ్లకుపైగా ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమ చేయకుండా సొంత అవసరాలకు వాడేసుకుంటోంది. దీనిపై రగిలిపోతున్న ఐఏఎస్‌లు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ అధికారంలోకి వచ్చిన 6 నెలల వరకు ఉద్యోగులు ప్రశాంతంగానే ఉన్నారు. కానీ, ఆ తర్వాత నుంచి తమకిచ్చిన హామీలు, హక్కుల కోసం నేటి వరకు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇలా పోరాటం చేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వం తరఫున అఖిల భారత సర్వీసు అధికారులైన ఐఏఎస్‌లే సమావేశాలు, సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే, చిత్రంగా జగన్ ప్రభుత్వం ఐఏఎస్‌లకు కూడా కుచ్చుటోపీ పెడుతోంది. గత 25 నెలల నుంచి వీరి ఖాతాలకు చేరాల్సిన ఎన్‌పీఎస్(జాతీయ పింఛను పథకం) కంట్రిబ్యూషన్ సొమ్మును జమ చేయడం లేదు. దీంతో వారు రగిలిపోతున్నారు. అలాగని.. ఈ విషయంపై బయటపడితే పొలిటికల్ బాసుల నిర్ణయాలకు బలైపోవాల్సి వస్తుందని భయపడి మిన్నకుండిపోయారు. నాలుగున్నరేళ్ల నుంచి ఉద్యోగులు తమ హక్కులు, ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నా ఐఏఎస్‌లు మాత్రం నోరుమెదపలేదు. అయితే, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్పందించకపోతే.. మరింతగా నష్టపోతామని గ్రహించి, ఎన్నికలకు 2 నెలల ముందు బయటపడ్డారు. తమకు 25 నెలల నుంచి ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమకావడం లేదని, ఇదేం ఖర్మరా బాబు అని ఏ ఇద్దరు ఐఏఎస్‌లు కలిసినా చర్చించుకుంటున్నారు. ఎప్పటి కంట్రిబ్యూషన్ అప్పుడు జమచేయకపోతే

మిగతా 11వ పేజీలో...

పొత్తు పొడిచింది!



ఆగ్రాలో జరిగిన భారత్ జోడో న్యాయ యాత్రలో రాహుల్, అఖిలేశ్ అభివాదం

ఎన్నికల దిశగా ఇండియా కూటమి అడుగులు

ఎస్పీ, ఆప్‌లతో ఇప్పటికే కాంగ్రెస్ పొత్తు ఖరారు

ఇతర పార్టీలతో చర్చలు.. త్వరలో ప్రకటన

బెంగాల్‌లో 5 సీట్లు ఇవ్వటానికి దీదీ సుముఖం!

బిహార్‌లో 28:6:6 ఫార్ములా.. మహారాష్ట్రలో మెజారిటీ సీట్లపై 3 పార్టీల మధ్య అంగీకారం

దేశమంతా 350కిపైగా సీట్లపై అవగాహనకు చాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జనతాదళ్ (యు), రాష్ట్రీయ లోక్‌దళ్ నిష్క్రమణతో బలహీనపడినట్లు కనిపించిన ఇండియా కూటమి జవసత్వాలు కూడదీసుకొని లోక్‌సభ ఎన్నికల రణరంగానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా యూపీలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాలు ఖరారు కావటం, వెంటనే ఢిల్లీ, గుజరాత్, హరియాణా తదితర రాష్ట్రాల్లో ఆప్, కాంగ్రెస్ పొత్తును ప్రకటించటంతో ఇండియా కూటమి తన ఉనికిని చాటుకున్నట్లైంది. ఇతర రాష్ట్రాలకు సంబంధించి కూడా భాగస్వామ్య పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలపై

మిగతా 12వ పేజీలో...

'చలో'పై తలో మాట

తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం

49 డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ: ఏపీజేఏసీ

ఏ సమస్యా పరిష్కరించకుండా ఎందుకీ వాయిదా నిర్ణయం?

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారు

ఉద్యమించాల్సిన సమయంలో అర్ధంతరంగా వాయిదానా?

ఏపీజేఏసీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం: యూటీఎఫ్ 8

ప్రభుత్వం నుంచి హామీలు లేకుండా వాయిదా ఎందుకు?

ఇలాంటి నిర్ణయం ఉద్యోగులను వంచించడమే: ఏపీటీఎఫ్

అభ్యర్థులకు ప్రజల మద్దతు, ఆమోదం ఉండాలని కొత్త విధానం ద్వారా వారిని ఎంపిక చేశాం. దేశ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా 1.3 కోట్ల మంది నుంచి అభిప్రాయాలు సేకరించాం. సుదీర్ఘ కసరత్తు చేశాం.

జగన్ ఎన్నికల్లో విజయానికి తన పాలనను నమ్ముకోలేదు. దౌర్జన్యాలు, అక్రమాలు, దొంగ ఓట్లు, డబ్బును నమ్ముకున్నాడు. ఊహించని స్థాయిలో కుట్రలు, కుతంత్రాలు చేస్తాడు. ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి.

\- చంద్రబాబు



సీటొచ్చిందని ఈగో వద్దు!

తేడా వస్తే మార్చేస్తా: చంద్రబాబు

వారం వారం మీ పనితీరు సమీక్షిస్తా

ఎన్నికల వరకు సర్వేలు చేయిస్తా

అసంతృప్తుల ఇళ్లకు పది సార్లు వెళ్లి బుజ్జగించండి

జనసేన నేతలను గౌరవించండి

ఉభయులూ సమన్వయంతో వెళ్తే నూరు శాతం ఓట్ల బదిలీ

ఈ 40 రోజులూ ప్రజల్లో ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త అభ్యర్థులకు బాబు దిశా నిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీట్లొచ్చాయని అభ్యర్థులెవరూ ఈగోలకు వెళ్లొద్దని టీడీపీ అధినేత చంద్రబాబు నూతన అభ్యర్థులకు సూచించారు. ఏదైనా తేడా వస్తే వారిని మార్చడానికి సిద్ధమని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంపిక చేసిన కొత్త అభ్యర్థులతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలుత వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ 40 రోజుల్లో ఏం చేయాలో దిశానిర్దేశం చేశారు. ఎంత సీనియర్ నేత అయినా నియోజకవర్గంలో ఎన్ని సానుకూల అంశాలు ఉన్నా.. చివరి నిమిషం వరకు ప్రజల్లోనే ఉండి కష్టపడాలన్నారు. 'నియోజకవర్గంలో అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోవాలి. ఎవరైనా అసంతృప్తితో ఉంటే ఒకటికి పదిసార్లు స్వయంగా వెళ్లి కలవాలి. అభ్యర్థినంటూ ఈగోతో వ్యవహరిస్తే కుదరదు. తొలి జాబితాలో సీట్లు పొందినవారి పనితీరు సరిగా లేకుంటే

మిగతా 11వ పేజీలో...

రాజమండ్రి రూరల్‌లో బుచ్చయ్యకు లైన్‌క్లియర్!

ఫోన్లో మాట్లాడిన చంద్రబాబు.. జనసేన నేత కందుల దుర్గేశ్‌తో కూడా..?

సీనియర్లను నివాసానికి పిలిపించి మంతనాలు.. గంటాతో చీపురుపల్లి సీటుపైనే చర్చ

భీమిలిపై మాజీ మంత్రి ఆసక్తి.. ఆలపాటికి ఏదో ఒక చాన్సు! 11

బాబు నిర్ణయం శిరోధార్యం: దేవినేని.. అధినేతను కలిసి వచ్చినా అసంతృప్తిలోనే పీలా

జనసేన సీట్లపై స్పష్టత!.. పిఠాపురం, అమలాపురం, భీమవరం, నరసాపురం, నిడదవోలు ఓకే

పోలవరం, విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ, యలమంచిలి, పాలకొండ కూడా!

ఇద్దరిని గుద్ది.. పారిపోతూ..!

పాడి రైతుల బైక్‌ను ఢీకొన్న స్కార్పియో.. ఇద్దరి మృత్యువాత 11

పారిపోతూ లారీకి ఢీ.. ముగ్గురు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం

మద్యం మత్తే కారణం.. ఐదుగురు బలి.. మదనపల్లెలో ఘోరం

ఆధునీకృత & వేగవంతమైన రైల్వే

మోదీ ప్రభుత్వం యొక్క గ్యారంటీ



శంకుస్థాపన, ప్రారంభోత్సవం & జాతికి అంకితం

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 554 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి మరియు 1500 రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు / అండర్‌పాస్‌లను రూ. 41000 కోట్లతో







ఆంధ్రప్రదేశ్‌లో

46 స్టేషన్ల పునరాభివృద్ధి

- రాజమండ్రి
- బొబ్బిలి జం.
- పార్వతీపురం
- శ్రీకాళహస్తి
- అనంతపూర్
- చిత్తూర్
- శ్రీకాకుళం రోడ్
- కడప
- చీపురుపల్లి
- అనపర్తి
- సింహాచలం
- నౌపాడా జం.
- కొత్తవలస జం.
- హిందూపూర్
- ఇచ్ఛాపురం
- బాపట్ల
- చీరాల
- గుడివాడ
- మచిలీపట్నం
- అరకు
- గుంటూరు
- గుత్తి
- సామలకోట
- కుప్పం
- గుణదల
- మంత్రాలయం రోడ్
- ఎలమంచిలి
- సూళ్లూరుపేట
- మంగళగిరి
- వినుకొండ
- రాయనపాడు
- తాడిపత్రి
- కంభం
- గిద్దలూరు
- మార్కాపుర్ రోడ్
- ధర్మవరం
- నడికుడి జం.
- నరసరావుపేట
- సత్తెనపల్లి
- నంద్యాల జం.
- రాజంపేట్
- ఆదోని
- మాచర్ల
- ధోన్
- మదనపల్లె రోడ్
- పాకాల జం.

- రూఫ్ ప్లాజా, షాపింగ్ జోన్, ఫుడ్ కోర్టు, పిల్లల ఆట ప్రదేశం మొదలైన సౌకర్యాలతో స్టేషన్లను నగర కేంద్రాలుగా పునరాభివృద్ధి చేయడం
- ప్రవేశ & నిష్క్రమణలకు వేర్వేరు మార్గాలు, బహుళ అంతస్తుల పార్కింగ్, లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ ఏరియా, ట్రావెలేటర్, వికలాంగులకు సౌకర్యాలు
- మల్టీ మోడల్ అనుసంధానంతో పునరాభివృద్ధి చేయబడిన స్టేషన్లు ఈ ప్రాంతంలో సామాజిక- ఆర్థిక కేంద్రాలుగా మారతాయి

మరియు

84 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు / అండర్‌పాస్‌ల నిర్మాణం

- అవాంతరాలు లేని రైళ్ల & రోడ్ వాహనాల రాకపోకలు
- రైల్వే ట్రాక్‌ల వద్ద స్థానికులకు సురక్షితమైన & సౌకర్యవంతమైన మార్గాల ఏర్పాటు
- అంతరాయం లేని ట్రాఫిక్, ప్రయాణ సమయంలో తగ్గుదల

నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి
గారిచే

26 ఫిబ్రవరి, 2024 | ఉదయం 11:00 గం॥ల నుండి

(వీడియో కాన్ఫరెన్స్ ద్వారా)

వీరి గౌరవ సమక్షంలో

అశ్విని వైష్ణవ్
రైల్వే కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి

రావ్ సాహెబ్ పాటిల్ దాన్వే
రైల్వే, బొగ్గు మరియు గనుల శాఖ సహాయ మంత్రి

దర్శన జర్దోష్
రైల్వే మరియు వస్త్ర పరిశ్రమ శాఖ సహాయ మంత్రి

DD NEWS లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించగలరు


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్రీనరసింహ

కుటుంబ వివాదాల పరిష్కారానికి 20 ఏళ్లు అవసరమా?

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 25: అన్నదమ్ములు, భార్యభర్తల మధ్య నెలకొన్న వివాదాల పరిష్కారానికి 20 ఏళ్లు అవసరమా అన్నది న్యాయవాదులు ఆలోచించాలని, మధ్యవర్తిత్వం ద్వారా వాటిని పరిష్కరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ సూచించారు. న్యాయస్థానాలను ఆశ్రయించినవారు ఏళ్ల తరబడి న్యాయం కోసం ఎదురుచూసే అవసరం లేకుండా చూడాలన్నారు. రెండో రోజు విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం విజయనగరంలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ నూతన భవన సముదాయ నిర్మాణానికి ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్న యువతీయువకులు జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేసేలా వారిని సీనియర్ న్యాయవాదులు ప్రోత్సాహించాలన్నారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలు న్యాయవ్యవస్థపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా న్యాయవాదులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.


కప్పస్తంభం వద్ద జస్టిస్ జ్యోతిర్మయి

అప్పన్న సేవలో జస్టిస్ జ్యోతిర్మయి

సింహాచలం, ఫిబ్రవరి 25: సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఉదయం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి, సాయంత్రం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని దర్శించుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఈఓ నరసింగరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

విశాఖను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

- మెరుగైన సమాజం కోసం చైతన్యంతో ఆలోచించాలి
- భయం, ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలి
- స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఈసీ ఉండాలి
- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్
- విశాఖపట్నంలో రాష్ట్ర వ్యాప్త కళాజాత ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విశాఖలో నాశనమవుతున్న పర్యావరణాన్ని, దిగజారుతున్న పరిస్థితులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, మెరుగైన సమాజం కోసం ప్రజలు చైతన్యంతో ఆలోచించాలని రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. ప్రతి పౌరుడూ భయం లేకుండా, ప్రలోభాలకు గురికాకుండా ఓటేస్తేనే ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని చెప్పారు. ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న కళాజాత ప్రారంభం కార్యక్రమాన్ని ఆదివారం గీతం విశ్వవిద్యాలయం (టుబీ డీమ్డ్)లోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వివక్ష లేకుండా పాలన సాగించాలని, ప్రస్తుతం ఇది జరుగుతోందా? లేదా? అన్నది చూడాలని కోరారు. స్వయం, స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఎన్నికల కమిషన్ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల మధ్య ఉండే వారిని ఎన్నుకుంటే జవాబుదారీగా ఉంటారని, ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చేవారిని ఎన్నుకునే సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. విశాఖ ప్రజలు వివేకవంతులని, హుద్‌హుద్ తుఫాన్ తర్వాత విశాఖ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ప్రస్తుతం విశాఖలో దిగజారుతున్న పరిస్థితులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. 1952లో పార్లమెంట్‌లో 100 శాతం మంది సేవాతత్పరులు ఉండేవారని, ఇప్పుడు 30 శాతం మంది క్రిమినల్స్, 90 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారని అన్నారు.


కళాజాత ప్రారంభం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

‘తిరుపతి’లో ఎపిక్ కార్డుల జారీలో భారీ అక్రమాలు: నిమ్మగడ్డ

సదస్సు అనంతరం రమేశ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో 35 వేల ఎపిక్ కార్డులను క్లోన్ చేసి డూప్లికేట్ ఓటు కార్డుల తయారీ దారుణమన్నారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి ఘటనలను ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఈసీ, కొంతమంది అధికారులను సస్పెండ్ చేసిందని, అయితే ఇది భారీ కుంభకోణమని, దీని వెనుక పెద్ద హస్తం ఉందని ఆయన ఆరోపించారు. వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ.. సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం అవ్వా, తాతలను వలంటీర్లే స్వయంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఓట్లేయించాలంటూ చెప్పడం దేనికి సంకేతమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించకపోతే న్యాయపరమైన పోరాటానికి సీఎఫ్‌డీ సిద్ధమవుతుందన్నారు.

చిరుత దాడిలో ప్రొటెక్షన్ వాచర్‌కు తీవ్ర గాయాలు


చిరుతపులి దాడిలో తీవ్రంగా గాయపడిన అజీమ్

మహానంది/రుద్రవరం, ఫిబ్రవరి 25: నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ ప్రొటెక్షన్ వాచర్ అజీమ్‌పై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అజీమ్ నల్లమలలోని ఈగల్ బేస్ క్యాంపులో ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బేస్ క్యాంపు వద్ద ఉండగా అడవిలో నుంచి చిరుత అకస్మాత్తుగా వచ్చి అతనిపై దాడి చేసింది. అక్కడి సిబ్బంది అప్రమత్తమై చిరుతను తరిమివేశారు. గాయపడిన అజీమ్‌ను చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏపీలో సినిమా షూటింగులకు కృషి: ఫిల్మ్ చాంబర్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 25: హైదరాబాదుకు దీటుగా ఏపీలోనూ చిత్ర పరిశ్రమను విస్తరింపజేయడానికి ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కృషి చేస్తోందని ప్రముఖ సినీ నిర్మాత, ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ఏఎం రత్నం వెల్లడించారు. తిరుపతిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ షూటింగులను ప్రోత్సహించడం, ప్రభుత్వపరంగా రాయితీపై నిర్మాతలకు అవగాహన కల్పించడం, జిల్లాల వారీగా కమిటీల ఏర్పాటు, కళాకారులకు వృత్తి నైపుణ్యం పెంచడంపై శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై చర్చించామన్నారు. ఏపీలో సినీ స్టూడియో నిర్మించడానికి కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు.

తెలుగు భాషను పరిరక్షించే వారికే ఓటేయండి

భాషా పరిరక్షణకు ఓటును ఆయుధంగా వాడండి: జొన్నవిత్తుల

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25: తెలుగుభాషను భ్రష్టు పట్టించేవారికి ఓటు వేయవద్దు.. పరిరక్షించే వారికే ఓటు వేయాలని సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన "మన భాష కోసం మనం ఏం చేయాలి" అనే అంశంపై మాట్లాడారు. తెలుగు భాషను రక్షించుకోవడానికి ఓటును ఒక ఆయుధంగా మలచాలని జొన్నవిత్తుల సూచించారు.

జల్లికట్టులో ఎద్దు పొడిచి వృద్ధుడు మృతి

- అపస్మారక స్థితికి చేరగా స్థానికంగా ప్రథమ చికిత్స
- 108 రాకపోవడంతో ఆటోలో ఆస్పత్రికి తరలింపు, అప్పటికే మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 25: తిరుపతి జిల్లా చంద్రగిరిలో మొదటిసారి నిర్వహించిన జల్లికట్టులో విషాదం చోటుచేసుకుంది. నిర్వహణా లోపంతో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. చంద్రగిరి పట్టణంలోని మిట్టమీద గంగమ్మ ఆలయ వీధిలో ఆదివారం మధ్యాహ్నాం జల్లికట్టు నిర్వహించారు. అల్లిలోకి పశువులను వదిలాక కూడా జల్లికట్టు కోసం బాణసంచా కాల్చుతూ, డప్పులు వాయిస్తూ ఎదురుగా తీసుకురావడంతో బెదిరిన ఎద్దులు జనాలపైకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలో చంద్రగిరి మండలం నడింపల్లెకు చెందిన వెంకటముని(60)ని ఓ ఎద్దు పొడవగా ఆయన అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడేఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేసినా గంట దాకా రాకపోవడంతో ఆటోలో చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్టు తెలిపారు. పశువులు దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు.



ఒక అలౌకిక తలపోత

తోడిన మట్టిలో
వెలుగు చూస్తూ చూస్తూ
మొన్నెప్పుడో రావాల్సిన కల
వాయిదా పడింది
రేపయినా వస్తుందో లేదో

తవ్వకం అంటే ఎదురుచూపు

అడుగంటూ పడితే
దారులు వాటంతటవే ఏర్పడతాయిలే అని
కొన్ని తీర్థయాత్రలను కలగన్నాను
గుడిలో పొర్లుదండాల
ఆత్మ తివాచీ
విప్పుకోవడం ఇలగన్నాను
గడ్డపారకు
ఏదో ఒక ఖంగు తగలకపోదు

తవ్వకం అంటే ఒక పునశ్చరణ

ఆధ్యాత్మికత వెచ్చగా ఉండడం తెలుసా
పోనీ చల్లగా ఉండడమైనా తెలుసా
విస్మయం ఆశ్చర్యపరచకపోవడం తెలుసా
రహస్యం తొంగిచూపు ఎప్పుడూ
దొడ్డిదారిలోంచే
ప్రతి ఎదురుచూపులో
ఒక పలకరింపు

తేదీ మారింది కనుక
అర్ధరాత్రి తెల్లారినట్టు కాదు

తవ్వకం ఒక చట్టబద్ధత

వెలుగు కాలం చేసినా
చీకటి కొండెక్కదు
కృత్రిమ మేధతో
దేవుడు రాయించుకున్న వీలునామాను
మరణవాంగ్మూలమని పొరబడాలని

వాడి వ్యూహం

తవ్వకం ఒక ఎత్తుగడ

బౌద్ధకథ పైన
సింధూ మహాసముద్రము
ఆ నడుమ ఇలల్లాహీ
తవ్వాలి
ఇంకొంచెం చాలా మరింత
అనంత అగాధ ఆదిమ
పాతాళ అట్టడుగుల్లోకి తవ్వాలి
మనం దాచిందే మనం అందిపుచ్చుకోవాలి

ఆరామాల విరామంలో
కూల్చివేతల సౌరంగం
తవ్వకాల్లోనేగా తేలేది

ధరిత్రి మనోభావాలకు
దొంగ భాషనేర్పడం
నీ రంధ్రంలో నువ్వే తవ్వుకోవడం

తవ్వకం
రూపం కుదరని ఆహార్యం

తవ్వకం
కళ్ళున్న వేలికొసల లిపి
తవ్వకం
యాగఫల పూర్ణాహుతి

తవ్వకం ఎక్కడికైనా పాకొచ్చు
నీ వాకిలిలోకి నీ వసారాలోకి
నీ పడగ్గదిలోకి నీ విశ్వాసంలోకి

వెయ్యర పోటూ హైస్సా
ఇంకొక పోటూ హైస్సా

ఒక పాళీ విరిగింది
కాదు కాదు
కొన్ని పాళీలు విరిగాయి
అయినా
కొత్త శాసనం రాయాలి

బండ పడింది
కొత్త విగ్రహం చెక్కాలి

ప్రసేన్
98489 97241

పురస్కార ప్రదానోత్సవం
కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవం ఫిబ్రవరి 26 సా.6గంటల నుంచి 8గంటల వరకు ఎన్టీఆర్ కళా ప్రాంగణం, పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. మల్లు భట్టి విక్రమార్క, టి. కిషన్ రావు, కొలకలూరి మధుజ్యోతి, చిలుమూరి శ్రీనివాసరావు, కొలకలూరి సుమకిరణ్ పాల్గొంటారు. కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారాన్ని హుమాయున్ సంఘీర్, కె.వి. మేఘనాథరెడ్డి; విశ్రాంతమ్మ నవలా పురస్కారాన్ని దిలావర్, సింహప్రసాద్; విమర్శ పురస్కారాన్ని సుంకిరెడ్డి నారాయణరెడ్డి, వి. రాజారామమోహనరావు స్వీకరిస్తారు. పరిశోధకులు గడ్డం తిరుపతమ్మ, దుగులూరి సురేఖలకు సన్మానం ఉంటుంది. వివరాలకు: 93930 99035.
కె. ఆశాజ్యోతి జనార్దనం

అభినందన సభ

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత 'అందెశ్రీ'కి ఆత్మీయ అభినందన సభ ఫిబ్రవరి 29 ఉ.10 గంటలకు ఎన్టీఆర్ కళా ప్రాంగణం, పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులు కొలకలూరి ఇనాక్, ముఖ్య అతిథి కె. శ్రీనివాస్. సభలో నగ్నముని, వోలేటి పార్వతీశం, వలేటి గోపీచంద్ పాల్గొంటారు.

సి.యస్. రాంబాబు

కథా గౌరవ సభ

మధునాపంతుల వేంకటేశ్వర్లు కథా గౌరవ సభ మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణం, పల్లిపాలెంలో మార్చి 3 ఉ.10 గంటలకు జరుగుతుంది. కథా గౌరవ పురస్కారాన్ని చింతకింది శ్రీనివాసరావు, ఎండపల్లి భారతి, భగవంతం స్వీకరిస్తారు. వీరి కథలపై ఆకుల మల్లేశ్వరరావు, అనిల్ డ్యానీ, వంశీకృష్ణ విశ్లేషణ చేస్తారు. వివరాలకు: 97041 86544.

కిరణ్ మధునాపంతుల

'అక్షరోత్సవం' కార్యక్రమం

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలు ఏసీ రీడింగ్ రూములో మార్చి 3 ఉ.10 గంటలకు 'అక్షరోత్సవం' కార్యక్రమం జరగనుంది. తుంగా శివప్రభాత్ రెడ్డి, నందమూరి లక్ష్మీపార్వతి హాజరవుతారు. చిన్ని నారాయణరావు ఫౌండేషన్ ప్రధాన అవార్డును యాకుబ్; సాహిత్య పురస్కారాలను బంగార్రాజు కంఠ, కలిమిశ్రీ స్వీకరిస్తారు. వివరాలకు: 94402 02942

చిన్ని నారాయణరావు

జలకవనం

అనంతపురం జిల్లా పెనుకొండలోని గగన్ మహల్ వేదికగా మార్చి 3న ఉ.10.30 నుండి రాత్రి 7 వరకు జలకవనం నిర్వహిస్తున్నాం. రాష్ట్రం నలుమూలల నుండి కవులు పాల్గొని తమ ప్రాంత నీటి కష్టాలను కవితలుగా, పాటలుగా వినిపించవచ్చు. జలకవనంలో చదివిన కవితలన్నీ సంకలనంగా తీసుకు వస్తాం. పాల్గొన్న ప్రతివొక్కరికీ ప్రసంశా పత్రాలు అందిస్తాం. పేర్లనమోదు కొరకు: ఎ. హరి (9491355200), పి. రాజశేఖర్ రెడ్డి (9441508510)లను సంప్రదించవచ్చు.

ఎ. హరి

నాగభైరవ సాహితీ పురస్కారం

నాగభైర్వ సాహిత్య పీఠం పురస్కారం కోసం 2020 - 2022 మధ్య కాలంలో లఘు కవితా రూపాలైన నానీలు, హైకూలు, రెక్కలు, రవ్వలు, కిరణాలు, మణిపూసలు వంటి ప్రక్రియల్లో వెలువడిన ముద్రిత గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు. నాలుగు ప్రతులను మార్చి 30లోగా చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీవెంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు - 523002, ఫోన్: 98497 99711కు పంపాలి. విజేతలకు ఆగస్టు 18న ఒంగోలులో జరిగే సభలో బహుమతి ప్రదానం జరుగుతుంది.

నాగభైరవ ఆదినారాయణ

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఎప్పటికీ నిద్రపోని జ్వర జ్ఞాపకం

అతని కవిత్వం ఎప్పటికీ కొత్త మెత్తటి యాప పూల గాలి, వొక ఖండాంతర క్షిపణిని కూడా ఎగిరిపోనీయకుండా లోయలో కట్టి బంధించగల గాఢ స్నిగ్ధత, మాధుర్యం, సత్యాకర్షణ, మార్దవం అతని వాక్యం. వొక నది గాని, నెర్రెలీనిన నేల గాని, ఊరోళ్ళంతా ఖాళీ చేసి వెళ్ళిపోయిన ఊరు గాని, చేదబాయి గాని, చింతలతోపు గాని తమ గురించి తాము ఎతలెత్తుకుంటూ పాటగా వొలికిపోతే అది తన మాట, అతనే గుల్జార్.

విడిపోయే ముందు కౌగిలించుకొని ఏడుస్తూ, వొళ పట్టని దుఃఖాల్ని జేబులో నింపుకోవటమే, విడిపోవటమే అతని కవిత్వం. ఊర్దూ భాష తన ప్రియురాలు. అతని గొంతులో చిర్రా చిటికెన పుల్లలతో దరువులేస్తూ, హిదూస్థానీ దిల్ రుబా తీగలతో తారాసప్తకంగా ఏకాంతమవుతూంటుంది. కాల నియమాలను, గతినీ, అవధులనీ చెరిపిన వైనం అతని కథా కథన వైనమంతా. మైదానాలలోని, బస్తీలలోని మలుపుల మరకలల్లో అస్తవ్యస్తంగా వొదిలిపోయిన రక్తం మరకల సామాన్లు, రబ్బరు బొమ్మలు, విరిగిపోయిన ఆటవస్తువులూ, తన, వాక్యాలూ, మెటఫర్ల తూణీకలు. చాలావరకు గుల్జార్ కవిత్వమంతా oral narrative గానే కనిపించి దప్పికను తీరుస్తూ వుంటుంది. దూపను ఎగదోస్తూనే వుంటుంది. కవిత్వం recite చేస్తుంటే, ముందు అతని శబ్ద శ్రావ్యత పాఠకుడిని నిలబెడుతుంది. తరువాత... వొక అర్థం తెర లేపి ముందు నిలుస్తుంది. అటు తరువాత వొక అమేయమైన మానవీయ జీవానుభవం ఆవిష్కృతమవుతుంది.

> అతను నడుస్తూ చెట్లోలె కవిత్వం రాలుస్తూ పోతుంటాడు. పాకాల చెరువు నిద్రలో సణుగుతున్నట్టు అతని కంఠనాళం ఉర్దూని జీవ స్వరంలో వొంపుతూంటుంది. తన కవిత్వంలోని మార్దవానికి అర్ధరాత్రి ఆకలితో నిద్రలేచిన పసివాడికి జొన్నగట్క తినిపించిన అమ్మ యాదికొస్తుంది. వలసపోయిన తరువాత మొఖం కళ తప్పిన ఊరు ఎదురు వస్తూంటుంది.


గుల్జార్ జీవించి నడవడమే వొక వాక్యంగా వొలికిపోవడమే వొక రసవత్తర వైనం. స్పష్టతకు వొదగని గుణం. తన కవిత్వంలో అన్ని కాలాలూ వుంటాయి. అన్ని ఋతువులూ వుంటాయి. అన్ని పొరలూ, జీవ మరలూ, అనంత దుఃఖాల అరలూ మసలుతూ వుంటాయి. కాని మనిషి మాత్రమే వొక్కడయ్యి నిలబడి వుంటాడు. హేతుబద్ధతని నిరసిస్తూనే, హేతువుకొదగని అమానుష చర్యలను దుగోడపడ్తూ... తనను కూడా దుఃఖ తత్త్వంలో చెక్కుకుంటూ పోతూంటాడు. అతని బాష మత్తులో మునిగిపోయి జీవించడంలో ఈత కొడుతూ, ఉర్దూ, ఫార్సీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో వొడ్డుకు వచ్చి, శరీరాన్ని ఆరబెట్టుకుని... మళ్ళీ తడవటానికి జీవితంలోకి మునిగిపోయి, లోపలి చీకటి నెగడును ఎగదోస్తూనే వుంటూంది.

ఎన్నో కవిత్వ ముషాయిరాల్లో ఆయన గొంతు పాఠకుడికి శ్రవణ మాధుర్యాన్ని సానపెడతూ ఉంటుంది. ఆయన కవిత్వాన్ని చదువుతుంటే వినడం, చదవడం కంటే గొప్ప రసోద్రేకాల్ని కలిగిస్తూ వుంటుంది. వొక్కో పదానికి వొక వైఖరి, వొక పెర్ఫార్మెన్స్ వుంటుంది. అది ఉర్దూ భాషలో ఉందా? లేక తన భాషా సంలీనతలో వుందా అన్నది తేల్చిచెప్పలేని రహస్యం. అతని ధారణ మొత్తం వొక ధ్వని శ్రావ్యత లేక నిశ్శబ్ద శ్రావ్యతగానే పాఠకుడు అనుభవపూర్వకంగా చెప్పవచ్చేమో. అందుకే పాఠక శ్రోతలకు timeless journeyని పరిచయం చేస్తూంటాడు. తన వచనం, లయసరళిలో మునిగి... ముచ్చట, వచనంగా, తెగని ప్రవాహంగా నడిచి వస్తూంటుంది. దాని గుణ ప్రభావం వలన ఆ వాక్య రూపాల గమకాలను, స్థిరంగా చలించే స్వర అచలనాన్ని పాఠక శ్రోత అనుభవంలో తెచ్చుకుంటాడు. భాష అచ్చమయిన వచన సామాగ్రితో, కవిత్వ పనిముట్లతో పాఠకుడిని గంటలకొద్దీ నిలబెట్టి ముచ్చట చెబుతుంటుంది. ఆ ముచ్చటలో జీవానుభవం కలుగుతూన్న కొద్దీ కవీ, పాఠకుడూ ఒక్కరిగా మారిపోయి.. రంగస్థలం కరిగిపోయి.. కేవలం ఒక ప్రేక్షకుడు మాత్రమే మిగిలిపోయి వుంటాడు. కాలం సన్నబడిపోతుంది. చరిత్రలోని తేదీలూ, సంఖ్యలూ, లెక్కలూ, గుణ నిర్ధారణలూ కరిగిపోయి.. కేవలం మానవానుభవమే మిగిలిపోయి, మానవుడే నిలబడి ముచ్చట తనకు తానే వినిపిస్తూంటాడు. శుద్ధ భౌతిక మానవుడి ఆత్మరోదన, వొంటరితనం, క్షోభ, ఆరోపణ, అంతరంగంలోని ఎడతెగని విధ్వంసం, తమ గూడును తామే కాల్చుకుని వలసలు పోయే పక్షుల నిస్సహాయత అనుభవానికి వస్తుంది. అంతర్లలమవుతుంటుంది. మన పంచేంద్రియాలకు సునిశితత్వపు దిక్కు దారి దొరుకుతుంది. వాటి అర్థాలు మరింత లోతుగా మరింత విస్తృతంగా మనకు అర్థమవుతుంటాయి. స్వరపదాలు మనసుకు తగులూతూ వుంటే పంచభూతాల సరిహద్దులు కూడా చెదిరి ముక్తమవుతుంటాయి. మాటా పాటా కలిసి జుగల్‌బందీతో ప్రదర్శన మొదలవుతుంది. శ్రుతంగా వొక పదచిత్రం, వొక చెట్టునూపే గాలితో కలిసి దరువులేస్తూ పాడుతుంది. గుల్జార్ కవిత్వాన్నీ అతని గొంతులోనే వింటూ చూస్తుంటే.. dislocate అవుతూన్న జీవితం సారవంతంగా పాఠకుడికి ఐహికానుభవం తాలూకు పరుగులనాపుతుంది. సమూహంలోని ఏకాంతానుభూతి తాలూకు రుచి పాఠకునికి తగులుతుంది. పరిమళమే చెమ్మగిల్లుతూంటుంది. Kafkaesque saga కు నడక ప్రారంభమవుతుంది.

జగ్‌జీత్ గాయక సభలో గుల్జార్ గారి కవిత్వాన్నీ ప్రసంగాన్నీ విని, చూసి అనుభవించిన వారందరికీ కొత్తలోకమొకటి కిటికీ సగం తలుపులు తెరిచి పిలవడం గుర్తుండే వుంటుంది.

"ఏమానందమిది ఉర్దూ భాషది
ఎక్కడ నుంచి వచ్చిన ప్రేమ ఇదంతా
పదాల మీది రుచి అందుకున్నప్పుడు
ఈ ప్రేమను మాట్లాడుతున్నాను
వొప్పుకుంటున్నాను
వెల్లడిస్తున్నాను
పదపదాన్ని నములుతూంటే...
తమలపాకులో జార్దాకిమామ్‌ను
తిన్నటువంటి మాధుర్యం తెలిసివస్తుంది
ఒక్క క్షణం...
అదే క్షణం... అనంతం..."

- అని గుల్జార్ అనగానే మన కళ్ళ ముందు అనుకంపనతో తడిసిపోయి మెల్లగా గుండెలో మసిలే ఉర్దూ పదమే కనబడుతుంది. తెల్లవారుఝామున మసక వెన్నెల నిద్రలో కన్నీరొలికే ప్రియురాలు కదులుతున్నట్టుంటుంది. తనను గమనిస్తే 90 సంవత్సరాలు. ఇంతటి యవ్వన దశలో తనని జ్ఞానపీఠం వరించి ముద్దుపెట్టుకోవటం భారతీయ సాహిత్యంలో గొప్ప పున్నమి కాదా. ఆధునిక ఖండాతర భారతీయ కవిత్వంలోని సాహిత్యంలోని అనేక విస్తృత జీవధారల్లో గజల్ వొక సమున్నతమైన తేజోధార కాదా. గుల్జార్ వంటి కవి... అటువంటి ధారను గుప్పిటపట్టి, సంచరిస్తూన్న ఖండాంతర సూఫీ తపస్వి. ఇతని గురించేనేమో... Al Hujwiri (died in 1063) పర్షియన్ సూఫీయిజమ్ గురించి 'Kashf al-Mahjub' అనే పుస్తకంలో సూఫీ గురించి రాస్తూ: "Sufi is a name which is given, and formerly been given to he perfect saints and spiritual adepts. He that is purified by love, is pure, and that he is absorbed in the Beloved and has abandoned all else is a sufi." సరిగ్గా ఇటువంటి సూఫీ పదవచన సంచారి మన గుల్జార్‌జీ.



అతను నడుస్తూ చెట్లోలె కవిత్వం రాలుస్తూ పోతుంటాడు. పాకాల చెరువు నిద్రలో సణుగుతున్నట్టు అతని కంఠనాళం ఉర్దూని జీవ స్వరంలో వొంపుతూంటుంది. తన కవిత్వంలోని మార్దవానికి అర్ధరాత్రి ఆకలితో నిద్రలేచిన పసివాడికి జొన్నగట్క తినిపించిన అమ్మ యాదికొస్తుంది. వలసపోయిన తరువాత మొఖం కళ తప్పిన ఊరు ఎదురు వస్తూంటుంది.

మరొక్కసారి కొంత కవిత్వ గమకానికి చెవి వొగ్గి వినిపించాలనిపిస్తుంది.

"నీ కళ్ళలోంచి రాలుతూండే వొక సత్యం
నీ కళ్ళలోంచి సృష్టిగా తూలే వొక జీవితం
వొక ఆత్మ
వానచుక్కల్లో ఎగిసిపడే వొక అగరు సెగ"

- అంటూ తన అమూర్త ప్రియురాలిని పసిగడతాడు.

అట్లాగే -

"ఒకే పిడికిట్లో రెండు మన్ను దేహాలు
నిద్రించినప్పుడు
నేనెక్కడున్నానప్పుడు
నువ్వెక్కడున్నావు?"

- అంటూ విహ్వలుడౌతాడు కవి. గుల్జార్ మంచులో తడిసిన గులాబీల రెక్కల్ని రెప్పల మీద అదుముకుంటూ... గురుముఖుడౌతాడు అనేక ముషాయిరాల ముప్పేట అలలుగా కమ్ముకుంటూ పాఠక శ్రోతలకి... ఎప్పటికీ ఇప్పటికీ కమ్ముకుంటూ హృదయానికి హత్తుకుంటూ, వొక రూమీ, వొక మిర్జా గాలిబ్, అమీర్ ఖుస్రూ, మీర్ తక్ మీర్, సాహిర్ లుధియాన్వీ, అమృతా ప్రీతమ్, సురయ్యా కమలాదాస్, వచన గణ సుగుణకారులైన అక్కమహాదేవి, దాస కవులైన పురంధర, కనకదాసు, రవిదాసు, నందదాసు, సంత్ కవుల సూఫీల సరసన ఎంచదగిన ఎన్నదగిన కవి కర్మచారి... మన గుల్జార్.

సిద్ధార్థ
73306 21563

సద్ది



సద్ది కట్టి పోయి రమ్మని సాగనంపడం
ఒకానొక పచ్చని పాత జ్ఞాపక దృశ్యం

ఇంటికి చుట్టాలు వచ్చి వెళ్లేటప్పుడు
దారిలో ఆకలి తీర్చేందుకే సద్దిముల్లె సంస్కృతి

ఈ మధ్యన నేనూ కడుతున్న
బడికి పోయే మా ఆవిడకు సద్ది గిన్నె
నెయ్యీ పెరుగూ ప్రేమ పోసి పంపిస్తున్న

లంచ్ పీరియడ్‌లో లాగించేస్తూనే
'నే వండిన కూరకు నీ మగ చెయ్యి తగిలి
మరింత కమ్మగా ఉన్నదండీ'
ఫోన్ పలకరింపులో చిలకరింపు
ఉబ్బిపోయేట్లుగ పరవశవాక్యం అది

నా బిడ్డ తన బిడ్డకు పెట్టే బాక్స్ అయితే
కలిపిన అన్నం కూరా ఒక గిన్నెలో
పెరుగన్నం పచ్చడి మరో గిన్నెల
స్నాక్స్ కోసమని మరొక డబ్బానట
మనమరాలుకు బాక్సు బుక్సూ బరువే బరువు

తాతతో కలిసి నాగలి దున్నిన కాలం
ఇరువాలు మూడుసాల్లు కలె దున్నకం
మాగి పొద్దుకు గావర ఎక్కువ
బాపమ్మ తెచ్చిన సద్దికి లేచి వచ్చిన పాణం
బురద కాళ్లతోనే పొలం ఒడ్డు మీద కూచూని
మయ్యర మయ్యర బువ్వ తిన్న జ్ఞాపకం

కలిసి పని చేస్తున్న కార్యాలయాలు
లంచ్ టైం ఒక సామూహిక భోజనశాలనే

కొలీగ్స్ తో రుచులు ముచ్చట్ల కలబోతలు
ఎవరి డబ్బాలు వాళ్లవే అందులో కూరలే అందరివి
కారం సప్పిడి ఉప్పూ పులుపు పై సూసుడే
ఆఫీసులో ఆహారానికి నాలుకలన్నీ ఊరేగింపులు

వరి నాట్లు వేసే పొలం గట్ల మీద
వరుసగా రైతు వనితల సద్దుల బంతుల
ముద్ద ముద్దకూ ముచ్చట్లే ముచ్చట్లు
అవన్నీ ఊరు మీది వార్తా ప్రసారాలు
నారు మడి జానపద సంగీత విభావరి
వరిపొలంల వరిఅన్నం తినడమొక కమ్మదనం

సుతారీ మేస్త్రీల సద్దులు కొంచెం పెద్దగనే
స్వేదం చిందే పనితీరుగ ఆహారం
తీరికలేని పరిశ్రమయే ఆ ప్రపంచం
పని కాడనే టకటకా భోజనం కానిచ్చుడు
తిన్నంక ఒక బీడీ ఊది పారేస్తేనే తృప్తి

అన్నలకు సద్ది కట్టడం ఒక సాహసం
అడవిలోకి మొయ్యడమే మొండి ధైర్యం
ఎక్కడి నుంచి వచ్చారో, ఎన్ని రోజుల ఆకలో
రహస్య ఉద్యమకారులకు ఆకలి ఒక పొలికేక
తుపాకీ నీడన అన్నం తినే వెన్నెల రాత్రులు
ఊరు పక్క గుట్టల్లో, అదొక రణ భోజనం

సద్ది గిన్నె సంస్కృతి దేహాలకు ప్రాణప్రదం
వండి వార్చి సద్ది కట్టడం శ్రామిక సౌందర్యం

అన్నవరం దేవేందర్
94407 63479

గ్లోబలైజేషన్‌ని తొలిదశలోనే డీకోడ్ చేసిన 'పడమటిగాలి'

ప్రపంచ నలుమూలల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో పెను మార్పులతో సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న గ్లోబలైజేషన్ ఒక చిన్న గ్రామాన్ని, చిన్న చిన్న కుటుంబాల్ని, మానవ సంబంధాల్ని ఎంత ఛిద్రం చేసిందో చూపించడం ఆషామాషీ కాదు. క్లిష్టమైన గ్లోబలైజేషన్ క్రమాన్ని, దాని ప్రభావాన్ని ఒక మైక్రో కాస్మిక్ స్థాయిలో విశ్లేషణాత్మకంగా, హృద్యంగా, ఆర్ద్రంగా, కళ్ళకి కట్టినట్టు చూపించిన నాటక రాజం పాటిబండ్ల ఆనందరావు రచించిన 'పడమటిగాలి'.


1990వ దశకంలో కొన్ని పాశ్చాత్య దేశాలు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లతో కలిసి వాషింగ్టన్ కన్సెన్సస్ ద్వారా మూడో ప్రపంచ దేశాల మీద ఆర్థిక ఆంక్షలు విధించాయి. ఆర్థిక సంస్కరణల పేరుతో అనేక దేశాల్ని అంతర్జాతీయ మార్కెట్లోకి ఈడ్చుకెళ్ళాయి. ఇష్టం వున్నా లేకపోయినా అందరు గ్లోబలైజేషన్ వలలో చిక్కుకున్న సందర్భం అది. ఆర్థిక సంస్కరణల్లో దాగివున్న ఎల్‌పిజి (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) పాలసీల్ని అర్థం చేసుకోవడానికి విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు కుస్తీ పడుతున్న కాలం అది. మనదేశంలో ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్న సరిగ్గా ఐదారు సంవత్సరాల తరువాత 1998లో, ఆనందరావు రచించిన 'పడమటిగాలి' గ్లోబలైజేషన్ పనితీరుని గ్రామస్థాయిలో డీకోడ్ చేసిన దృశ్య కావ్యం.

1991లో మన దేశం చేపట్టిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు గ్రామస్థాయిలో సృష్టించిన గందరగోళాన్ని సామాన్య ప్రజలకి వ్యంగ్యంగా, హాస్యధోరణిలో అర్థమయ్యేలా రచించిన ఏకైక సాహిత్య ప్రక్రియ 'పడమటిగాలి' నాటకం అని చెప్పవచ్చు. 1991కి ముందు ప్రైవేట్ సంస్థలు దేశంలో పరిశ్రమలు స్థాపించుకోవడానికి లైసెన్స్ పొందాలంటే కష్టతరమైన నియంత్రణలు ఉండేవి. ఆ నియంత్రణలని తొలగించి సులభంగా లైసెన్స్ పొందేందుకు వీలుకల్పించడమే లిబరలైజేషన్. గతంలో కొన్ని పరిశ్రమలకి మాత్రమే పరివితమైన ప్రైవేట్ సంస్థల్ని దాదాపు అన్ని పరిశ్రమల్లోకి అనుమతించడమే ప్రైవేటైజేషన్. టెక్నాలజీ ద్వారా ప్రపంచ మార్కెట్లని అనుసంధానించడం గ్లోబలైజేషన్.

ఈ మూడు ప్రక్రియలు కలిసి చాపకింద నీరులా ఒక గ్రామం మీద దాడి చేసే క్రమాన్ని ఆనందరావు 'పడమటిగాలి' నాటకంలో ఆవిష్కరించారు.

అమెరికాకి చెందిన ఒక కార్పోరేట్ సంస్థ ప్రకాశం జిల్లాలో తన పరిశ్రమని స్థాపించడానికి రైతుల దగ్గర భూమి కొనుగోలు చేస్తున్న క్రమంలో రాంకోటు అనే రైతు తన మూడు ఎకరాల పొలం అమ్మడానికి తిరస్కరిస్తాడు. ఆ మూడెకరాల పొలం, కార్పొరేట్లు సేకరిస్తున్న పొలానికి మధ్యలో కీలకమైన స్థానంలో వుంటుంది. రాంకోటు ఆ పొలాన్ని తన తల్లిదండ్రులతో సమానంగా భావిస్తాడు, ప్రేమిస్తాడు. అమ్మడానికి ససేమిరా ఒప్పుకోడు. ఎలాగైనా ఆ మూడెకరాల్ని స్వాధీనం చేసుకోవడానికి కేంద్రమంత్రి నుంచి రాష్ట్ర మంత్రులు, స్థానిక రాజకీయ నాయకులు, చివరికి స్థానిక దళారీలు రాంకోటు మీద తీవ్రమైన ఒత్తిడి తెస్తారు. ఆర్థిక ప్రలోభాలు పెడతారు. అప్పుల పాలుచేస్తారు. అవమానాలకి గురిచేస్తారు. అతని కొడుకు రాంపండుని విలాసాలకి బానిసని చేసి, అప్పుల ఊబిలోకి లాగుతారు. పొలం అమ్మి అప్పు తీర్చమంటారు. చివరికి రాంపండుని రెచ్చగొట్టి తన తండ్రిని చంపేలా కుట్రలు చేపిస్తారు. మరోవైపు తుఫాన్ వల్ల చేతికొచ్చిన పంట నేలపాలైపోతుంది. నిస్సహాయ స్థితిలో రాంకోటు, అతని భార్య లక్ష్మీదేవి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. రైతు చచ్చిపోవడం సమస్యకి పరిష్కారం కాదని, నిలబడి, పోరాడి బతకాలని, సమాజాన్ని బతికించాలని ఆనందరావు చూపించిన తీరు ప్రేక్షకుల్ని కంటతడి పెట్టిస్తుంది.

ప్రజల జీవితాల్ని గ్లోబలైజేషన్ ఎలా ట్రాప్ చేసిందో 'పడమటిగాలి' పరిచయం చేసిన పద్ధతి నాటక చరిత్రలోనే ఒక కొత్త ఆవిష్కరణగా కనిపిస్తుంది. మనకి తెలియకుండానే మనల్ని గ్లోబలైజేషన్ ఎలా ఆడిస్తుందో, పీడిస్తుందో, ఓడిస్తుందో 'పడమటిగాలి' చూపిస్తుంది. మన అభిరుచుల్ని, ఆర్థిక కార్యకలాపాల్ని, ఆస్తిపాస్తుల్ని మార్కెట్ ఎలా కంట్రోల్ చేస్తుందో తెలియజేస్తుంది. భార్యా భర్త, తండ్రికొడుకు, అన్నాచెల్లెలు వంటి ఆత్మీయ బంధాల హననం వెనుక కార్పోరేట్ శక్తులని చూపించి భయపెడుతుంది. ఆహార పంటల్ని వాణిజ్య పంటలు చంపేయటం విస్మయాన్ని కలిగిస్తుంది. లక్షల మందికి ఉపాధి ఇస్తున్న వ్యవసాయ భూమిలో ఒక పరిశ్రమ పెట్టి రెండు వేల ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పగానే మనం కొట్టిన చప్పట్లు సిగ్గుతో తలలు వంగిపోయేలా చేస్తే, దైనందిన జీవితంలో జరిగే చిన్న చిన్న పనుల వెనుక వున్నది పెద్దపెద్ద వ్యాపార కుట్రలని ఈ నాటకం చెప్పినప్పుడు- మన నుంచి మనం ఎంత దూరమయ్యామో అర్థమౌతుంది. ఇలా సమాజంలో చాప కింద నీరులా సర్వత్ర వ్యాపించిన గ్లోబలైజేషన్ వ్యూహాల్ని స్పష్టంగా, సమగ్రంగా కళ్ళకి కట్టినట్టు పాటిబండ్ల ఆనందరావు ప్రెజెంట్ చేసిన తీరు గొప్పగా ఉంటుంది! కళ్ళ ముందే, ఊరు, రాజకీయాలు, మానవ సంబంధాలు, కుటుంబాలు, ఆర్థిక స్థితిగతులు ఛిద్రం కావటం వెనుక వున్న అంతర్జాతీయ శక్తులని బయటకిలాగి వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అమెరికా ఆశలు, డాలర్ల వేట, రియలెస్టేట్ వ్యాపారం, ఫైనాన్స్ బిజినెస్ సమాజాన్ని ఎలా పతనం చేసిందో తెలుసు కోవాలంటే 'పడమటిగాలి' చూడాల్సిందే.



> మనదేశంలో ఆర్థిక సంస్కరణలు ఊపందుకున్న సరిగ్గా ఐదారు సంవత్సరాల తరువాత, 1998లో, ఆనందరావు రచించిన 'పడమటిగాలి' గ్లోబలైజేషన్ పనితీరుని గ్రామస్థాయిలో డీకోడ్ చేసింది. ఇది ఒక దృశ్య కావ్యం మాత్రమే కాదు, మానవ పరిణామ క్రమంలోని ఈ దశలో గతం, వర్తమానం, భవిష్యత్తులని కలబోసి కళ్ళకి కట్టినట్టు వివరించిన అనేక సామాజిక శాస్త్రాల సారం.



ఎన్ని ఆర్థిక సంస్కరణలు వచ్చినప్పటికీ వూళ్ళో కులం పట్టు తగ్గలేదని రచ్చబండ దగ్గర సీన్లు పదే పదే గుర్తు చేస్తాయి. రాజకీయాల్లో అవినీతి గురించి రచ్చబండ దగ్గర జరిగే చర్చలో ఊరు రెండు కులాలుగా విడిపోయి "మీ నాయకుడు దొంగంటే - మీ నాయకుడు గజదొంగ" అని ఎత్తిపోడుచుకొనే క్రమంలో "మా నాయకుడ్ని మీరు తిట్టొద్దు, మీ నాయకుడ్ని మేమూ తిట్టం, లోకంలో అవినీతి సహజం, అవకాశం దొరికితే మనం చెయ్యమా?" అని రెండు వర్గాలూ కలిసి సాధారణీకరించుకున్నప్పుడు రాజకీయాల్ని కులం ఎంత భ్రష్టు పట్టిస్తుందో తెలుస్తుంది. ఆ రెండు కులాలకి చెందిన స్కూల్ టీచర్, పశువుల డాక్టర్ విధులకి హాజరు కాకపోయినా పరస్పరం ఫిర్యాదులు చేసుకోకుండా ఒకరికొకరు సహకరించుకుంటూ "ఊర్ని డెవలప్ చేసుకుందా"మని రెండు కులాలు ఒకటై తీర్మానించుకున్నపుడు అభివృద్ధి నిర్వచనంలో కులం కంపు నషాళానికి అంటుతుంది. నేటి రాజకీయాల్లో అవినీతి పరుడైన రాజకీయ నాయకుడ్ని అతని కులం ఎలా వెనకేసుకొస్తుందో ఈ సన్నివేశాల్లో రచయిత స్పష్టంగా చూపాడు.


రచయిత ఈ నాటకంలో ఒకవైపు లింగ వివక్షతని చీల్చి చెండాడి మరో వైపు స్త్రీ స్వేచ్ఛ అవసరాన్ని నొక్కి చెప్పాడు. సుబ్బరత్నం, దొరసాని వంటి పాత్రలు లింగ వివక్షతకి ప్రతిబింబాలుగా కనిపిస్తే రాజ్యం పాత్ర స్త్రీ స్వేచ్ఛకి పరాకాష్ఠగా కనిపిస్తుంది. రాజ్యం పాత్ర మహిళలకి అబార్షన్ హక్కు, సహజీవన హక్కు, లైంగిక స్వేచ్ఛ వంటి అంశాల్ని చర్చకు తెస్తుంది. మహిళా హక్కులు మగవాళ్ళ హక్కులతో సమానంగా వుంటే స్త్రీకి ఏ స్థాయిలో స్వేచ్ఛ లభిస్తుందో రాజ్యం పాత్ర సూచిస్తుంది. రచయితకి మహిళాస్వేచ్ఛ పట్ల వున్న ఆకాంక్ష రాజ్యం పాత్ర ద్వారా బయట పెట్టినట్టు అర్థమౌతుంది.

గ్రామ స్థాయిలో గ్లోబలైజేషన్ అమలు ప్రక్రియకి కేంద్రంగా మాయోడు పాత్రని ఆనందరావు చిత్రీకరించిన పద్ధతి, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెత్తనం కోసం అమెరికా రూపొందించిన 'ఎకానమిక్ హిట్ మేన్' (జాన్ పెర్కిన్స్ రచన)ని గుర్తుకు తెస్తుంది. ఈ నాటకంలో మాయోడు ఏ ఎండకాగొడుగు పట్టే పాత్ర. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు పట్టుకుంటాడు. అవసరాన్ని బట్టి ఆశలు రేకెత్తిస్తాడు, వాటిని ఆర్పేస్తాడు. జాన్ పెర్కిన్స్ 2004లో రూపొందించిన 'ఎకనామిక్ హిట్ మేన్' పాత్రా, ఆనందరావు 1998లోనే రూపొందించిన పడమటి గాలి మాయోడు పాత్ర దాదాపు ఒకేలా వుంటాయి. పవర్ రిలేషన్స్‌కి డిస్కోర్స్ అనే ప్రక్రియ పునాది అంటాడు ఫ్రెంచ్ తత్వవేత్త మిస్సెల్ ఫూకో. ఫూకో పేరు కూడా వినని ఆనందరావు డిస్కోర్స్ అమలు జరిగే పద్ధతిని మాయోడు పాత్ర ద్వారా క్షేత్ర స్థాయిలో వివరించిన పద్ధతి ఆశ్చర్యం కలిగిస్తుంది.

ప్రపంచంలో గ్లోబలైజేషన్‌కి గురికాని దేశం లేదు, అంశం లేదు. ముఖ్యంగా మధ్యతరగతిని వెంటాడే విదేశీ చదువు, వ్యాపారాలు, విలాసాలు, సంస్కృతి, కల్తీ విత్తనాలు, కంప్యూటర్లు, ఆత్మహత్యలు, ఆర్థిక దోపిడీలు, కుట్రలు కుతంత్రాల్ని లాభాల కోసం గ్లోబలైజేషన్ ఎలా వాడుకుందో 'పడమటిగాలి' నాటకం బహురస ప్రవాహంతో వివరిస్తుంది. సంక్లిష్టమైన గ్లోబలైజేషన్ ప్రక్రియని నాలుగు గంటల నిడివితో, డెబ్బైమంది కళాకారులతో సామాన్యులకి కూడా అర్థమయ్యే రీతిలో సృష్టించిన రచయిత మేధస్సు, సృజనాత్మకత అభినందనీయం. 'పడమటిగాలి' నాటకం కేవలం ఒక దృశ్య కావ్యం మాత్రమే కాదు, మానవ పరిణామ క్రమంలోని ఈ దశలో గతం, వర్తమానం, భవిష్యత్తులని కలబోసి కళ్ళకి కట్టినట్టు వివరించిన అనేక సామాజిక శాస్త్రాల సారం.

(ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఒంగోలులో 'పడమటిగాలి' నాటకం ప్రదర్శన, రచయిత పాటిబండ్ల ఆనందరావుకి సన్మానం)

శ్రీపతి రాముడు



పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. ఏడో రోజు, మొదటి ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రమయ్యాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లు వండి నైవేద్యం, చీర సారె, పసుపుకుంకుమ సమర్పించారు.

- 6లో..



ముగిసిన పరీక్ష

గ్రూప్ -2 స్క్రీనింగ్ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షల కేంద్రాలను కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. 54 పరీక్ష కేంద్రాల్లో 24,373 మందికిగాను 20,304 మంది (83.31 శాతం) పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు భారీ క్యూలైన్లలో నిల్చున్నారు.

- 6లో..



కానూరులోని సిద్ధార్థ లా కళాశాలలో..



ఎస్ఆర్ఆర్ కళాశాలలో..

గన్నవరంలో గరళం!

తాగునీటి రిజర్వాయర్‌లోకి కలుషిత నీరు మళ్లింపు



కొనాయి చెరువు రిజర్వాయర్

వేసవి రానే వచ్చింది. ప్రజలకు తాగునీటి అవసరం పెరుగుతుంది. ఇందుకోసం సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన తరుణంలో పలు గ్రామ పంచాయతీలు ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నాయి. ఖర్చులేని పనులకు శ్రీకారం చుడుతూ విష జలాన్ని వదులుతున్నాయి. అపరిశుద్ధ జలాన్ని ఫిల్టరైజేషన్ కూడా చేయకుండా నేరుగా రిజర్వాయర్లలోకి మళ్లించి సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటి అయిన గన్నవరం పంచాయతీలో ఈ దుస్థితి నెలకొంది.



కొనాయి చెరువు రిజర్వాయర్‌లోకి వెళుతున్న కలుషిత నీరు

- వేసవి వేళ ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టిన పంచాయతీ
- తొండంగట్టు చెరువులో వ్యర్థ జలాలు, చేపల పెంపకం
- ఆ నీటిని ఫిల్టర్ చేయకుండా రిజర్వాయర్‌కు పంపింగ్
- మూలన పడిన పంపింగ్ స్కీమ్.. మోటార్లు ఫట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరం పట్టణానికి ప్రధాన మంచినీటి రిజర్వాయర్ అయిన కోనాయి చెరువుకు గండి కొట్టి సమీపంలోని తొండంగట్టు చెరువులోని వ్యర్థ జలాలను మళ్లిస్తున్నారు. తొండంగట్టు గుంట అనేక రకాల వ్యర్థాలతో నిండి ఉంటుంది. ఇందులో చేపలు కూడా పెంచుతున్నారు. నీరు దుర్గంధం, దుర్వాసనలతో ఉంటుంది. అలాంటి నీటిని ఫిల్టరైజేషన్ కూడా చేయకుండా రిజర్వాయర్‌కు గండి కొట్టి తొండంగట్టు చెరువు నీటిని మళ్లిస్తున్నారు.

అధికార పార్టీ నేత హస్తం

గన్నవరం పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ గండి కొట్టమని సిబ్బందిని ఆదేశించారు. రిజర్వాయర్‌కు గండిపెట్టడమేమిటని, వివాదం అవుతుందని స్థానిక సిబ్బంది చెప్పినా పెడచెవిన పెట్టారు. ఏదైనా అయితే తనను ఇక్కడకు తీసుకువచ్చిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరుడు చూసుకుంటాడని బెదిరించి బలవంతంగా గండి కొట్టించినట్టుగా తెలుస్తోంది.

పనిచేయని మోటార్లు

గన్నవరం ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగాల్సి వస్తుందన్న ఉద్దేశంతో 2007లో రూ.3 కోట్లతో ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. దావాజీగూడెం వంతెన దగ్గర ఉన్న రెండు మోటార్లలో ఒకటి పనిచేయడం లేదు. దానికి ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఒక్క మోటారే పనిచేస్తోంది. దీనికితోడు గన్నవరం వాటర్ ప్లాంట్ దగ్గర కూడా మోటార్లు పనిచేయటం లేదు. రివర్స్‌లో మోటార్లను ఆడటం వల్ల మరమ్మతులకు గురైనట్టు తెలుస్తోంది. గన్నవరం గ్రామ పంచాయతీకి ఏడాదికి ఐదు కోట్ల మేర దండిగా ఆదాయం వస్తున్నా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని మరమ్మతులు చేయాల్సిన పంచాయతీ అధికారులు ఆ పని చేయకుండా రిజర్వాయర్‌కు గండి కొట్టి కలుషిత నీటిని మళ్లిస్తున్నారు.

తెంపల్లి ఉదంతంతో కళ్లు తెరవరా?

గన్నవరం మండలంలో తెంపల్లిలో సరిగ్గా ఏడాది కిందట కలుషిత నీటి వల్ల ప్రాణాంతక క్లెబ్సియల్లా వైరస్ సోకి ముగ్గురు మృతి చెందారు. వంద మందికిపైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఊరంతా వణికిపోయింది. ఈ ఉదంతాల గుణపాఠాలను నేర్వని గన్నవరం పంచాయతీ అధికారులు ప్రజారోగ్యాన్ని ఫణంగా పెట్టడం గమనార్హం.

ఎన్నో పంచాయతీల్లో నిండు నిర్లక్ష్యం

గన్నవరం పంచాయతీతో పాటు అనేక పంచాయతీలు తాగునీటి కొరతను, కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.

- ఇదే మండలం పరిధిలోని కేసరపల్లి పంచాయతీ హామ్లెట్ అయిన వెంకట నరసింహాపురంలో నీటి కొరత నెలకొంది. డ్రెయిన్లు లేకపోవటం వల్ల పైపులైన్లు లీకై ఇళ్లలోకి మురుగునీరు వచ్చిన ఉదంతాలు ఉన్నాయి.
- ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండల పరిధిలో రక్షిత మంచినీటి సరఫరా అనేది ప్రకటనలకే పరిమితమైంది. కృష్ణా నీటిని ఒడిసి పట్టి అందిస్తామన్న ప్రత్యేక కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పడింది. ఒకపక్క ఏ కొండూరు మండలం పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. ఈ సమస్యకు ప్రధానంగా సురక్షితం కానటువంటి మంచినీరేనని పరీక్షలలో తేల్చారు. పునరుద్ధరణ పనుల కోసం బడ్జెట్ కేటాయింపులు లేకపోవటంతో ఏ కొండూరు మండల ప్రజలు ఈ వేసవిలో తాగునీటి కష్టాలు ఎదుర్కోనున్నారు.



కొలుసు పార్థసారథి



బొప్పన భవకుమార్

నేడు టీడీపీలోకి పార్థసారథి

బొప్పన భవకుమార్ కూడా..

చంద్రబాబుతో సమావేశమైన దేవినేని ఉమా

వసంత చేరిక వాయిదా

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సోమవారం టీడీపీలో చేరనున్నారు. ఆయనతోపాటు విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన బొప్పన భవకుమార్ కూడా పార్టీ కండువా కప్పుకోనున్నారు. పార్థసారథి, భవకుమార్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీగా మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వెళ్లి పార్టీ అధినేత సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. పార్థసారథికి నూజివీడు టికెట్‌ను ఇప్పటికే కేటాయించారు. వీరితోపాటే టీడీపీలో చేరుతారని భావించిన మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చేరిక మాత్రం మరికొన్ని రోజులు వాయిదా పడింది.

చంద్రబాబుతో ఉమా భేటీ

మరోవైపు మైలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి దేవినేని ఉమా సోమవారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. మైలవరం నుంచి వసంతను బరిలోకి దింపే విషయమై వీరి నడుమ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఉమాను ఒప్పించిన తర్వాతే వసంతను పార్టీలోకి చేర్చుకోవాలని పార్టీ అధినేత భావించడంతో వసంత చేరిక వాయిదా పడినట్టు సమాచారం. చంద్రబాబును కలిసిన అనంతరం ఉమా మాట్లాడుతూ 'చంద్రబాబు కుటుంబ సభ్యుడిని నేను. చంద్రబాబు అంటే నాకు శిరోధార్యం' అని అన్నారు. మరోవైపు బొమ్మసాని సుబ్బారావు ఆదివారం గొల్లపూడిలో తన అనుచరులతో సమావేశమయ్యారు. వసంత చేరికను వ్యతిరేకించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

వైసీపీ మూక రాప్తాడులో జర్నలిస్టుపై దాడికి పాల్పడిన ఘటన మరువక ముందే మరోదాడికి పాల్పడింది. ఈసారి దళితులను లక్ష్యం చేసుకుంది. జగ్గయ్యపేటలో టీడీపీకి చెందిన దళితులు ఆదివారం నిర్వహిస్తున్న ర్యాలీలోకి జొరబడి కవ్వింపు చర్యలకు పాల్పడి ఉద్రిక్తత సృష్టించింది. ఇదేమని అడిగిన వారిపై వైసీపీ మూక విరుచుకుపడింది. టీడీపీ కౌన్సిలర్‌నూ, మరో కార్యకర్తనూ తల పగులగొట్టింది. అయినా కసి తీరక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మరోసారి దాడికి యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

పాత మునిసిపల్ ఆఫీసు గేటు ముందు టీడీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు



దళితులపై వైసీపీ మూక దాడి

టీడీపీ ఎస్సీ విభాగం ర్యాలీలోకి చొరబడి వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్యలు

- టీడీపీ కౌన్సిలర్, కార్యకర్తపై దాడి
- సంయమనంతో ర్యాలీ కొనసాగించిన టీడీపీ దళిత శ్రేణులు
- మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడిన వైసీపీ శ్రేణులు
- టీడీపీ శ్రేణుల ప్రతిఘటనతో పాత మునిసిపల్ ఆఫీసులో తలదాచుకున్న వైసీపీ మూక
- రక్షణ కల్పించిన పోలీసులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 25 : ఎస్సీ వర్గాలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో కలిగిన ప్రయోజనాలను వివరించేందుకు ఆ పార్టీ ఎస్సీ విభాగం ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో 'దళితుల పిలుపు - తాతయ్య గెలుపు' పేరుతో ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నివాసానికి నియోజకవర్గం నుంచి దళితులు భారీగా తరలిరాగా మధ్యాహ్నం ర్యాలీ బయల్దేరింది. అదే సమయంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను బలుసుపాడు రోడ్డులో టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి వస్తున్నారు. ఆయన వెంట ఉన్న కౌన్సిలర్లు, ఇతర కార్యకర్తలు టీడీపీ ర్యాలీలోకి వైసీపీ జెండా పట్టుకుని వచ్చారు. అదేంటని వారించిన బూదవాడకు చెందిన గిరిజన కార్యకర్త గుగ్లోతు రాంబాబును తలపై బాదారు. ఆయనకు రక్తగాయాలయ్యాయి.

● వైసీపీ మూకకు పోలీసుల రక్షణ

పోలీసులు టీడీపీ ర్యాలీని ఆపి వారిని పంపించేశారు. టీడీపీ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నాక మరోసారి ర్యాలీలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ ర్యాలీలోకి జెండాలతో జొరబడి మళ్లీ నినాదాలు చేశారు. వారికి నచ్చజెప్పేందుకు వెళ్లిన టీడీపీ దళిత కౌన్సిలర్ నకిరికంటి వెంకటిపై దాడికి యత్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా మెరుపుదాడికి దిగారు.



దాడిలో తలకు గాయాలైన గిరిజన కార్యకర్త రాంబాబు

వైసీపీ కార్యకర్తలు పాతమునిసిపల్ కార్యాలయంలోకి వెళ్లి మెష్‌డోర్ వేసుకున్నారు. పోలీసులు పాత కార్యాలయం ప్రహరీ గేటు వేసి వైసీపీ కార్యకర్తలకు రక్షణ కల్పించారు.

● రెండోసారి కవ్వింపు చర్యలు

పోలీసులు ప్రహరీ వద్ద కాపలాగా ఉండగానే వైసీపీ శ్రేణులు లోపల నుంచి వచ్చి మళ్లీ కవ్వింపులకు దిగడంతో తీవ్ర ఉద్రికత్తతకు దారి తీసింది. టీడీపీ కార్యకర్తలు పాత మునిసిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించటంతో పోలీసులు, టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నం చేసి నిలువరించారు. పరిస్థితిని గమనించి కొత్త మునిసిపల్ కార్యాలయానికి రాకుండా ఉదయభానును పోలీసులు పంపించారు. ఆ తర్వాత టీడీపీ ర్యాలీ ముందుకు కొనసాగి శుభమస్తు కల్యాణ మండపానికి చేరుకుంది.

విజయవాడ మున్సిపల్ అధికారుల చేతివాటం కారణంగా వీఎంసీకి దక్కాల్సిన సుమారు కోటి రూపాయల ఆదాయానికి గండి పడింది. గవర్నరుపేటలోని ఎన్టీఆర్ - ఏఎంసీ కాంప్లెక్సుల్లో షాపులను అద్దెకు ఇచ్చేందుకు నిర్వహించిన టెండర్లలో భారీఎత్తున అవినీతి చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో షాపుల పాటదారులతో సంబంధిత విభాగం అధికారులు కుమ్మక్కు కావడంతో లక్షలాది రూపాయలు చేతులు మారగా వీఎంసీ ఆదాయానికి మాత్రం భారీగా గండిపడింది.

వీఎంసీ ఆదాయానికి గండి!

ఎన్టీఆర్ - ఏఎంసీ కాంప్లెక్సు దుకాణాల వేలంలో చేతివాటం

- పాటదారులతో అధికారులు కుమ్మక్కు
- రూ.కోటి ఆదాయానికి సున్నం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కాంప్లెక్సులోని కింది అంతస్తులో మీసేవా కేంద్రాన్ని గతంలో ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా మీసేవా కేంద్రం ఖాళీగా ఉంటోంది. దీంతో మీసేవా కేంద్రం స్థానంలో షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) ఎస్టేట్ అధికారులు మీసేవా కేంద్రాన్ని నాలుగు షాపులుగా మార్చి వాటికి 59, 60, 61, 62 నెంబర్లను కేటాయించారు. అధికారులు ఈనెల 23న సత్యనారాయణపురంలోని ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయంలో షాపులను అద్దెకివ్వడానికి టెండర్లు పిలిచారు. గుడ్‌విల్‌గా రూ.5,99,400, ఈఎండీగా రూ.1,49,850 నిర్ణయించారు. అద్దె నెలకు రూ.16,650 పెట్టారు.

- మిగతా 6లో



ఏఎంసీ కాంప్లెక్సు షాపు నెంబరు 37

ఆగని పండు ఆగడాలు

ఉయ్యూరు తిరునాళ్లలో యువకుడిపై బీరు సీసాతో దాడి

- పోలీసులపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- నా మీద చేయి వేస్తే కోసేస్తానంటూ పరోక్ష హెచ్చరిక

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కోడూరి మణికంఠ అలియాస్ పండు... గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు. అతడి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఒక గ్యాంగ్‌ను నడుపుతూ రెచ్చిపోతున్నాడు. తాజాగా ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్లకు వెళ్లి ఓ యువకుడిపై బీరు సీసాతో దాడి చేశాడు. దీనిపై కేసు నమోదవుతుందని గ్రహించి తానూ బీరు సీసాతో దాడి చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. విజయవాడ పటమటకు చెందిన ఉజ్వల్ ఉయ్యూరులో వీరమ్మకు మొక్కులు తీర్చుకుని భోజనాలు పెట్టాడు. దీనికి స్నేహితులను, బంధువులను ఆహ్వానించాడు. ఇందులో భాగంగా పండు, అతడి స్నేహితులను పిలిచాడు. భోజనాలు అయిన తర్వాత సిగరెట్ వెలిగించుకునే విషయంలో ఉజ్వల్, పండుకు మధ్య వివాదం జరిగింది. వారిని విడదీయడానికి పటమటకు చెందిన సంతోష్ అనే యువకుడు మధ్యలో వెళ్లాడు. అసలు మధ్యలో రావడానికి నువ్వు ఎవడివిరా అంటూ పండు తిరగబడ్డాడు. అక్కడే ఉన్న మనోహర్, సాయి, సురేష్ అతడిని పట్టుకుని కారు వద్దకు తీసుకెళ్లారు. అందులో ఉన్న బీరు సీసా తీసుకుని పండు ఆ యువకుడి తలపై బలంగా కొట్టాడు. సీసాతో పెదవులపై గుచ్చాడు. అతడిని అక్కడే ఉన్న వారు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్ కేసు పెడతాడని గ్రహించిన పండు కొత్త నాటకానికి తెరదీశాడు.



గాయపడిన సంతోష్

ఆ బీరు సీసాతో తలపై కొట్టుకున్నాడు. మనోహర్ బ్లేడ్‌తో మెడ, తొడలపై కోసుకున్నాడు. ఇద్దరూ కలిసి కారులో ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. పండుకు గాయం కాకపోవడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మనోహర్‌ను ఆసుపత్రిలో చేర్పించాడు. తర్వాత పండు తల్లి పద్మావతి ఆసుపత్రికి వచ్చి సంతోష్‌తో బేరసారాలు మొదలుపెట్టింది. పోలీసులు అడిగితే జరిగిన విషయం చెప్పకుండా కింద పడిపోయానని చెప్పాలని బెదిరించింది. దీనిపై ఉయ్యూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులను ఉద్దేశించి పండు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియో వైరల్ అవుతోంది. "నా మీద చేయి వేసి చూడు. నువ్వు హెడ్‌కానిస్టేబుల్‌వి. నీ చేతిలో లాఠీ ఉంది. దమ్ముంటే నా మీద చేయి వేసి చూడమను. ఎవరైనా సరే కోసేస్తా" అని ఓ సినిమాలో ఉన్న సన్నివేశానికి కింద తన ఫొటో పెట్టుకుని సామాజిక మాధ్యమాల్లోకి వదిలాడు. ఈ వీడియో ద్వారా పోలీసులకు పరోక్షంగా హెచ్చరిక ఇచ్చాడని అతడి గ్యాంగ్ సభ్యులు బయట చెప్పుకుంటున్నారు.



కుమార్తెను పరీక్షా కేంద్రానికి ఎత్తుకుని తీసుకువస్తున్న తండ్రి

ప్రశాంతంగా గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష

▸ కృష్ణాజిల్లాలో 77.38 శాతం హాజరు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : కృష్ణాజిల్లాలో ఆదివారం 51 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 17241 మంది విద్యార్థులకు 13341 మంది హాజరయ్యారు.77.38 శాతం హాజరు నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. మచిలీపట్నంలోని 11 పరీక్షా కేంద్రాల్లో 3190 మంది విద్యార్థులకు 2533 మంది హాజరయ్యారు. చిలకలపూడి ఎస్వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని, పద్మావతి హిందూ మహిళా డిగ్రీ కళాశాలను జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డీవో వాణి సందర్శించారు. పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు జరిగాయి.

నిరుద్యోగుల హృదయాలను కదిలించిన దివ్యాంగురాలు హేమశ్రీ

మచిలీపట్నం పద్మావతి హిందూ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షా కేంద్రం వద్ద మొవ్వకు చెందిన దివ్యాంగురాలు ఈడే హేమశ్రీని ఆమె తండ్రి శ్రీనివాసరావు ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకుని వచ్చారు. హేమశ్రీకి చేతులు, కాళ్లు కదలిక లేకుండా ఉన్నాయి. మొవ్వ డిగ్రీ కళాశాలలో బీఏ చదివిన ఈమెను పద్మావతి హిందూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ సబ్‌స్క్రైబర్‌ను ఇచ్చారు. ఆర్డీవో కావాలనుకుంటున్నట్టు హేమశ్రీ తెలిపింది. దివ్యాంగురాలు హేమశ్రీని చూసిన నిరుద్యోగుల హృదయాలు చలించిపోయాయి. పట్టుదల, ఆత్మ విశ్వాసం ఉంటే విజయాలు సొంతమవుతాయని హేమశ్రీ నిరూపించగలదని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 83.31 శాతం హాజరు

వన్‌టౌన్ : గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్టు కలెక్టర్ దిల్లీరావు ప్రకటించారు. ఆదివారం జిల్లాలో పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 24373 మందికి గాను 20304 మంది (83.31 శాతం) పరీక్ష రాసినట్టు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు, లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. విజయవాడలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు.





బందరు ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జేసీ గీతాంజలి శర్మ



దుర్గమ్మకు హాల్ టికెట్లను చూపుతూ వేడుకుంటున్న విద్యార్థులు

దుర్గమ్మా.. ఆశీర్వదించమ్మా

▸ పరీక్షల ముందు ఆశీస్సులు పొందిన విద్యార్థులు



వన్‌టౌన్, ఫిబ్రవరి 25 : పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించేలా ఆశీర్వదించాలని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను విద్యార్థులు కోరుకున్నారు. ఆదివారం దుర్గగుడికి పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సమక్షంలో హాల్‌టికెట్లు ఉంచి పరీక్షలు బాగారాయాలని మొక్కుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. మాఘ ఆదివారం సందర్భంగా దుర్గగుడిలో సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక అర్చనలు చేశారు. అరుణ పారాయణ, ఆదిత్య హృదయ పారాయణ నిర్వహించారు. సకల ప్రజలకు ఆయురారోగ్యాలను కలగజేయాలని సంకల్పిస్తూ అర్చనలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. ఖడ్గమాలార్చన, చండీహోమం, శ్రీచక్రనవారణార్చన, లక్షకుంకుమార్చన, శాంతి కల్యాణం తదితరాలలో పాల్గొన్నారు. విశాఖపట్నం అబిద్‌నగర్‌కు చెందిన కె.వెంకటేశ్వరరావు, జయంతిలు ఆదివారం ఆలయానికి విచ్చేసి ఈవో రామరావుకు లక్ష రూపాయల విరాళం అందజేశారు.



అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 25 : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో 7వ రోజు, మొదటి ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రంగా మారాయి. రాష్ట్రంలో పలు జిల్లాలు, తెలంగాణా రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కుతీర్చుకున్నారు. ఎండను సైతం లెక్కచేయక భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి, అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో నిలుచున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వెలుపలికి వచ్చేందుకు ఖాళీలేక పోవడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఇబ్బందులు పడ్డారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తిరునాళ్ల మొదటి ఆదివారం కావడంతో పలుప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పాలపొంగళ్లు వండి నైవేద్యం, చీర సారె, పసుపుకుంకుమ సమర్పించారు. కొబ్బరికాయలు, పసుపుకుంకుమ చీరలు, గాజుల దుకాణాలు కిటకిటలాడాయి. గొర్రె పొటేళ్లు, కోడిపుంజులు, చలువకావిడిలతో డప్పువాయిద్యాల నడుమ మొక్కుబడులు తీర్చుకున్నారు.



సభావేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు, ఎమ్మెల్యేలు

సీఎం సభ ఏర్పాట్లు పూర్తిచేయండి

▸ కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

పామర్రు, ఫిబ్రవరి 25 : నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణం విజయవాడ రోడ్డులోని దేవస్థాన భూముల్లో ఈనెల 29న నిర్వహించనున్న సీఎం జగన్మోహన రెడ్డి సభను విజయవంతం చేయాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్థానిక ప్రైవేట్ కళ్యాణ మందిరంలో ఆదివారం అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. ఈసందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు దిశనిర్దేశం చేశారు. సభాస్థలి ప్రాంగణంతో పాటు, హెలిప్యాడ్ ప్రాంతాలను ఎమ్మెల్యేలు పేర్నినాని, కైలేఅనిల్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ ఏఎస్పీ జి.వేంకటేశ్వరరావు, జడ్పీసీఈవో వి.జ్యోతిబసు, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పిఎస్ఆర్‌ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, విద్యుత్ ఈఈ భాస్కరావు, గుడివాడ, ఉయ్యూరు, బందరు ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఏసీబీలో ఐదుగురిపై వేటు

▸ ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్ పోలీసుశాఖకు సరెండర్

▸ సబ్‌రిజిస్ట్రార్ ధర్మసింగ్ ఎఫెక్టేనా?

▸ గతేడాది నవంబరు నుంచి పరారీలో సబ్‌రిజిస్ట్రార్

▸ సాధారణ బదిలీలే అంటున్న ఏసీబీ వర్గాలు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక కానిస్టేబుల్ ఏసీబీలో ఉన్న ఈ ఐదుగురిని ఒకేసారి విధుల నుంచి తప్పించారు. వారిని పోలీసుశాఖకు సరెండర్ చేశారు. ఇప్పుడు ఈ వ్యవహారం ఏసీబీలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఏసీబీ యూనిట్‌లో ఉన్న డీఎస్పీలు శరత్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు కృపానందం, శివకుమార్, కానిస్టేబుల్ సురేష్‌ను ఇక్కడి నుంచి పోలీసు విభాగానికి బదిలీ చేశారు. ఈ ఐదుగురినీ ఒకేసారి బదిలీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏసీబీ వర్గాలు మాత్రం సాధారణ బదిలీల్లో భాగంగానే వారిని బదిలీ చేశామని చెబుతున్నాయి. జనవరి నెలలో ఎన్నికల బదిలీలు జరిగాయి. ఒకేచోట మూడేళ్ల నుంచి పనిచేస్తున్న అధికారులను మార్పు చేయాలని ఈసీ ఆదేశించిన విషయం తెలిసిందే. జనవరి 31వ తేదీ నాటికి ఈ బదిలీలు పూర్తి చేయాలని ఆదేశించింది. అన్ని జిల్లాల్లోను ఎన్నికల బదిలీలు పూర్తయ్యాయి. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు ఉన్నట్టుండి ఈ ఐదుగురిని ఏసీబీ నుంచి పోలీసు శాఖకు పంపడం గమనార్హం.

ఉన్నత స్థాయిలో విచారణ?

ప్రస్తుతం బదిలీ అయిన ఐదుగురిపై ఏసీబీలోని ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలోనే ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్‌ను పోలీసుశాఖకు సరెండర్ చేసినట్టు సమాచారం. సాధారణ బదిలీలు అయితే వారి స్థానంలో కొత్తవారిని నియమించాలి. ఆ పని ఇక్కడ జరగలేదు. ఐదుగురిని బదిలీ చేస్తే ఒక ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఈ మొత్తం పరిణామాలకు ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ లాలా బాలనాగ ధర్మసింగ్ కేసే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ధర్మసింగ్‌పై జిల్లా ఏసీబీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు అందాయని సమాచారం. ఆయన గాంధీనగరంలోని సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసినప్పుడూ ఈ ఫిర్యాదులు అందినట్టు తెలిసింది. అయినప్పటికీ జిల్లా యూనిట్ అధికారులు ధర్మసింగ్ జోలికి వెళ్లలేదు. దీనితో ధర్మసింగ్ బాధితులు ఏసీబీ సీఐయూ అధికారులను ఆశ్రయించారు. గడచిన ఏడాది నవంబరు 17న సీఐయూ బృందాలు ధర్మసింగ్ ఇంట్లో, కార్యాలయంలో సోదాలు చేయడానికి వెళ్లాయి. అప్పటి వరకు ఇంట్లో ఉన్న ధర్మసింగ్ ఇంటి వెనుక వైపు నుంచి పారిపోయాడు. ఆయన పరారై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఏసీబీ అధికారులకు చిక్కలేదు. ఈ పరిణామంతో జిల్లా యూనిట్ అధికారులపై సీఐయూ విభాగానికి కొన్ని అనుమానాలు మొదలైనట్టు సమాచారం. అసలు ఏసీబీ అధికారులు ఇంటి బయట ఉండగానే ఆ విషయం ధర్మసింగ్‌కు ఎలా తెలిసిందన్నది అనుమానం వ్యక్తమైనట్టు సమాచారం. జిల్లా ఏసీబీ నుంచి బదిలీ అయిన ఐదుగురిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారులు వెళ్లినప్పుడు ధర్మసింగ్ తన ఇంటికి సమీపాన ఉన్న వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధికి ఫోన్ చేసినట్టు తెలిసింది. ఆయన సూచనతోనే ధర్మసింగ్ ఇంటి వెనుక నుంచి పాపోయినట్టు సమాచారం.



మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వైసీపీ కార్పొరేటర్ నాలి శారద భర్త మాధవ

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్ నాలి శారద

▸ కొల్లు రవీంద్రను కలిసిన కార్పొరేటర్ భర్త

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 25 : వైసీపీకి నగరంలో మరో షాక్ తగలనుంది. ఇప్పటికే వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాదివాడ రాములు జనసేన పార్టీలోకి వెళ్లిన నేపథ్యంలో మచిలీపట్నం నగరపాలక సంస్థలో అధికార వైసీపీ 40వ డివిజన్ కార్పొరేటర్ నాలి శారద, ఆమె భర్త నాలి మాధవ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకువచ్చారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్రను మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో కొల్లు రవీంద్రను మచిలీపట్నంలో నాలి మాధవ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని నాని వైసీపీ నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వనందున టీడీపీలో చేరుతున్నట్టు నాలి మాధవ ఆంధ్రజ్యోతికి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, బందరు రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, ఇంజనీర్ మురళీ కృష్ణ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సామాజిక న్యాయం పాటించారు

▸ టికెట్ల ప్రకటనపై ఎమ్మెల్యే పార్థసారథి



పెనమలూరు, ఫిబ్రవరి 25 : శనివారం ప్రకటించిన టీడీపీ తొలివిడత టికెట్ల విషయంలో చంద్రబాబునాయుడు సామాజిక న్యాయం పాటించారని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం పోరంకి వందడుగుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్(బుడ్డి), నూజివీడు టీడీపీ పరిశీలకుడు వీరంకి వెంకట గురుమూర్తిలతో కలిసి విలేకరుల సమావేశం లో మాట్లాడారు. గతానికి భిన్నంగా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండానే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి ఏకంగా 99మంది ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. కోటికి పైగా ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని అభ్యర్థుల గుణగణాలు, విద్యార్హతలు, సామాజిక నేపధ్యాలను ఆధారం చేసుకొని టిక్కెట్లు ప్రకటించడం ఆనందకరమన్నారు. దీనికి భిన్నంగా వైసీపీ కొద్దిమంది అభ్యర్థుల ప్రకటనలో గందరగోళం చెలరేగి ఆశావహులు నిరాశకు గురై.. ఎమ్మెల్యేలను బదిలీలు చేయడం తెలిసిందేనన్నారు. కేవలం కొద్దిమంది అగ్రకులాల నాయకులు వ్యతిరేకించి ఎస్సీ, బీసీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలను ఏకపక్షంగా మార్చడం వైసీపీకే చెల్లిందన్నారు.

నేడు టీడీపీలో చేరిక

సోమవారం రెండువేల మందితో ర్యాలీగా వెళ్లి మంగళగిరి టీడీపీ కార్యాలయంలో 11.30కు పార్టీలో చేరనున్నట్టు పార్థసారథి తెలిపారు. భారీసంఖ్యలో నియోజకవర్గ అభిమానులు, వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరతారని తెలిపారు.

మొదటి జాబితాలో పేరు లేకపోవడం నిరాశ కలిగించింది

▸ బోడె ప్రసాద్



శనివారం ప్రకటించిన టీడీపీ, జనసేన మొదటి జాబితాలో తన పేరు లేకపోవడం నిరాశ, బాధ కలిగించిందని పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా పార్టీని కాపాడుకుంటూ పటిష్టపరిచానని, ప్రస్తుతం పెనమలూరులో టీడీపీ తరపున ఎవరు పోటీచేసినా గెలిచేస్థాయికి తీసుకొచ్చానని పేర్కొన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో ఉన్నానని, రెండో జాబితాలో తన పేరు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేరొకరికి టిక్కెట్ ఇస్తే కార్యకర్తల అభీష్టానికి అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

దళితుల ద్రోహి జగన్ రెడ్డి

▸ శ్రీరాం తాతయ్య, కేశినేని చిన్ని

జగ్గయ్యపేట : దళితులకు ద్రోహం చేసి చరిత్రహీనుడిగా ముఖ్యమంత్రి జగన్ నిలిచాడని టీడీపీ, జనసేన జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ సీనియర్ నేత కేశినేని చిన్నిలు అన్నారు. దళితులు అధికంగా ఉన్న ప్రాంతంలో రాజధాని నిర్మిస్తుంటే ఓర్వలేని వ్యక్తి జగన్ అని విమర్శించారు. ఆదివారం జగ్గయ్యపేటలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో 'దళితుల పిలుపు-తాతయ్య గెలుపు' ఆత్మీయ సదస్సులో నందిగామ టీడీపీ అభ్యర్థిని తంగిరాల సౌమ్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగ సంజయ్ వర్మ, పుచ్చ విజయకుమార్, దేవతోటి నాగరాజు, జ్యోతిబస్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతయ్య, చిన్నిలు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో దళితులకు గతంలో అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని, 150 మందికి పైగా దళితులు హత్యలకు గురయ్యారని అన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం, ఎస్సీ భూముల కొనుగోలు, అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం వంటివి ఎన్నో అమలయ్యాయని చెప్పారు. దళితులకు రక్షణ, ఆత్మగౌరవం కలగాలన్న, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు జరగాలన్నా చంద్రబాబు సీఎం కావాలన్నారు.

భారీగా తరలివచ్చిన దళితులు

జగ్గయ్యపేట అసెంబ్లీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్య పేరు ప్రకటించాక దళితుల ఆత్మీయ సదస్సుకు నియోజకవర్గం నుంచి దళితులు భారీగా తరలివచ్చారు. పట్టణం పసుపుమయంగా మారింది. బైక్ ర్యాలీ, ఎన్టీఆర్ సర్కిల్ మీదగా సాగింది. 1దళితుల ఆత్మీయ సమ్మేళనంలో గౌరవరం గ్రామం నుంచి 20 కుటుంబాలు కేశినేని చిన్ని సమక్షంలో వైసీపీకి బైబై చెప్పి టీడీపీలో చేరారు.

28న మినీ జాబ్‌మేళా

వన్‌టౌన్, ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 వతేదీన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ బీటెక్, ఫార్మసీ, ఐటీఐ డిప్లమా అర్హత కలిగిన అభ్యర్థులు skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నాలుగు కంపెనీలు పాల్గొంటాయని, కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 9347779032 నెంబరులో సంప్రదించాలన్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు ధీరజ్

▸ ఆసియా కప్ ఆర్చరీలో మూడు స్వర్ణాలు



విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 : నగరానికి చెందిన యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖరారు చేసుకున్నాడు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో జరుగుతున్న ఆసియాకప్ లీగ్-1 టోర్నీలో స్వర్ణాలతో సత్తాచాటాడు. భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ తొలిసారిగా రికర్వ్ విభాగంలో పురుషుల విభాగంలో స్వర్ణం వశం చేసుకున్నాడు. రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్ రమేష్ జాదవ్‌లతోను, రికర్వ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సిమ్రన్ జిత్‌లతో కలిసి రెండు స్వర్ణాలను ధీరజ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఓల్గా ఆర్చరీ అకాడమీలో ప్రధాన కోచ్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ వద్ద ధీరజ్ శిక్షణ పొందుతున్నాడు. ప్రథమ ర్యాంకర్‌గా కొనసాగుతూ పారిస్ బెర్త్‌ను సాధించడం అభినందనీయమని ఉమ్మడి కృష్ణాఆర్చరీ అసోసియేషన్, కోచ్ చెరుకూరి సత్యనారాయణలు ధీరజ్‌ను అభినందించారు.

రైతులను నమ్మించి నట్టేటముంచిన వైసీపీ ప్రభుత్వం

▸ యార్లగడ్డ వెంకట్రావు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 25 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా నగదు చెల్లించకపోవడం రైతులను నమ్మించి మోసం చేయడమేనని టీడీపీ-జనసేన గన్నవరం ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆరుగొలనులో తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రహదారి దిగ్బంధనం, నిరసనసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిచౌంగ్ తుపాను ధాటికి జిల్లా వ్యాప్తంగా 3.5లక్షల ఎకరాల్లోని పంట నష్టపోతే ఇంతవరకూ ప్రభుత్వం స్పందించలేదని, క్రాప్ ఇన్సూరెన్స్ బకాయిలు కూడా చెల్లించకపోవడం వైసీపీ ప్రభుత్వ చేతకానితనం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయంలో రంగుమారిన, ముక్కిపోయిన ధాన్యం కూడా కొన్న వెంటనే రైతులకు చెల్లింపులు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. ధాన్యం సొమ్ములు తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన శ్రేణుల్లో సహనం నశిస్తే జరిగే విపత్కర పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆరుగొలనులో నిరసన కార్యక్రమంలో పోలీసులు అడ్డుతగలడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రెస్‌మీట్‌లు పెట్టి టీడీపీ నాయకులపై కేసులు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషకుమార్, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, దొంతు చిన్నా, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వీఎంసీ ఆదాయానికి గండి!

(5వ పేజీ తరువాయి)

షెడ్యూలు ఖరీదు జీఎస్టీతో కలిసి రూ.3,500గా నిర్ణయించారు. వేలంపాటలో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులు తమ బినామీల పేర్లతో 15 టెండర్లు వేశారు. ఒక్కొక్కరు రెండు షాపులను పొందేలా ప్లాన్ వేశారు. మరోవైపు ఇతర వ్యాపారులు ఎవరూ టెండరులో పాల్గొనకుండా ఉండేందుకు టెండర్ షెడ్యూలు ప్రకటనను అధికారులు రహస్యంగా ఉంచారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

వారిద్దరికే దక్కిన షాపులు

ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం టెండర్లు వేసిన ఇద్దరు వ్యక్తులకే రెండేసి షాపులు దక్కడం గమనార్హం. వాస్తవానికి ఎన్టీఆర్ కాంప్లెక్సులో ఒక్కో దుకాణానికి గుడ్‌విల్ రూ.25 లక్షలు, నెలకు అద్దె రూపంలో రూ.45 వేల నుంచి రూ.75 వేల వరకు వస్తుంది. మిగిలిన దుకాణాల విషయంలో వీఎంసీ ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. అయితే ఈ నాలుగు దుకాణాల వ్యవహారంలో పాటదారులతో అధికారులు కుమ్మక్కయి సుమారు రూ.80 లక్షలపైచిలుకు పక్కదారి పట్టించినట్టు ఆరోపణలు ఉన్నాయి. షాపులు దక్కించుకున్న ఇద్దరు వ్యక్తులకు ఇప్పటికే ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఒకరికి ఆరు షాపులు, మరొకరికి నాలుగు షాపులు ఉండటం గమనార్హం.

ఏఎంసీ కాంప్లెక్స్‌లోనూ అదే దారి

ఏఎంసీ కాంప్లెక్సులోని ఐదు దుకాణాలకు ఇటీవల వేలం పాట నిర్వహించారు. వీటి విషయంలోనూ అధికారులు చేతివాటం ప్రదర్శించి వీఎంసీ ఆదాయానికి గండికొట్టారు. ఈ దుకాణాలకు రూ.12,92,544 నుంచి రూ.25,88,688 వరకు గుడ్‌విల్, ఈఎండీ రూ.3,23,136 నుంచి రూ.6,53,933 వరకు చెల్లించాలి. షెడ్యూలు ఖరీదు జీఎస్టీతో కలిపి రూ.3,540గా నిర్ణయించారు. షాపుల అద్దె రూ.35,904 నుంచి రూ.71,908 వరకు నిర్ణయించారు. అధికారులు షాపు నెంబరు 37ను రెండు భాగాలుగా విభజించారు. 37ఏ షాపునకు వేలం పాట నిర్వహించారు. అయితే ఈ షాపునకు రూ.12,90,000 గుడ్ విల్ మాత్రమే పెట్టారు. వేలంపాటలో పాయకాపురానికి చెందిన అమరయ్యకు దీన్ని కట్టబెట్టారు. వాస్తవానికి సుమారు రూ.26 లక్షల గుడ్ విల్, రూ.71 వేల అద్దె ఈ షాపునకు రావాల్సి ఉంది. 37ఏ షాపునకు తక్కువ డిపాజిట్, తక్కువ అద్దెకు కట్టబెట్టడంపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చినా అధికారులు లెక్కచేయలేదు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేయించి పాటదారుడికి షాపును కట్టబెట్టారు.

అక్రమార్కులకు అధికారుల అండ!

▸ రొయ్యూరు క్వారీలో ఇసుక తరలింపు షురూ..

▸ కేసుల భయంతో వెనక్కి తగ్గిన స్థానికులు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 25 : రొయ్యూరులో ఇసుక క్వారీకి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదివారం రాత్రి నుంచి తవ్వకాలు తిరిగి ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి గ్రామస్థులు ట్రాక్టర్లను అడ్డుపెట్టి ఇసుక తవ్వకాలను అడ్డుకున్న విషయం తెలిసిందే. శనివారం రాత్రి వరకు క్వారీని నడవకుండా ప్రజలు అడ్డుకున్నప్పటికీ క్వారీ నిర్వాహకులుగాని, అధికారులుగాని స్పందించలేదు. శనివారం రాత్రి తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎస్సై పి.విశ్వనాథ్ రొయ్యూరు వచ్చి గ్రామస్థులతో చర్చలు జరిపారు. రోడ్డును బాగుచేస్తారని, గ్రామంలోని ట్రాక్టర్లకు రూ. 1200లకు ఇసుక ఇస్తారని అధికారులు క్వారీ నిర్వాహకులను ఒప్పించారు. శాంతి భద్రతల సమస్య ఎదురైతే కేసులు నమోదు చేస్తామని ఎస్సై చెప్పటంతో ప్రజలు వెనక్కి తగ్గారు. దాంతో ఆదివారం యధావిధిగా క్వారీని తెరిచి ఇసుక తవ్వకాలు చేపట్టారు. క్వారీలో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా స్పందించని అధికారులు గ్రామస్థులతో చర్చలు జరపటం తీవ్ర విమర్శలకు దారితీసింది. మంత్రి, ఎమ్మెల్యేల ఆదేశాలతోనే క్వారీకి గుడ్డిగా అనుమతి ఇచ్చారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.90

బొండా ఉమా విజయమే లక్ష్యం

● ఆయన కోసం ప్రచారం చేస్తాం: అమరావతి రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు కబడ్డీ శ్రీను

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయమే లక్ష్యంగా అమరావతి రాష్ట్ర కాపునాడు పనిచేస్తుందని, ఆమేరకు విస్తృత ప్రచారం చేస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు(కబడ్డీ శ్రీను) తెలిపారు. గవర్నరుపేటలో కాపునాడు కార్యాలయాన్ని బొండా ఉమా ప్రారంభించిన సందర్భంగా కబడ్డీ శ్రీను మాట్లాడారు. ఉమా వెంట మొత్తం కాపునాడు ఉందన్నారు. వైసీపీ వల్ల నష్టపోయిన కాపులెవరూ ఆపార్టీకి మద్దతు ఇవ్వడంలేదన్నారు. ఉమాను గెలిపిస్తే కాపు సామాజికవర్గానికి ఎంతో మేలు జరుగుతుందని కాపునాడు గౌరవ అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు తెలిపారు.

పురుగుల మందు తాగి
ఆటోడ్రైవర్ ఆత్మహత్య

చిట్టినగర్, ఫిబ్రవరి 25: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆటోడ్రైవర్ పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయిరామ్ థియేటర్ ప్రాంతంలో షేక్ షాహినా కుటుంబంతో నివాసముంటోంది. భర్త వలీ ఆటోడ్రైవర్. ఆర్థిక ఇబ్బందులతో తన భర్త శనివారం పురుగుల మందు తాగాడని, హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొంది.

మేడపై నుంచి దూకి
పక్షవాత బాధితుడి ఆత్మహత్య

చిట్టినగర్, ఫిబ్రవరి 25: మేడపై నుంచి దూకి పక్షవాతంతో బాధపడుతున్న ఆత్మహత్యకు పాల్పడినట్టు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్సార్ కాలనీకి చెందిన పి.కౌసల్యకు భర్త సోమినాయుడుతో గొడవలుండడంతో ఎని మిదేళ్లగా విడి విడిగా ఉంటున్నారు. సోమినాయుడు అదే ప్రాంతంలో బ్లాక్-34లో ఉంటున్న ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఏడాది క్రితం సోమినాయుడికి పక్షవాతం వచ్చి కాలుచెయ్యి పడిపోయాయి. దీంతో ఆ మహిళ తనకు వేరే వ్యక్తితో వివాహమైందని, సోమినాయుడిని కౌసల్య వద్ద ఈనెల 4వ తేదీన విడిచి వెళ్లింది. కౌసల్య ఇళ్లు మారుతున్నానని భర్త సోమినాయుడిని రెండు రోజులు చూసుకోమని శనివారం ఆ మహిళ వద్ద దించి వెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున మేడపై నుంచి సోమినాయుడు పడి చనిపోయాడని కౌసల్యకు ఫోన్ వచ్చింది. అక్కడికి వెళ్లి చూస్తే సోమినాయుడు చనిపోయి ఉన్నాడు. దీంతో కౌసల్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1.6 కిలోల గంజాయి స్వాధీనం

● విక్రేత అరెస్టు

చిట్టినగర్, ఫిబ్రవరి 25: ఎర్రకట్ట, చిట్టినగర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న రౌడీషీటర్‌ను కొత్తపేట పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 1.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చిట్టినగర్ ఎర్రకట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. సీఐ గణేష్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గంజాయి విక్రయిస్తున్న సొరంగంరోడ్డుకు చెందిన రౌడీషీటర్ బియ్యపు లోకేశ్‌ను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ గణేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే దళితుల అభ్యున్నతి

అసెంబ్లీ అభ్యర్థుల తొలిజాబితాలో ఎస్సీలకు ప్రాధాన్యం: ఎంఎస్ బేగ్

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 25: "టీడీపీ దళితులకు అండగా ఉండే పార్టీ అని, దళితుల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని, మొదటి విడతగా పార్టీ ప్రకటించిన 94 అసెంబ్లీ అభ్యర్థుల్లో 23 స్థానాలను దళితులకు కేటాయించి వారికి ప్రాధాన్యం ఇచ్చిందని టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. రాష్ట్రం బాగుండాలంటే, రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వాలని ఆయన ఆకాంక్షించారు. 35వ డివిజన్, పెజ్జోనిపేటలోని ఆర్సీఎం చర్చిలో ఎంఎస్ బేగ్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో మంచి పరిపాలన, రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం దళిత నాయకులపై కేసులు పెట్టించి, డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిందని ఆరోపించారు. దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబును సమర్థించిన దుర్మార్గ ప్రభుత్వమిదని అన్నారు. నా ఎస్సీలు, నా దళితులు అన్న జగన్ దళితులకు ఎక్కడ ప్రాధాన్యం ఇచ్చారని, దాడులుపై ఎప్పుడు స్పందించారని, దళితులకు ఎప్పుడు గౌరవం ఇచ్చారని బేగ్ ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి దళితులు సిద్ధంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ఏర్పడబోయే టీడీపీ- జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని అన్నారు. పశ్చిమ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కమిటీ క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, మహిళా యువత అనుబంధ సంఘాలు పాల్గొన్నారు.



పెజ్జోనిపేట ఆర్సీఎం చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎంఎస్ బేగ్



బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి గుడిలో స్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి గుడిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామికి పుష్పయాగం నిర్వహించారు. పుష్ప శోభిత వెంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. వంకదార వాసుదేవ రావు-రత్నకుమారి, విజయ్ కుమార్-శ్రావణి, తాడేపల్లి వెంకటరమణమూర్తి-బాలా త్రిపురసుందరి దంపతులు పూజలు చేశారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ కార్యక్రమాలను నిర్వహించారు. అద్దంకి- కిషోర్‌బాబు, మహిత దంపతులు, లీలా వైష్ణవి కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఈవో ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

దుర్గగుడిలో అన్న వితరణకు రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: దుర్గగుడిలో అన్నవితరణకు రాజ మండ్రికి చెందిన ఎ.చినసత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. ఆదివారం ఏఈవో రమేష్‌కు నగదును అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.



రూ.లక్ష చెక్కు అందిస్తున్న చినసత్యనారాయణ కుటుంబసభ్యులు

ధర్మపథం వేదికపై హరికథ

ధర్మపథం వేదికపై ఆదివారం డాక్టర్ సప్పాభారతి భాగవతారిణి పార్వతీ కల్యాణం హరికథా గానం చేశారు. దశిక రమేష్ హార్మోనియంతో, పొడుగు ప్రభాకర్ మృదంగంతో సహకరించారు.



ఆందోళన చేస్తున్న 39వ డివిజన్ అంబేడ్కర్ రోడ్డులోని స్థానికులు

సెల్‌టవర్ తొలగించండి

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: ప్రజలకు ఇబ్బందికరంగా మారిన సెల్‌ఫోన్ టవర్‌ను తొలగించాలని 39వ డివిజన్‌లోని అంబేడ్కర్ రోడ్డులో ఎడమవైపున నాగుల్‌మీరా దర్గా వద్ద నివాసులు తమ ఇళ్ల మిత్రా ఆస్పత్రి భవనం డాబాపై ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను తొలగించాలని ఆదివారం ధర్నా చేశారు. గత ఏడాది అక్టోబరులో టవర్‌ను ఏర్పాటు చేశారన్నారు. 20 కుటుంబాల వారు సెల్‌టవర్ చుట్టూ నివాసం ఉంటున్నారని, 12 ఏళ్లలోపు పిల్లలు 20 మంది, 50 ఏళ్లకు పైబడిన వారు మరో 20 మంది ఉన్నారని వీరంతా రేడియేషన్‌కు గురవుతున్నారని, అనారోగ్యం పాలయ్యేందుకు అవకాశం ఉందని వెంటనే టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎం.నారాయణస్వామి, సీహెచ్ కనకదుర్గ, నాగేశ్వరరావు, ఎన్.లక్ష్మీకాంతం, సీహెచ్ చిట్టెమ్మ నాయకత్వం వహించారు.



త్రిశక్తిపీఠంలో సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమంలో పాల్గొన్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో సరస్వతీ సహిత
మేధా దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక, ఫిబ్రవరి 25: కాళీమాత(త్రిశక్తిపీఠం) ఆలయంలో పది, ఇంటర్ విద్యార్థుల పరీక్షల దృష్ట్యా సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమాన్ని ఆదివారం వేద పండితులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. సరస్వతీ అష్టోత్తరం, సరస్వతీ పూజ, మేధా దక్షిణామూర్తి, సరస్వతీ హోమాన్ని విద్యార్థులతో చేయించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను సరస్వతీ అమ్మవారి ముందుంచి పూజలు చేశారు. అమ్మవారి రక్షను విద్యార్థులందరికీ అందించారు. దేవస్థానం తరఫున పరీక్షలు బాగా రాసేందుకు విద్యార్థులకు పెన్ను, సరస్వతీ అమ్మవారి ఫొటోను అందించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, కమిటీ సభ్యులు విశ్వేశ్వరయ్య, ఆలపాటి జగన్, రాజా, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, పండితుడు శిష్టా ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

ఏపీ హేతువాద సంఘం అధ్యయన తరగతుల్లో వక్తలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 25: సైన్స్ విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ మూఢ విశ్వాసాలు, మనోన్మాద శక్తుల వలయంలో చిక్కుకున్న సమాజాన్ని చైతన్య పరిచేందుకు శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఏపీ హేతువాదసంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హేతవాద అధ్యయన తరగతులను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వమించారు. రాజ్యాంగం, పౌర హక్కులు, విధులు అనే అంశంపై ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు ప్రసంగించారు. బీజేపీ పాలనలో విద్యారంగం పూర్తిగా కాషాయీకారణ జరుగుతోందని ఆయన అన్నారు. డార్విన్ సిద్ధాంతం, మొఘల్ చరిత్ర తొలగించడం బాధాకరన్నారు. మణిపూర్‌లో కుకీలు నివాసముంటున్న ప్రాంతంలోని గనులను అదానీ, అంబానీలకు కట్టబెటేకట్టేందుకు స్థానికుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. "హేతువాదం- శాస్త్రీయ దృష్టి" అనే అంశంపై ప్రముఖ హేతువాద రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడారు. ప్రతీ అంశాన్ని హేతుబద్ధంగా ఆలోచన చేయాలని దేనిని గుడ్డిగా నమ్మకూడదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నార్నే వెంకటసుబ్బయ్య, జేవీ కృష్ణయ్య ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ వైద్యులు జి.సమరం, ఇండ్ల రామసుబ్బారెడ్డి, ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్, నాస్తిక ఉద్యమ ప్రముఖులు తోటకూర వెంకటేశ్వరరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

● సౌత్ ఏసీపీ రత్నరాజు కౌన్సెలింగ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సౌత్ ఏసీపీ జి.రత్నరాజు హితవు చెప్పారు. ఆదివారం కృష్ణలంక పోలీసు స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లు 50 మందికి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు రౌడీషీటర్ల వివరాలు తెలుసుకున్న ఆయన వారితో మాట్లాడారు. నేరాలకు పాల్పడకపోతే రౌడీషీటును తొలగిస్తామని తెలిపారు. ఎక్కడైనా నేరాలు జరిగితే వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, నేరాలకు పాల్పడడం, ప్రోత్సహించడం, నేరగాళ్లకు అండగా ఉండడం చేయొద్దని హెచ్చరించారు. స్టేషన్ సీఐ ఎ.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రామాయణం..నిత్యపారాయణ గ్రంథం

పటమట, ఫిబ్రవరి 25: రామాయణం ప్రతి ఒక్కరు చదవాల్సిన నిత్య పారాయణ గ్రంథమని, మానవజాతిని ఉద్ధరించడానికి శ్రీరామ చంద్రమూర్తి స్వయంగా మానవుడిగా జన్మించాడని ప్రముఖ ప్రవక్త కరణం సుబ్బారాయుడు తెలిపారు. పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంస్థ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. రామాయణంలోని ముఖ్య సంఘటనలను కళ్లకు కట్టినట్లు సుబ్బారాయుడు వివరించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కల్పన, ఎన్.జానకిలు తమ కవితలతో సభికులను ఆకట్టుకున్నారు. సాహితీ సమావేశంలో కోనేరు వెంకటేశ్వరరావు, కొండపల్లి మాధవరావు, వసంతం శివశంకరరావు, పెద్ది గోపీచంద్, బుడ్డి కృష్ణారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరణం సుబ్బారాయుడు

విద్యాభివృద్ధికి చేయూత

మొగల్రాజపురం, ఫిబ్రవరి 25: ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కాకుండా దాతల సాయం అందుకుని అభివృద్ధిలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ తమలాంటి మరికొందరికి సాయం చేయాలని కృష్ణా యూనివర్సిటీ ఇంగ్లీషు ప్రొఫెసర్ ఎన్.ఉషారాణి సూచించారు. కమ్మ విద్యార్థి సహాయ సంఘం ఆధ్వర్యంలో మొగల్రాజపురం జర్నలిస్టు కాలనీలో ఆదివారం హస్టల్ డేను నిర్వహించారు. హస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. పీహెచ్‌డీ చేసిన పదిమందితో పాటు ఉషారాణిని సత్కరించారు. సంఘం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మల్లినేని రాజయ్య, కార్యదర్శి పర్వతనేని ప్రభాస్, కోశాధికారి చనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.



ఉషారాణిని సత్కరిస్తున్న కమ్మ విద్యార్థి సహాయ సంఘం ప్రతినిధులు

ఐక్యతతోనే కాపుల అభ్యున్నతి

లబ్బీపేట, ఫిబ్రవరి 25: కాపులంతా ఐక్యంగా ఉండాలని అప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందగలమని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. 15వ డివిజన్ కాపునాడు కమిటీని ఆదివారం ఆయన నియమించారు. కాపుల సంక్షేమానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. పేద కాపు మహిళలకు పెళ్లికానుక పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కాపునాడు కమిటీ డివిజన్ అధ్యక్షుడిగా మల్లా నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా సూదాబత్తుల రాజేష్, ఉపాధ్యక్షులుగా మలవరపు సూర్యనారాయణ, అచ్యుత సీతారామయ్యను నియమించారు.

నగరాల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావును కోరిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీరావు

చిట్టినగర్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలోని నగరాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని నగరాల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావుకు నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీరావు సూచించారు. ఆదివారం కేఎల్ రావునగర్‌లోని నగరాల సంఘం రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన పోతిన శ్రీనివాసరావును నగరాల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో నగరాల అభ్యున్నతికి పాటుపడాలని పోతినను కోరారు. సంఘం నాయకులు బాయన శేఖర్‌బాబు, పిళ్లా రవి, రాంపిళ్ల వాసు, మజ్జి శ్రీనివాసరావు, ఎన్.ఎస్.ఆర్, పొట్నూరి శివ, ఇల్లిపిల్లి మునలయ్య పాల్గొన్నారు.



పోతిన శ్రీనివాసరావును సత్కరిస్తున్న నగరాల సంఘం నాయకులు

దిక్సూచి DIKSUCHI

టెలీపతి... అంటే మనం మనసులో అనుకున్న విషయం, అదే సమయంలో మన ఆత్మీయులకు సైతం మానసికంగా స్ఫురించడం. అంటే వ్యక్తుల మధ్య ఉన్న దూరంతో సంబంధం లేకుండా వారి మనసుల మధ్య జరిగే కమ్యూనికేషన్‌గా దీనిని చెప్పుకోవచ్చు. ఇప్పటివరకూ ఇది, అరుదుగా సంభవిస్తున్నా, ఒక ప్రామాణికత లేని భావనే.


'న్యూరా లింక్ ప్రాజెక్ట్' సృష్టికి ప్రతిసృష్టి!

ప్రస్తుతం ఎలాన్ మస్క్‌కు చెందిన 'న్యూరా లింక్స్' సంస్థ ప్రయోగాత్మకంగా ఒక వ్యక్తి మెదడులో కంప్యూటర్ చిప్‌ను విజయవంతంగా అమర్చడం ద్వారా మనసుతోనే కంప్యూటర్‌ను ఆపరేట్ చేయగలిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాజెక్టు పేరు సైతం 'టెలీపతి' కావడం గమనార్హం. ఈ తాజా పరిశోధన ఎందరికో ఆశాదీపం కాగా, వ్యక్తిగత గోప్యతకు మాత్రం భవిష్యత్తులో గొడ్డలిపెట్టుగా మారనుందన్న ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూరాలింక్ టెలీపతి (చెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)

న్యూరాలింక్ సంస్థ చేపట్టిన బ్రెయిన్, కంప్యూటర్ అనుసంధాన ప్రాజెక్టు (బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్)కు 'టెలీపతి' అని నామకరణ చేశారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం, చిప్ అమర్చిన మానవ మెదడులోని ఆలోచనలకు అనుగుణంగా కంప్యూటర్‌ను పనిచేయించడం. మనిషి మెదడు ప్రధానంగా రెండు రకాల విధులను నిర్వర్తిస్తుంది.

1) జ్ఞానేంద్రియపరమైన విధులు (సెన్సరీ ఫంక్షన్స్)
2) కదలికలపరమైన విధులు (మోటార్ ఫంక్షన్)



జ్ఞానేంద్రియాలకు, మెదడుకు మధ్య ఉండే అనుసంధానత ద్వారా రుచి, వాసన, స్పర్శ వంటి అనుభూతులను పొందగలం. ఇవి జ్ఞానేంద్రియాలపరంగా మెదడు నిర్వర్తించే సెన్సరీ ఫంక్షన్స్. అదేవిధంగా కళ్లు తెరవడం, నడవడం, చేతులు కదపడం వంటి మానవ శరీర కదలికలు ఆయా అవయవాలకు, మెదడుకు మధ్య గల అనుసంధానత వల్ల సాధ్యపడతాయి. ఇవి మెదడు నిర్వర్తించే మోటార్ ఫంక్షన్స్.

ఈవిధంగా మనిషి కదలికలు, అనుభూతులు, శరీరంలో ఉత్పత్తయ్యే హార్మోన్ల వంటి వివిధ రసాయనిక చర్యలన్నింటికీ మెదడు ఆయా అవయవాలకు ఇచ్చే సంకేతాలే కారణం. ఒక అధునాతన వైర్‌లెస్ చిప్‌ను మెదడులో అమర్చడం ద్వారా ఆ చిప్‌లోని ఎలక్ట్రోడ్స్ మెదడు ఇచ్చే సంకేతాలను గ్రహించి, అనుసంధానిత వస్తువులతో కమ్యూనికేషన్ జరుపుతాయి. ఇంటర్నెట్ అనుసంధానత గల ఏ పరికరాన్ని అయినా ఈ కమ్యూనికేషన్ విధానంలో వైర్‌లెస్‌గా, కేవలం మెదడులో జరిగే ఆలోచనల ద్వారా నియంత్రించవచ్చు.

టెలీపతి ప్రాజెక్టులో భాగంగా చిప్ అమర్చిన వ్యక్తి మెదడులోని ఆలోచనల ద్వారా కంప్యూటర్ మౌస్‌ను నియంత్రిస్తూ, కంప్యూటర్‌ను ఆపరేట్ చేయించగలుగుతారు. ఈ విధానాన్ని 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్'గా వ్యవహరిస్తున్నారు.

మానవ మస్తిష్కంలో అమర్చే ఈ వైర్‌లెస్ చిప్‌లో మనిషి వెంట్రుకతో పోల్చిన 20వ వంతు మందం మాత్రమే కలిగిన సన్నని ఎలక్ట్రోడ్స్ దాదాపు మూడువేల వరకూ అమర్చి ఉంటాయి. మస్తిష్క నాడీవ్యవస్థలో కీలకమైన వెన్నెముక దెబ్బతినడం, పక్షవాతం, ఆటిజం వంటి సమస్యల వల్ల కదలికల పరమైన సమస్యలు గల వ్యక్తులకు ఈ పరిశోధన ఒక వరమని చెప్పవచ్చు.

అంతేకాక భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ఇప్పటివరకూ త్రీడీ, వర్చువల్ అనుభూతులను పొందిన ప్రేక్షకులు ఇకపై ఈ కొత్త సాంకేతికతకు సెన్సరీ ఫంక్షన్స్ జత అయితే అనుభవపూర్వక ఆస్వాదనలూ పొందవచ్చు. రుచి, వాసన, బాధ, స్పర్శ వంటి భావోద్వేగ అనుభూతులు అందివస్తాయి. అయితే ప్రస్తుతం కేవలం కదలికలకు సంబంధించిన మోటార్ ఫంక్షన్స్‌లో వైద్యపరమైన ప్రయోగాలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ పరిజ్ఞానం ద్వారా ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇతరత్రా ప్రయోగాలకు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ప్రయోజనాల మాట అటుంచితే అనేక సమస్యలను ఈ సరికొత్త టెక్నాలజీ ఆహ్వానిస్తోంది. కేవలం మానవ మస్తిష్కంలో మాత్రమే ఇంతవరకూ గోప్యత సాధ్యమవుతూ వచ్చింది. ఈ టెక్నాలజీ ద్వారా ఇకపై అంతరంగిక గోప్యత సాధ్యపడకపోవచ్చు. నేరపరిశోధన వంటి కొన్ని విషయాలకు, లైవ్ డిటెక్టర్ వలె ఇది ఉపయోగపడినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛకు భారీ ప్రమాదం పొంచి ఉంది. ఆధార్‌లోని బయోమెట్రిక్ సమాచారాల చౌర్యం ద్వారా అనేక నేరాలు జరుగుతున్న ఈ తరుణంలో మనసులోని గుట్టును సైతం వెలికితీయగల అవకాశం ఉన్న ఈ టెక్నాలజీతో జరగనున్న దారుణాలు ఊహాతీతంగా చెప్పుకోవచ్చు.

> భవిష్యత్తులో ఈ 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యపడి సరికొత్త పరికరాల సృష్టి ద్వారా నడవలేనివారు నడవవచ్చు, వినలేనివారు, మాట్లాడలేనివారు, చూడలేనివారు, ఆ పనులను సైతం చేయవచ్చు. అదేవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కే అవకాశముంది. ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని మున్ముందు ఉంచవచ్చు. అయితే అనుకూలతలతో పాటు ప్రతికూలతలు కూడా మెండుగానే ఉంటాయి.



మనిషి చిప్ అమర్చుకున్న మస్తిష్కం ద్వారా వివిధ పరికరాలను వైర్‌లెస్‌గా, అంతర్జాల అనుసంధానతతో పనిచేయించడం అంటే అనేక నేరాలు చేతికి మట్టి అంటకుండా పూర్తి చేసేయడానికి సైతం అవకాశం చిక్కినట్లే.

ఇదేవిధంగా వ్యక్తుల మస్తిష్కాల మధ్య ఈ చిప్ అనుసంధానత ఏర్పరిస్తే సరికొత్త కమ్యూనికేషన్ సిస్టమ్ సైతం ఏర్పడుతుంది. దీని ప్రయోజనాలు, నష్టాలు కూడా ఊహాతీతంగానే ఉంటాయి. నయా బానిసత్వం, నయా ఉగ్రవాదం వంటి సరికొత్త ధోరణులు సైతం ఆవిర్భవించవచ్చు. ఒక వ్యక్తి ఆలోచనలు తెలుసుకోగలిగే అవకాశం ఉండటంతో మానవ సంబంధాలు దెబ్బతినవచ్చు.

జంతువుల మెదళ్లలో సైతం ఈ చిప్‌లను ప్రయోగాత్మకంగా అమర్చి నూరాలింక్స్ సంస్థ పరిశీలించింది. ఒక కోతి వీడియో గేమ్‌ను ఆడగలిగింది. ఈవిధంగా ఈ పరిశోధనలు మరింత ముందుకువెళితే జంతువులు సైతం కృత్రిమ మేధతో అనుసంధానించడం ద్వారా వాటి ప్రవర్తనలో మార్పులు వస్తాయి.

ప్రాకృతిక స్వాభావికతకు విభిన్నంగా 'త్రిశంకు స్వర్గాన్ని' పోలిన ప్రతిసృష్టిని మున్ముందు ఉంచవచ్చు. అనేక వ్యాధులు, వైకల్యాలపరంగా వరం అయిన ఈ సాంకేతికత, మానవ సంబంధాలు, అధూయిత్వాలపరంగా మాత్రం మానవాళికి శాపంగా పరిణమించే అవకాశం ఉంది. క్లోనింగ్ వంటి జీవశాస్త్ర సాంకేతికతలను నియంత్రించినవిధంగానే ఈ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్‌ను, వైద్యపరమైన ప్రయోజనాలకు మాత్రమే అనుమతించడం వల్ల మానవాళి ప్రమాదంలో పడకుండా ఉంటుంది.




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-2

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 12 బి) 13 సి) 18 డి) 15

సమాధానం: (డి)

వివరణ: మొదటి డయాగ్రామ్‌లో 12 - 4 = 8, 9 - 3 = 6 (8 + 6 = 14)
రెండో డయాగ్రామ్‌లో 8 - 5 = 3, 23 - 15 = 8 (3 + 8 = 11)
కాబట్టి మూడో డయాగ్రామ్‌లో 16 - 13 = 3, 18 - 6 = 12 (3 + 12 = 15)

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 60 బి) 56 సి) 48 డి) 36

సమాధానం: (సి)

వివరణ: ప్రతి డయాగ్రామ్‌లో పైన కుడివైపు గల సంఖ్యను 4తో గుణిస్తే ఎడమ వైపు సంఖ్య, 6తో గుణిస్తే డయాగ్రామ్‌కు కింద గల సంఖ్యగా వస్తుంది.
14 x 4 = 56 8 x 4 = 32
14 x 6 = 84 8 x 6 = 48
కావున 12 x 4 = 48, 12 x 6 = 72

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?


6	12	9
8	7	6
14	19	?

ఎ) 12 బి) 15 సి) 54 డి) 22

సమాధానం: (బి)

వివరణ: నిలువుగా 6 + 8 = 14, 12 + 7 = 19
కాబట్టి 9 + 6 = 15 సమాధానం అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 261 బి) 216 సి) 48 డి) 252

సమాధానం: (బి)

వివరణ: సరళ రేఖలు ఒకపక్క చిన్న సంఖ్య. మరొక పక్క ఆ చిన్న సంఖ్య ఘనం.
3^3=27, 5^3=125, 4^3=64. కావున 6^3=216

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?




ఎ) 10 బి) 15 సి) 18 డి) 16

సమాధానం: (ఎ)

వివరణ: పై డయాగ్రామ్‌లో రెండు అంకెల లబ్దం నుంచి కింద రెండు అంకెల మొత్తాన్ని తీసివేస్తే చిన్న వృత్తంలో గల సంఖ్య వస్తుంది.
8 x 6 = 48 10 + 12 =22 48 - 22 = 26
9 x 7 = 63 13 + 14 = 27 63 - 27 = 36
కాబట్టి 4 x 9 = 36 11 + 15 = 26
36 - 26 = 10 సమాధానము అవుతుంది.

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 25 బి) 24 సి) 18 డి) 27


సమాధానం: (ఎ)

వివరణ: వృత్తానికి నాలుగువైపుల గల సంఖ్యలు వివిధ అంకెల వర్గాలు. ఆయా అంకెలను కూడిన వృత్తంలో గల సంఖ్య వస్తుంది.
64 అంటే 8^2, 25 అంటే 5^2, 36 అంటే 6^2, 81 అంటే 9^2.



8 + 5 + 6 + 9 = 28
49 అంటే 7^2, 36 అంటే 6^2, 25 అంటే 5^2, 16 అంటే 4^2.
7 + 6 + 5 + 4 = 22 అదే విధంగా
49 అంటే 7^2, 36 అంటే 6^2, 16 అంటే 4^2, 64 అంటే 8^2.
7 + 6 + 4 + 8 = 25 సమాధానం అవుతుంది.

7. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 196 బి) 162 సి) 289 డి) 361

సమాధానం: (ఎ)

వివరణ: 8 + 4 = 12 12^2 = 144
6 + 2 = 8 8^2 = 64
7 + 2 = 9 9^2 = 81అదే విధముగా 9 + 5 = 14
14^2 = 196
సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

టీడీపీ హయాంలో మాదిగ ఉపకులాలకు లబ్ధి

» 25 వేల మందికి ఉద్యోగాలొచ్చాయి: మంద కృష్ణ మాదిగ

తుమ్మపాల(అనకాపల్లి), ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ పాలనలో మాదిగ ఉప కులాలకు చెందిన 25వేల మంది ఉద్యోగాలు పొందారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం రాత్రి అనకాపల్లిలో జరిగిన ఎంఆర్‌పీఎస్ సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని, దీనికోసం 30 ఏళ్లుగా ఉద్యమిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తీర్పును రిజర్వు చేసిందని, వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రెచ్చిపోయిన మద్యం మాఫియా

» సెబ్ పోలీసులపై విరుచుకుపడి దాడి..అనంతలో ఘటన

హిందూపురం, ఫిబ్రవరి 25: మద్యం మాఫియా రెచ్చిపోయింది. ఏకంగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న సెబ్ పోలీసులపైనే దాడికి తెగబడింది. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులో శనివారం రాత్రి సెబ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, వాహన డ్రైవర్ పురుషోత్తంపై మద్యం మాఫియా దాడి చేసింది. హిందూపురం సెబ్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, వాహన డ్రైవర్ పురుషోత్తం శ్రీరంగరాజులపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులో వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా బైక్‌లో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. రెండు బాక్సుల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు గుర్తించారు. బండి పక్కకు ఆపమని వివరాలు ఆరాతీస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కర్ణాటకలోని విట్లాపురానికి చెందిన వారికి సమాచారం ఇచ్చాడు. ఆ గ్రామం నుంచి ఐదారుగురు అక్కడికి చేరుకున్నారు. వచ్చీరాగానే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్‌పై దాడి చేయబోగా.. అక్కడే ఉన్న పోలీసు వాహన డ్రైవర్ అడ్డుకునేందుకు యత్నించారు. దుండగులు కర్రలతో పురుషోత్తం తలపై బాదారు. ఆయన కిందపడిపోగా ద్విచక్రవాహనం, మద్యంతో పరారయ్యారు. కాసేపటి తర్వాత తేరుకుని హెడ్‌కానిస్టేబు ల్, డ్రైవర్ హిందూపురానికి వచ్చి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

'చలో'పై తలో మాట

- » తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం
- » 49 డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ: ఏపీజేఏసీ
- » ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా ఎందుకీ నిర్ణయం?
- » ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- » ఏపీజేఏసీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం: యూటీఎఫ్
- » ప్రభుత్వం నుంచి హామీలు లేకుండా వాయిదా ఎందుకు?
- » ఇలాంటి నిర్ణయం ఉద్యోగులను వంచించడమే: ఏపీటీఎఫ్

విజయవాడ/అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఏపీజేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ బి.హృదయరాజు ప్రకటించారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో ఆదివారం సాయంత్రం రాష్ట్ర నాయకత్వంతో వీరిద్దరూ అత్యవసరంగా వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏపీజేఏసీ తరఫున 49 డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. ఆ మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం) తమతో రెండు సమావేశాలు నిర్వహించిందని, తమ డిమాండ్లపై రాతపూర్వకమైన హామీ ఇవ్వటంతో పాటు వారంలో సమావేశం నిర్వహిస్తానని సీఎస్ చెప్పటం వల్లే 27న నిర్వహించ తలపెట్టిన 'చలో విజయవాడ'ను తాత్కాలికంగా వాయిదా వేశామని వివరించారు. ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లపై నిర్దిష్టమైన హామీలు వచ్చాయన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పోలీసుల టీఏ, డీఏ, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ వంటివి జమచేయడం ద్వారా ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. 12వ పీఆర్సీకి 9మంది సిబ్బందిని నియమిస్తూ జీవో జారీ చేశారని చెప్పారు. జూలైలో నేరుగా పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 2004కి ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికై ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన టీచర్లు, పోలీసులు, ఇతర ఉద్యోగులకు ఓపీఎస్ అమలు, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, స్థానిక సంస్థల్లో (జడ్పీ, ఎయిడెడ్) కారుణ్య నియామకాలు, కాంట్రాక్టు ఉద్యోగులను విడతలవారీగా క్రమబద్ధీకరించడం, మహిళా టీచర్లు, ఉద్యోగినులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు నిర్దిష్ట గడువు లేకుండా ఎప్పుడైనా వాడుకునే అవకాశంతో పాటు వివిధ శాఖల్లో సమస్యల పరిష్కారానికి సంబంధించి లిఖితపూర్వక హామీ ఇచ్చిన నేపథ్యంలో ఏపీజేఏసీ రాష్ట్ర సభ్యుల అభిప్రాయాల మేరకు 'చలో విజయవాడ'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు బండి శ్రీనివాసరావు వివరించారు.

రేపు జిల్లా కేంద్రాల్లో నిరసనలు: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యమంలోకి దిగిన ఏపీజేఏసీ నాయకులపై ముందస్తుగా బైండోవర్ కేసులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడాన్ని నిరసిస్తూ 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన తెలుపుతామని బండి శ్రీనివాసరావు ప్రకటించారు.

ఏపీజేఏసీ నిర్ణయం సరికాదు: యూటీఎఫ్

లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడాల్సిన ఏపీజేఏసీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే 'చలో విజయవాడ' పిలుపును వాయిదా వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఉద్యమం చేయాల్సిన సమయంలో అర్ధంతరంగా వాయిదా వేయడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పోరాటాన్ని కొనసాగించాలని ఏపీజేఏసీని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, ఏఎస్ కుసుమ కుమారి, కోశాధికారి బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందకుండానే చలో విజయవాడను వాయిదా వేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమేనని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి అన్నారు. పీఆర్సీ, ఐఆర్ ఏ విషయంలోనూ ప్రభుత్వం నుంచి హామీ లేకుండా ఎందుకు వాయిదా వేశారని నిలదీశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజేఏసీ నేతలు

వేదవతిని గుల్ల చేశారు!

- » నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- » రోజూ వందల ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా
- » మంత్రి జయరాం సోదరుల దందా
- » ఎల్లెల్సీ టెండర్లూ తమ వారికే

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లాలో వేదవతి నదిని ఇసుక మాఫియా గుల్లచేసింది. మంత్రి గుమ్మనూరు జయరాం అండతో అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి అక్రమంగా రవాణా చేశారు. అధికారం మాటున అక్రమార్కులు రోజూ వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. ఏ అధికారైనా ప్రశ్నిస్తే క్షణాల్లో మంత్రి సోదరుల నుంచి ఫోన్లు రావడంతో అక్కడే ట్రాక్టర్లు వదిలేసి వెళ్లేవారు. దీంతో యథేచ్ఛగా ప్రకృతి వనరులను కొల్లగొట్టిన మంత్రి అనుచరులు, సోదరులు రూ.కోట్లకు పడగలెత్తారు. కర్నూలు జిల్లాలో ఏపీ- కర్ణాటక సరిహద్దులో వేదవతి నది ప్రవహిస్తోంది. ఆలూరు నియోజకవర్గంలో హాలహర్వి, హోళగుంద మండలాల నుంచి కర్ణాటకలోని శిరుగుప్ప నియోజకవర్గంలో అడుగుపెట్టి తుంగభద్ర నదిలో కలుస్తుంది. హలహర్వి మండలం గూళ్యం, జె.హోసళ్లి, హోళగుంద మండలం మార్లమడికి గ్రామాల సమీపంలో ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే ఎక్స్‌కవేటర్లు పెట్టి తవ్వే స్థాయిలో నిల్వలు లేవని, ఇక్కడ ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తే భూగర్భ జలా లు అడుగంటి రైతులు, సమీప గ్రామాలు తీవ్రం గా నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఇరిగేషన్, మైనింగ్, గ్రామీణ తాగునీటి విభాగం అధికారుల కమిటీ ఇసుక రీచ్ ఏర్పాటు కు అనుమతి ఇవ్వలేదు. స్థానిక ప్రజల అవసరా ల నిమిత్తం ఎద్దుల బండ్లపై మాత్రం ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే నిబంధనలు తుంగలో కలిపేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తవ్వకాలు సాగించారు.



కర్నూలు జిల్లా హోళగుంద సమీపంలో వేదవతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు(ఫైల్)

మంత్రి అండతో తవ్వకాలు

టీడీపీ హయాంలో వేదవది నదిపై 'వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు' నిర్మించి లక్ష ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే ఆశయంతో రూ.1,986 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన మంత్రి గుమ్మనూరు జయరాం ఈ ప్రాజెక్టును నిర్మించలేదు కానీ.. ఆయన సోదరుడు, వైసీపీ కీలక నాయకుడు ఒకరు నదిలో ఇసుక నిల్వలపై కన్నేశాడు. ఆయన అండతో ఇసుక మాఫియా పెట్రేగిపోయి ఇష్టానుసారంగా తవ్వకాలు సాగించింది. మార్లమడికి నుంచి రోజుకు 200 నుంచి 300 ట్రాక్టర్ల ఇసుకను(ట్రాక్టర్ 4.5 టన్నులు) అక్రమంగా తవ్వి ఆలూరు, ఆస్పరి, ఆదోని వంటి ప్రాంతాలకు అక్రమ రవాణా చేశారని స్థానికులు అంటున్నారు. ఈ 3 అనధికారిక రీచ్‌ల నుంచి రోజుకు సగటున 250 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక రవాణా అయ్యేదని అంటున్నారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.475గా నిర్ణయించింది. ఈ లెక్కన 250 ట్రాక్టర్లకు రోజుకు రూ.5.35లక్షలు చొప్పున ఈ ఐదేళ్లలో రూ.కోట్లు విలువ చేసే ఇసుకను కొల్లగొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పర్యవేక్షణలో రూ.519 కోట్లతో ఎల్లెల్సీ ఆధునీకరణ పనులు జరిగాయి. 2022లో జరిగిన ఎల్లెల్సీ టెండర్లను తన వర్గీయులకు ఇప్పించుకోవడంలో మంత్రి జయరాం చక్రం తిప్పారని తెలిసింది.

మహేష్‌బాబు 'నేనొక్కడినే'తో వెండితెరకు పరిచయమైన నటి **కృతి సనన్.** ఆ తరువాత అద్భుతమైన అభినయంతో జాతీయ అవార్డు గెలుచుకుంది. 'మిమీ రాథోడ్'గా అయినా... 'జానకి'గా అయినా... పాత్ర ఏదైనా మెప్పించగల ప్రతిభ ఆమెది. పరిశ్రమలోకి వచ్చి పదేళ్లయినా... ఆమెలో ఇంకా అవే టీనేజీ మెరుపులు... నవ యవ్వన కాంతులు. ఎలా..?



ఫిట్‌గా ఉంటే... ఆరోగ్యం... ఆనందం

వారసులు వరుస కట్టిన బాలీవుడ్‌లో... బంధుప్రీతిని ధైర్యంగా ప్రశ్నించిన నటి కృతి సనన్. గాడ్‌ఫాదర్లు ఎవరూ లేకపోయినా... కేవలం ప్రతిభను నమ్ముకొని ఇన్నేళ్లుగా రాణిస్తోంది. 'పరిశ్రమకు చెందినవారే కాదు... ప్రతిభావంతులైన ఇతర నటులకు కూడా అవకాశాలు ఇవ్వాలి' అంటూ ఆ మధ్య హిందీ చిత్ర నిర్మాతలను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దేశ రాజధాని ఢిల్లీలో పుట్టి పెరిగిన కృతి తండ్రి రాహుల్ సనన్ సీఏ. తల్లి గీత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్. పంజాబీ కుటుంబం. 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన కృతి... నోయిడా 'జేపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'లో 'ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్'లో ఇంజనీరింగ్ చదివింది. అయితే ఉద్యోగాల వైపు వెళ్లలేదు.

గ్లామర్ రంగంపై మక్కువతో ముంబయికి వెళ్లింది కృతి. మోడలింగ్ చేస్తుండగా... 2014లో ఆమెకు తెలుగులో 'నేనొక్కడినే'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. ఆ చిత్రం షూటింగ్ జరుగుతుండగానే టైగర్ షరాఫ్‌తో 'హీరోపంతి'లో నటించి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. దానికి గానూ ఫిలిమ్‌ఫేర్ అవార్డు దక్కించుకుంది. అది మొదలు కృతి కెరీర్‌కు ఎక్కడా బ్రేక్‌లు పడలేదు. మరుసటి ఏడాది తెలుగులోనే మరో చిత్రం... 'దోచెయ్'లో హీరోయిన్‌గా చేసింది. 2021లో విడుదలైన 'మిమీ'లో నటనకు జాతీయ అవార్డు గెలుచుకుంది. గత ఏడాది భారీ బడ్జెట్ చిత్రం 'ఆదిపురుష్'తో కృతి పేరు మరోసారి దేశమంతా మారుమోగింది. పదేళ్లలో దాదాపు పాతిక సినిమాలు చేసిందంటే ఆమె నటిగా ఎంత బిజీగా ఉందో వేరే చెప్పక్కర్లేదు. 2019లో ఏకంగా ఆరు చిత్రాల్లో నటించిన కృతి... ఎంచుకున్న పాత్రలో మెప్పించడానికి ఎంతటి కష్టాన్నయినా భరించడానికి సిద్ధంగా ఉంటుంది. 'మిమీ' కోసం పదిహేను కిలోల బరువు పెరిగిన ఆమె... దాన్ని తగ్గించుకోవడానికి అంతకు మించి శ్రమించింది.

కృతి సనన్‌కు అభిమానుల జాబితా కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 5.6 కోట్ల మంది ఫాలో అవుతున్నారు. ఇతర సామాజిక మాధ్యమాల్లో అభిమానులు దీనికి రెండింతలు ఉంటుంది. ఇక కోకాకోలా, టైటాన్, టిస్సాట్ తదితర బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. డబ్బు సంపాదనే ధ్యేయం కాకుండా... సామాజిక సేవలో కూడా కృతి ముందుంటుంది. కరోనా సమయంలో ఆపన్నుల కోసం ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చింది. కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ కోసం నిధులు సేకరించింది. సినీ పరిశ్రమలో బంధుప్రీతినీ, పురుషాధిక్యతను ప్రశ్నించిన ఆమె... రెమ్యూనరేషన్ విషయంలో కథానాయికల పట్ల వివక్ష చూపడాన్ని నిలదీసింది. వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకున్న ఈ అందాల నటి ఎప్పుడూ తనను తాను ఫిట్‌గా ఉంచుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యం కదా.

వర్కవుట్ ఇలా...

కృతి వర్కవుట్స్‌లో పిలేట్స్ నుంచి యోగా వరకు అన్ని రకాల వ్యాయామాలూ ఉంటాయి. షూటింగ్‌ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు జిమ్ అందుబాటులో లేకపోతే... ఇండోర్ ఎక్సర్‌సైజ్‌లతో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటుంది. 'శారీరక దారుఢ్యం ఉంటే... ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాం. ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఫిట్‌గా ఉన్నామంటే దానర్థం... శరీరం మంచి రోగనిరోధకశక్తితో, బలంగా ఉన్నట్టు. నేను వెళ్లినచోట ఒకవేళ జిమ్ లేకపోతే రన్నింగ్, యోగా చేస్తాను. అంతేకానీ ఏదో కారణం దొరికింది కదా అని వర్కవుట్స్ మానేయను' అని ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది కృతి. ఆమెకు డ్యాన్స్ అంటే ప్రాణం. అందుకే నాట్యాన్ని వ్యాయామంలో భాగం చేసింది. 'నేను కథక్ నేర్చుకున్నాను. డ్యాన్స్ అద్భుతమైన వ్యాయామం' అంటుంది తను.

- ఉదయం లేవగానే రన్నింగ్, సైక్లింగ్ లేదా స్విమ్మింగ్‌తో 45 నిమిషాల కార్డియో సెషన్. ఇది అదనపు కేలరీలు కరిగించడానికి దోహదపడుతుంది.



- వెయిట్‌లిఫ్టింగ్, బాడీవెయిట్ వ్యాయామాలతో కూడిన స్ట్రెంత్ ట్రైనింగ్. ఒక్కో రోజు ఒక్కో మజిల్ గ్రూప్ మీద వర్కవుట్స్ ఉంటాయి.
- శరీరం ఫ్లెక్సిబుల్‌గా, బ్యాలెన్స్‌డ్‌గా ఉండడానికి యోగా.
- యోగా తరువాత ధ్యానం. దీనివల్ల మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి. ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- వారంలో రెండు రోజులు వ్యాయామాలకు అదనంగా డ్యాన్స్.

'మీ శరీరాన్ని మీరు జాగ్రత్తగా చూసుకొంటే... అది మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకొంటుంది' అంటున్న కృతి బద్ధకం వదిలి రోజులో ఎంతోకొంత సమయాన్ని వ్యాయామాలకు కేటాయించాలని అభిమానులకు పిలుపునిస్తోంది.

ఇదీ మెనూ...

పోషకాలున్న సమతుల ఆహారానికి కృతి ప్రాధాన్యం ఇస్తుంది. ప్రాసెస్డ్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటుంది. ఆమె డైట్‌లో తాజా పండ్లు, కూరగాయలు, తక్కువ స్థాయిలో మాంసకృత్తులు ఉంటాయి.

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్, గుడ్లు, పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో బ్రౌన్ రైస్, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలతో గ్రిల్డ్ చికెన్ లేదా ఫిష్.
- రాత్రి భోజనంలో సూప్స్, సలాడ్స్ లేదా గ్రిల్డ్ వెజిటబుల్స్‌తో తేలికపాటి ఆహారం.
- వీటికి మధ్యలో ప్రతి రెండు గంటలకు ఖర్జూరా లేదా మరేదైనా డ్రైఫ్రూట్. ఖర్జూరా శరీరానికి తక్షణ శక్తినిస్తుంది.
- శరీరం డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవడానికి కృతి రోజంతా విరివిగా నీళ్లు తాగుతుంది.



భిన్నాభిప్రాయాన్ని సహించలేని అసహనానికి, నచ్చని వారిని వేధించే క్రూరమైన మనస్తత్వానికి పరాకాష్ట ట్రోలింగ్. అంతర్జాలం వేదికగా సాగే ఈ వికృత క్రీడకు అత్యధికంగా బాధితులు మహిళలే! స్వతంత్రమైన ఆలోచనలు కలిగిన మహిళల స్వాభిమానాన్ని దెబ్బతీయడమే ట్రోలర్ల ప్రధాన లక్ష్యం. నిలదీసే వ్యక్తులకు వారి వ్యక్తిత్వమే సర్వస్వం కనుక... లోకం దృష్టిలో వారిని లోకువ చేయడానికి అంతర్జాల జులాయిలు అల్లే కట్టుకథలకు, బూతు రాతలకు హద్దే లేదు. అలా నిత్యం విద్వేష దుర్భాషలను భరిస్తున్న కొందరు పోరాట స్త్రీల అనుభవ కథనాలతో 'ట్రోల్' పుస్తకాన్ని 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక', 'మలుపు బుక్స్' కలిసి తీసుకొచ్చాయి. తద్వారా వారి మానసిక వ్యధను అక్షరబద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆలోచనలు కలిగిన మహిళలపై సామాజిక మాధ్యమాలే అస్త్రంగా అనాగరిక ధోరణుల గుంపు సాగిస్తోన్న అమానవీయ కాండపై 'నవ్య' కథనం.

ట్రోలింగ్... విద్వేషాల వికృత క్రీడ

సత్యాన్ని నిట్టనిలువునా మట్టుబెట్టగల అత్యంత శక్తిమంతమైన ఆయుధం ట్రోలింగ్. ప్రశ్నించే గొంతులను అడ్డంగా కోసేయడమే దాని లక్ష్యం. ఇది ఇటీవలి ధోరణి కాదు. తరతరాల చరిత్ర దీని సొంతం. భిన్నాభిప్రాయాన్ని భరించలేనితనంతో ద్వేషం వెళ్ళగక్కడం దీని స్వభావం. ఇదివరకు కూడా ఇతరులను వేధించడం, బాధించడం, వ్యక్తిత్వ హననం లాంటివి గోడ పత్రికలు, కరపత్రాలు, వెకిలి రాతలతో దుష్ప్రచారం చేయడం లాంటి అనేక రూపాల్లో కొనసాగింది. అంతర్జాలం వచ్చాక అది మరింత వ్యవస్థీకృతమైందంటారు నిపుణులు. కశ్మీర్‌లో బుర్హాన్ వనీ మరణానంతరం అక్కడి పరిణామాలు, పరిస్థితుల మీద కథనాలు రాసినందుకుగాను విపరీతమైన ట్రోలింగ్‌కు గురయ్యారు ప్రముఖ పాత్రికేయురాలు స్వాతి చతుర్వేది. ఈ క్రమంలో ట్రోల్‌కు సంబంధించిన అనేక విషయాలను ఆమె 'ఐ యామ్ ఎ ట్రోల్' పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఆ పుస్తకాన్ని 'నేనొక అంతర్జాల పోకిరిని' పేరుతో సత్యరంజన్ తెలుగులోకి అనువదించారు. కశ్మీరులోని వాస్తవ పరిస్థితులపై వార్తాకథనాలుగా వెలువరించినందుకు... లుటెన్‌సిన్‌సైడర్ ఖాతా ద్వారా తాను సామాజిక మాధ్యమాల ద్వారా ఎదుర్కొన్న అసభ్యమైన, విద్వేషపూరితమైన వేధింపులను, దుష్ప్రచారాలను స్వాతి ఆ పుస్తకం ద్వారా వెల్లడించారు. రాజకీయపార్టీ అండదండలతో ట్రోలర్లు ఎలా వ్యవస్థీకృతంగా పనిచేస్తారో కూడా ఆమె తన పరిశోధన ద్వారా వెలుగులోకి తెచ్చారు. ప్రముఖ జర్నలిస్ట్ రానా అయూబ్ కూడా దాదాపుగా అంతే తీవ్రమైన వేధింపులు ఎదుర్కొన్నారు.

ఆ నమ్మకాన్ని దెబ్బకొట్టాలి

తెలుగులోనూ ట్రోల్ బాధితురాళ్ళ అనుభవాలు భిన్నమేమీ కాదు. సత్యం పక్షాన నిలిచినందుకు కొందరు, సంప్రదాయాలపట్ల సొంత అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు మరికొందరు, రాజకీయ నిరసన తెలిపినందుకు ఇంకొందరు ఎంతో మానసిక క్షోభను అనుభవించాల్సివస్తోంది. "ఈ కాలం అమ్మాయిలు 'నమ్మకం-మోసం' అనే చట్రం నుంచి బయటికివచ్చి తెలివిగా వ్యవహరించాలి, ముఖ్యంగా శారీరక సంబంధాల విషయంలో జాగరూకత పాటించాలి" అని ఫేస్‌బుక్‌లో పోస్టు రాసినందుకు తనపై విపరీతమైన ట్రోలింగ్ జరిగిందని చెబుతున్నారు జర్నలిస్టు ఆలమూరు సౌమ్య. "నా మీద బూతులతో దాడి చేశారు. ఆడవాళ్ళపై దాడి అనగానే బూతుల్లోకి దిగిపోతారు. అదే ట్రోలర్ల ఆయుధం. మహిళల శీలంపై దుష్ప్రచారాన్ని అస్త్రంగా చేసుకొని వాడటం అనాదిగా వస్తున్న ఆచారం. బూతులతో దాడికి దిగగానే మహిళలు ముడుచుకుపోతారన్నది వాళ్ళ నమ్మకం. ఆ నమ్మకాన్ని దెబ్బకొట్టాలి. 'నీ బూతులు నాకు అంటవు. నువ్వు పెట్టిన నియమాలు నాకు చెల్లవు' అని ఢంకా బజాయించి చెప్పాలి" అంటారు సౌమ్య.

అలాంటివి ఎందుకు రాశావన్నారు?

కరోనా సమయంలో 'సైన్సుమాత్రమే నమ్మండి. సనాతన ధర్మాన్ని పారద్రోలండి' నినాదాన్ని సోషల్‌మీడియాలో షేర్ చేసినందుకు... ఒక్కపూటలోనే 840కు పైగా కామెంట్లతో దుర్భాషలాడుతూ తనపై దాడి చేసినట్టు మహబూబ్‌నగర్‌కు చెందిన కాగుల శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సమయంలో బయటనుంచి తనకు మద్దతు పెద్దగా లభించలేదంటారామె. "అలాంటివి ఎందుకు రాయాలి. ముక్కుమొఖం తెలియనివారితో తిట్లు తినాలా" లాంటి మాటలు ఎదురయ్యాయన్నారు. అయితే, ఆ సమయంలో తన భర్త, పిల్లలు అండగా నిలిచి ధైర్యం చెప్పారన్నారు.

> ### ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతి...
> "ట్రోల్‌కు గురైనవాళ్లు కూడా తమ భావజాలానికి అటో ఇటో కాస్త జరిగారనో, వ్యతిరేకించారనో ఇతరులను ట్రోల్ చేయడం, సామాజిక మాధ్యమాలలో వేధింపులకు గురవుతున్న ప్రగతిశీలురు - తాము మనువాద మత రాజకీయాలను వ్యతిరేకించేప్పుడు కూడా ట్రోల్ భాషనే ఆశ్రయించడం ఇప్పటి వాస్తవమే కావచ్చు. కానీ అది కొనసాగించవలసిన సంప్రదాయం మాత్రం కాదు. అభిప్రాయాల మీద చర్చ ఎప్పుడూ కోరదగినదే. కానీ అభిప్రాయాలను వ్యక్తం చేసిన వ్యక్తులను ఎద్దేవా చేసి మానసికంగా, నైతికంగా గాయపరచడం వలన ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని అభివృద్ధి పరచగలుగుతున్నామా అని ఆత్మ విమర్శ చేసుకోవలసిన సందర్భం ఇది."
>
> - 'ట్రోల్' పుస్తకం నుంచి

ట్రోలర్లను నియంత్రించే విధానం అవసరం...

సీఏఏ, ఎన్‌ఆర్సీలకు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్ ఉద్యమంలో పాల్గొన్న ఖలీదా పర్వీన్ ఫొటోను బుల్లీబాయ్ యాప్‌లో ఉంచిన సంగతి వెలుగులోకి వచ్చింది. 'సుల్లీడీల్స్' యాప్‌లోనూ కొంతమంది మహిళల గురించి అశ్లీలంగా రాయడం, వారి ఫొటోలు ఆన్‌లైన్‌లో పెట్టి ట్రోల్ చేసిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా స్పందన రాలేదని ఖలీదా పర్వీన్ చెబుతున్నారు. "ఒక్కోసారి అనిపిస్తుంది ఆ ట్రోలర్స్‌ను ప్రభుత్వమే పెంచి, పోషిస్తోందని. ప్రభుత్వం పూనుకుంటే కానీ ఈ ట్రోలింగ్ ఆగదు. సైబర్ క్రైమ్ విభాగాన్ని పటిష్ఠం చేయాలి. ట్రోలర్లను నియంత్రించే విధానాన్ని కనిపెట్టాలి" అని ఖలీదా డిమాండ్ చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు సజయ, సంధ్య, దేవి... దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు, కశ్మీర్‌లో చిన్నారి ఆసిఫా అత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడినందుకు తాము హత్యాచారం బెదిరింపులనూ ఎదుర్కొన్నట్టు వివరించారు. సామాజిక మాధ్యమాల వేదికగా వారిని దుర్భాషలాడుతూ రాయడానికి వీల్లేని పదాలతో తిట్టారని తెలిపారు. స్త్రీల మతస్వేచ్ఛ గురించి రాసినందుకు తాను కూడా అలాంటి బెదిరింపులను, బూతుల దాడిని ఎదుర్కొన్నట్టు కవయిత్రి మెర్సీ మార్గరేట్ చెబుతున్నారు.

'వ్యభిచారిణి' అంటూ ప్రచారం...

కరోనా బాధితులకు హెల్ప్‌లైన్ నిర్వహిస్తున్న క్రమంలో... ఒక కాలర్ దురుద్దేశంతో మాట్లాడటాన్ని గమనించి, వారించినందుకు తాను ట్రోలింగ్‌కు లోనైనట్టు సామాజిక కార్యకర్త దీప్తి చెబుతున్నారు. ఆ పోకిరీ తన నెంబరును కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి వ్యభిచారిణిగా ప్రచారం చేయడంతో... తెలియని నెంబర్ల నుంచి వేధింపులు ఎదురయ్యాయని ఆమె తెలిపారు. "పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆకతాయి ఆచూకీ తెలిసింది. నా నెంబరు షేర్ అయిన గ్రూపులను మూసేయించారు. దాంతో వేధింపులు ఆగాయి. ట్రాన్స్ వ్యక్తులు ఎక్కువ ట్రోల్‌కు లోనవడం చూస్తుంటాం. కొన్నాళ్ళ కిందట ఉజ్జయినికి చెందిన 16ఏళ్ళ ట్రాన్స్ సోషల్ మీడియాలో తన లైంగికతను ప్రకటించినందుకు ట్రోలింగ్‌కు గురయ్యాడు,ఆత్మహత్య చేసుకొన్నాడు" అని దీప్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రజాక్షేత్రంలో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతూనో, సత్యం పక్షాన నిలిచి రాస్తున్న... సూరేపల్లి సుజాత, స్వాతి వడ్లమూడి, అరుణ గోగులమండ, కొండవీటి సత్యవతి, సి. వనజ, తులసి చందు, కె.ఎన్. మల్లీశ్వరి లాంటివారు తమ ట్రోలింగ్ అనుభవాలను రాశారు. అయితే, వీరంతా ట్రోలింగ్‌కు ఎదురీది మరీ పోరాడుతున్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం నినదిస్తున్నారు. ట్రోలింగ్ లాంటి అమానవీయ సంస్కృతిని నిలువరించడానికి తమవంతు గళం విప్పుతున్నారు.

మనలోనూ ఓ ట్రోలర్...



ట్రోలింగ్ అనేది సమకాలీన సమస్య. చాలాసార్లు ట్రోల్స్ ప్రత్యేక వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని జరిగేవే అయినా అవి వ్యక్తిగతం కాదు. ప్రశ్నించే గొంతును ఒంటరి చేసి, న్యూనపరిచి నిష్క్రమించేలా చేయడమే వాటి లక్ష్యం. ట్రోల్స్ వెనక ఉన్న పితృస్వామిక, కుల, మత, ఆర్థిక, అధికార రాజకీయాలను గురించిన చర్చను ప్రారంభించాలన్న ఆలోచనతో... ట్రోల్‌కు గురైన మహిళల అనుభవ కథనాలను ఒక పుస్తకంగా తీసుకువచ్చాం. తెలుగు సమాజంలో ట్రోల్ అవుతున్న వాళ్లలో చాలామంది మాకు తెలిసిన వాళ్లు, స్నేహితులు అయినప్పటికీ జాబితా సిద్ధం చేయడానికి కొంత కసరత్తు అవసరమైంది. ఆ క్రమంలో కొంతమందిని అనుభవాలు రాసిమ్మని అడిగాం. ఇద్దరు ముగ్గురు వ్యక్తిగత కారణాలతో కాదన్నారు. అత్యంత తీవ్రంగాట్రోలింగ్‌కు గురవుతున్నవారిలో ట్రాన్స్ మహిళలు కూడా ఉన్నారు. వారి అనుభవాలను ఇందులో విశితం చేయలేకపోయామన్న వెలితి ఉంది. లెఫ్టివింగ్ వ్యక్తులు కూడా కొన్ని సందర్భాలలో రైట్ వింగ్ అనుసరిస్తున్న పద్ధతిలోనే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం చూస్తున్నాం. ఎవరైనా ప్రజాస్వామ్య పరిధి దాటి విమర్శించడం సరికాదు. మనలోనూ ఒక ట్రోలర్ ఉంటాడన్న సంగతి మరవకూడదు. విమర్శ, ట్రోలింగ్ వేర్వేరు అనే స్పృహతో ఉండాలి. విమర్శను విచక్షణతో సమాజం ముందు ఉంచాలి. లేకుంటే ట్రోలర్లుకు మనకు తేడా లేకుండా పోతుందని మరువకూడదు.

- కేఎన్ మల్లీశ్వరి, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

బాధిత స్త్రీలకు మద్దతుగా గొంతునిస్తూ...



సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ సహజమేమో అన్నంతగా పాతుకుపోయింది. సామాజిక మత, రాజకీయ అంశాలపై పనిచేసేవారు కూడా దీనికి మినహాయింపు కాదు. ఉద్యమకారులు, రచయితలు, జర్నలిస్టులు మొదలైన వారిపై గురిపెట్టి అశ్లీల, అసభ్యపదజాలంతో వ్యక్తిత్వ హననం లక్ష్యంగా బెదిరింపులతో దాడులు చేయడం చూస్తున్నాం. ఆధునిక సమాజంలో స్త్రీల ద్వారా జరుగుతున్న మతవ్యాప్తి గురించి హెచ్చరికతో వ్యాసం రాసినందుకు మాలో ఒకరు అలా ట్రోలింగ్‌కు గురైన సందర్భం- దీని గురించి ఆలోచించవలసిన, పనిచేయవలసిన అవసరాన్ని మరింత గుర్తు చేసింది. సమకాలీన సామాజిక, రాజకీయ అంశాల మీద పనిచేస్తున్న అనేక మంది మిత్రులు తరచుగా ట్రోలింగ్‌కు బెదిరింపులకు గురవడం రచయితలుగా మమ్మల్ని కలవరపెట్టింది. వారికి మద్దతుగా 15మంది స్త్రీల అనుభవ కథనాలతో పుస్తకం తీసుకొచ్చాం. దీన్ని 'మలుపు' ప్రచురణల సహకారంతో ప్రచురించాం. ఈ పుస్తకంలోని స్త్రీలు మతతత్వానికి ఎదురుగా నిలబడి 'లౌకికత సంగతి ఏమిట'న్నారు. 'స్త్రీల శరీరాలపై స్త్రీలకే హక్కు లేదా?' అన్నారు. 'మైనార్టీలు కూడా మనుషులే, వారికి హక్కులుంటాయ'న్నారు. 'కొన్ని కులాలకు ఆధిక్యం ఎందుకు?' అని నిలదీశారు. అందుకుగాను తీవ్రమైన ట్రోలింగ్‌కు గురయ్యారు. బాధ, దుఃఖం, ఆగ్రహానికి గురవుతూ కూడా తాము నమ్మిన విలువలు, విశ్వాసాల వ్యాప్తి కోసం నిలిచిపోరాడుతున్న స్త్రీలతో సంభాషణకు తలుపులు తీస్తుంది 'ట్రోల్' పుస్తకం. ఏక మతరాజ్య స్థాపన కోసం భిన్నాభిప్రాయాలను బుల్డోజ్ చేసుకుపోతున్న వర్తమాన అధికార రాజకీయాల అంధకారంలో ఆశను వాగ్దానం చేస్తుందీ పుస్తకం.

- ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, తెలంగాణ కార్యదర్శి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

ఆపరేషన్... సక్సెస్ బాధ్యత మనదే



చిరంజీవి

"రొమాంటిక్, యాక్షన్ సినిమాలు ఎన్నో వస్తుంటాయి, చూస్తుంటాం. కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' లాంటి సినిమాలను ప్రేక్షకులు తప్పకుండా చూడాలి. సైన్యానికి నివాళిగా ఈ సినిమాను హిట్ చేయాల్సిన బాధ్యత మనందరిదీ' అని చిరంజీవి అన్నారు.

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషి చిల్లర్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. మార్చి 1న విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "టాప్‌గన్ తరహాలో అద్భుతమైన విజువల్స్‌తో మనం కూడా సినిమా తీయగలమని ఈ చిత్రంతో నిరూపించాం. వినోదం కోసం కాదు రియల్ హీరోస్ గురించి తెలుసుకోవడానికి ఈ సినిమా చూడాలి. తక్కువ బడ్జెట్‌తోనూ మంచి క్వాలిటీతో సినిమాలు ఎలా తీయాలో శక్తి నుంచి తెలుగు పరిశ్రమ నేర్చుకోవాలి. నా బిడ్డ వరుణ్‌తేజ్ నన్ను ఎప్పుడూ ఫాలో అవ్వలేదు. డిఫరెంట్ జానర్స్‌లో సినిమాలు చేసుకుంటూ హీరోగా ఎదిగాడు. ఎయిర్‌ఫోర్స్‌పై తెలుగులో ఇదే తొలి చిత్రం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'సరిహద్దుల్లో సైనికుల త్యాగాలను చూపించాలని ఈ సినిమా తీశాం. మాకున్న బడ్జెట్‌లో చెమటోడ్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. జవాన్లకు సెల్యూట్ చేసేలా మా సినిమా ఉంటుంది' అన్నారు. శక్తిప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ 'వరుణ్‌తేజ్‌లో యంగ్ చిరంజీవిగారిని చూశాను. ఈ సినిమాకు ఆయన నటన ప్రత్యేకాకర్షణ' అన్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే చిత్రమిదని నిర్మాత సందీప్ ముద్దా తెలిపారు.

టీడీపీ, జనసేనకు ఓటేసి సత్తా చూపండి

● మెగా అభిమానులకు నాగేంద్రబాబు పిలుపు

'సైనికుల్లా తుపాకులకు ఎదురెళ్లాల్సిన అవసరం లేదు. జనసేన, టీడీపీ కూటమికి మీ ఓటు గుద్దండి. ఈ ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ సత్తా చూపించండి' అని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మెగా అభిమానులకు నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగానికి సిద్ధమవగానే వేదిక ముందున్న అభిమానుల అరుపులతో ఆ ప్రాంగణం మార్మోగింది. వారిని మరింత ఉత్సాహపరుస్తూ నాగబాబు ప్రసంగించారు. 'పవన్ కల్యాణ్ అభిమానుల్లారా... మీ అరుపులతో కొంతమంది గుండెల్లో రైళ్లు పరుగెట్టాలి. బాగా అరవండి' అని కోరారు. ప్రయత్నం చేస్తే ఏదో ఒక రోజు విజయం వరిస్తుంది అనే సూక్తిని పవన్ కల్యాణ్ త్వరలోనే నిరూపిస్తాడు అని నాగేంద్రబాబు చెప్పారు.

పవర్ తర్వాత లవర్



నాని హీరోగా డీవీవీ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై 'సరిపోదా శనివారం' చిత్రం నిర్మాణంలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే బేనర్‌లో నాని మరో చిత్రం చేయబోతున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్‌తో 'ఓజీ' తెరకెక్కిస్తున్న సుజీత్ నాని కొత్త చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇది సుజీత్ సినిమా. పవర్ తర్వాత లవర్ వస్తాడు' అని నాని సోషల్ మీడియాలో స్పందించారు. 'నాని 32' వర్కింగ్ టైటిల్. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్లైమాక్స్ గురించి చెప్పొద్దు



బాల నటుడు దీపక్ సరోజ్ హీరోగా అరంగేట్రం చేసిన 'సిద్ధార్థ్ రాయ్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోందని చిత్రబృందం సంతోషం వెలిబుచ్చింది. ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'అన్ని ఏరియాల్లో 'సిద్ధార్థ్‌రాయ్'కు చక్కటి ఆదరణ లభిస్తోంది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు చూడనివాళ్లకు ఓపెనింగ్, క్లైమాక్స్ గురించి చెప్పవద్దు' అని కోరారు. మా సినిమాకు యువత నుంచి మంచి ఆదరణ లభిస్తోంది అని దర్శకుడు వీ యశస్వి తెలిపారు.

మరొకరితో చేసేవాణ్ణి కాను

- టీజీ కీర్తికుమార్



'నేను వెన్నెల కిశోర్ అభిమానిని. ఆయన కోసమే 'చారి 111' చిత్రం కథ రాసుకున్నాను. ఆయన కాదంటే మరొకరితో ఈ సినిమా చేసేవాణ్ణి కాదు' అని దర్శకుడు టీజీ కీర్తి కుమార్ చెప్పారు. ఈ చిత్రం మార్చి 1న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా కీర్తి కుమార్ 'చారి 111' విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'నా తొలి చిత్రం 'మళ్లీ మొదలైంది'లో వెన్నెల కిశోర్ నటించారు. అప్పుడే ఆయనకు 'చారి 111' స్క్రిప్టు చెప్పా. ఆయనకు నచ్చింది. ఇదొక స్పై యాక్షన్ కామెడీ ఫిల్మ్. ఇందులో విలన్ ఎవరనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాకు సీక్వెల్ ప్లాన్ కూడా ఉంది' అని చెప్పారు.

సీనియర్ నిర్మాత వి.మహేశ్ కన్నుమూత



సీనియర్ నిర్మాత, సినీ రచయిత, హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుడు వి. మహేశ్(85) శనివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడటంతో ఆయనను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళగా, అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. 1975లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన.. దాసరి నారాయణ రావు దర్శకత్వంలో ఏఎన్నార్ హీరోగా 'మనుషులంతా ఒక్కటే' అనే చిత్రాన్ని 1976లో నిర్మించారు. ఆ తర్వాత 'మహాపురుషుడు', 'సింహపురి సింహం', 'ముసుగుదొంగ వంటి పలు చిత్రాలను నిర్మించారు. 'మనుషులంతా ఒక్కటే' చిత్రానికిగాను ఉత్తమ రచయితగా వి. మహేశ్ నంది అవార్డును అందుకున్నారు. తన అన్నయ్య వి.వి.రాజేంద్రకుమార్‌తో కలిసి చిత్రాలకు ప్రచార సామాగ్రిని తయారు చేసే సంస్థ స్టూడియో రూప్ కళను ప్రారంభించారు. ఆదిత్య చిత్ర పేరుతో నిర్మాణ సంస్థను నెలకొల్పారు. అలాగే, శ్రీ వేంకటేశ్వర భక్తి చానెల్‌లో ప్రసారమైన 'హరి భక్తుల కథలు' అనే ధారావాహికకు నిర్మాత, రచయిత ఆయనే. అవివాహితుడైన మహేశ్ స్వస్థలం నెల్లూరు జిల్లా కొరుటూరు. పలువురు సినీ ప్రముఖులు మహేశ్ మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

బిజినెస్

విజయవాడ ● సోమవారం 26 ఫిబ్రవరి 2024

రిలయన్స్ చేతికి డిస్నీ ఇండియా?

ఈ వారం ఒప్పందం కుదుర్చుకునే చాన్స్!



న్యూఢిల్లీ: దేశ మీడియా రంగంలో భారీ విలీనం చోటు చేసుకోబోతోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వాల్ట్ డిస్నీ ఇండియా తమ మీడియా వ్యాపారాలను విలీనం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఇప్పటికే స్పష్టమైన అవగాహన కుదిరినట్టు తెలుస్తోంది. రెండు కంపెనీలు ఈ వారంలో డీల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన చేస్తాయని భావిస్తున్నారు. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్‌గానీ, వాల్ట్ డిస్నీ గానీ దీనిపై అధికారికంగా నోరు మెదపడం లేదు. అయితే ఈ నెల ఆరంభంలో డిస్నీ తన భారత వ్యాపారంలో 60 శాతం వాటాను రిలయన్స్‌కు చెందిన వయాకామ్18కి విక్రయించేందుకు సిద్ధంగా ఉందని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెల్లడించింది. ఇందులో భాగంగా కంపెనీ విలువను రూ.33,000 కోట్లు (390 కోట్ల డాలర్లు)గా లెక్కగట్టినట్లు పేర్కొంది.

రిలయన్స్‌కు 61 శాతం వాటా!

విలీన కంపెనీలో రిలయన్స్ ఇండస్ట్రీకు 61 శాతం, వాల్ట్ డిస్నీకి 39 శాతం వాటా ఉంటుందని సమాచారం. అయితే దేశంలోని డిస్నీ ఆస్తుల విలువ మదింపు తర్వాత రెండు కంపెనీల మధ్య ఈ వాటాలపై స్పష్టమైన అవగాహన వస్తుందని తెలుస్తోంది. భారత స్ట్రీమింగ్ బిజినెస్‌లో వాల్ట్ డిస్నీ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. అమెజాన్ ప్రైమ్ వంటి స్ట్రీమింగ్ యాప్స్‌తో సబ్‌స్క్రైబర్లు తగ్గిపోతున్నారు. మీడియా, స్ట్రీమింగ్ వ్యాపారాల్లో దిగ్గజంగా ఎదిగిన రిలయన్స్‌తో జట్టు కట్టడం ద్వారా స్ట్రీమింగ్ బిజినెస్‌లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవచ్చని డిస్నీ భావిస్తోంది, అందుకే ఈ విలీనం దిశగా చర్యలు తీసుకుందని భావిస్తున్నారు.

అంగరంగ వైభవంగా అనంత్ అంబానీ ప్రీ-వెడ్డింగ్ వేడుకలు

న్యూఢిల్లీ: మామూలుగానే పెళ్లంటే ఎక్కడ లేని హడావుడి ఉంటుంది. ఇక ఆసియా కుబేరుని కుమారుని వివాహం అంటే మాటలా...? వాస్తవానికి ఇప్పుడు జరగబోయేది వివాహం కూడా కాదు, ప్రీ-వెడ్డింగ్ వేడుక మాత్రమే. అదెవరో కాదు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీది. ఎన్‌కోర్ హెల్త్‌కేర్ సీఈఓ వీరేన్ మర్చంట్, ఎంటర్‌ప్రెన్యూర్ శైలా మర్చంట్‌ల కుమార్తె రాధికా మర్చంట్‌తో అనంత్ వివాహం జూలైలో జరగనుంది. ఆ వివాహానికి కొద్ది నెలల ముందుగానే మార్చి ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ప్రీ-వెడ్డింగ్ వేడుక నిర్వహిస్తున్నారు. ప్రపంచ పారిశ్రామిక, వ్యాపార, క్రీడా, సినిమా రంగాల దిగ్గజాలను ఈ వేడుకకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమం రిలయన్స్ అతిపెద్ద రిఫైనరీ ఉన్న గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరగబోతోంది. ముంబై నుంచి అతిథులను జామ్‌నగర్‌కు తరలించేందుకు చార్టర్డ్ విమానాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు ఆహ్వానాలు పంపిన పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజాల్లో మార్క్ జుకర్‌బర్గ్, బిల్ గేట్స్, సుందర్ పిచాయ్, శంతను నారాయణ్, బాబ్ ఐగర్, లారీ ఫింక్ (బ్లాక్‌రాక్), సుల్తాన్ అహ్మద్ అల్ జబేర్ (అద్నాక్), ఈఎల్ రోత్‌షిల్డ్ (లిన్ ఫారెస్టర్ రోత్ షిల్డ్ ఛైర్మన్), గౌతమ్ అదానీ కుటుంబం, ఎన్ చంద్రశేఖరన్, కుమార మంగళం బిర్లా కుటుంబం, గోద్రెజ్ కుటుంబం, నందన్ నీలేకని, సంజీవ్ గోయెంకా, రిషద్ ప్రేమ్‌జీ ఉన్నారు.

1ఆదివారం విజయవాడలో ధనలక్ష్మీ బ్యాంక్ ఆఫీసర్స్ అర్గనైజేషన్ ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంక్ రీజినల్ మేనేజర్ కే సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉద్యోగుల బైపార్టైట్ సెటిల్మెంట్, హైదరాబాద్ రీజియన్ అభివృద్ధి గురించి వివరించారు. ఖాతాదారులకు బ్యాంకుల్లో అన్ని రకాలైన సేవలు అందిస్తున్నామని, వాటిని అందరు వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి మనోజ్, అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

1ముంబైకి చెందిన థింక్ పిక్చర్స్ లిమిటెడ్.. బోనస్ ఇష్యూ, షేరు విభజన అంశాన్ని పరిశీలిస్తోంది. మార్చి 1న జరగనున్న బోర్డు సమావేశంలో ఇందుకు ఆమోదం తీసుకోవాలని భావిస్తోంది. అలాగే ఒక్కో షేరుకు రూ.3 వరకు డివిడెండ్ ఇచ్చే విషయాన్ని కూడా బోర్డు పరిశీలిస్తోంది. కాగా యూఏఈలో వీఎఫ్ఎక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ కంపెనీని ప్రారంభించింది.

తగ్గిన కరెన్సీ సర్క్యులేషన్

ముంబై : భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకోవడం నోట్ల చలామణిపై పెద్ద ప్రభావమే చూపింది. దీంతో 2022 ఫిబ్రవరి 9న 8.2 శాతంగా ఉన్న నగదు చలామణి (కరెన్సీ సర్క్యులేషన్) వృద్ధి రేటు ఈ నెల 9వ తేదీకి 3.7 శాతానికి పడిపోయింది. జనవరిలో బ్యాంకు డిపాజిట్ల వృద్ధి రేటు రెండంకెల్లో ఉండడానికి రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకోవడమే కారణమని భావిస్తున్నారు. గత ఏడాది మార్చి 19న రూ.2,000 నోట్ల చలామణిని వెనక్కి తీసుకుంటున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. దాంతో అప్పట్లో రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్న రూ.2,000 నోట్ల చలామణి ఈ ఏడాది జనవరి నెలాఖరుకు రూ.8,897 కోట్లకు పడిపోయింది.

తమిళనాడులో విన్‌ఫాస్ట్ ప్లాంట్

రూ. 16,000 కోట్ల పెట్టుబడి

చెన్నై: వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆటో లిమిటెడ్ విద్యుత్ కార్లు, బ్యాటరీ తయారీ కంపెనీ ప్లాంట్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. తూత్తుకుడిలో నిర్మించే ఈ ప్లాంట్‌పై కంపెనీ రూ.16,000 కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఎంఓయూపై సంతకాలు చేసిన 50 రోజుల వ్యవధిలోనే ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. తమిళనాడులో పెట్టుబడుల అనుకూల వాతావరణానికి ఇది నిదర్శనమని ప్రభుత్వం తెలిపింది. ఈ ప్లాంట్‌లో 10 వేలకు పైబడి ఉద్యోగాలు లభిస్తాయని ఆ ప్రకటనలో తెలిపారు. తొలి దశలో వచ్చే ఐదేళ్ల కాలంలో రూ.4,000 కోట్లు పెట్టుబడి పెడతారు. ఈ దశలో 3,500 ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. ఏడాదికి లక్షన్నర వాహనాల ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్ అందుబాటులోకి వస్తుంది.

22,500 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 26-మార్చి 1 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 22,298-21,875 పాయింట్ల మధ్యన కదలాడి 22,213 వద్ద ఫ్లాట్‌గాముగిసింది. ఈ వారాంతంలో 22,500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

120, 50, 100, 200 రోజుల చలన నగటు స్థాయిలు 21,779, 21,663, 20,347, 19,954 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,600, బ్రేక్‌డౌన్ స్థాయి: 21,825

నిరోధ స్థాయిలు : 22,415, 22,515, 22,615 (22,315 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 22,015, 21,915, 21,815

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ		విజయవాడ	490
హైదరాబాద్	500	విశాఖపట్నం	500
26వ తేదీ		వరంగల్	502
చిత్తూరు	568	దజను గుడ్లు రూ.72	
గోదావరి	490		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140		
కరీంనగర్	140	విజయవాడ	144
మహబూబ్‌నగర్	140	గుంటూరు	144
కర్నూలు	140	ఒంగోలు	144
విశాఖపట్నం	127	చిత్తూరు	144

ఆటుపోట్లకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం నిఫ్టీ ప్రతి సెషన్‌లోనూ సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకింది. అయితే పటిష్ఠతను కనబరచకపోవటంతో కొద్దిగా నిరోధాన్ని ఎదుర్కొంది. ఈ వారం డెరివేటివ్స్ ముగింపు కారణంగా ఆటుపోట్లకు అవకాశం ఉంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్‌కు 22,350 వద్ద మద్దతు, 22,500 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. వీటిని బట్టే గమనం ఉంటుంది. నిరోధాన్ని ఎదుర్కొంటేనే బుల్లిష్‌నెస్ వస్తుంది. లేదంటే కరెక్షన్‌కు వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

గోద్రెజ్ ప్రాపర్టీస్: చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. గత శుక్రవారం ఈ షేరు 3.41 శాతం లాభంతో రూ.2,468 వద్ద క్లోజైంది. నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగైన పనితీరును కనబరుస్తోంది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,450 శ్రేణిలో ప్రవేశించి రూ.2,550/2,610 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,410 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

జెఎస్‌డబ్ల్యూ ఎనర్జీ: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్‌లో అప్‌ట్రెండ్ కొనసాగుతోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించినప్పటి నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 3.86 శాతం లాభంతో రూ.506 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ట్రేడర్లు రూ.500 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.585/655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన నాటి నుంచి ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. వాల్యూమ్‌ను బట్టి ఇన్వెస్టర్లు ఈ స్టాక్స్‌ను వదులుకునేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. గత శుక్రవారం రూ.1,529 వద్ద క్లోజైన ఈ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసేందుకు ప్రయత్నిస్తోంది. నిరోధాన్ని అధిగవిస్తే మరింత బుల్లిష్‌నెస్ వస్తుంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,500 శ్రేణిలో ఎంటరై రూ.1,580/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,470 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అంబుజా సిమెంట్స్: సుదీర్ఘ దిద్దుబాటు తర్వాత గత ఏడాది నవంబరులో ప్రారంభమైన బుల్‌రన్ ఇంకా కొనసాగుతోంది. జార్ఖండ్‌లో కొత్తగా రూ.1,000 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తుండటం, నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన, తాజాగా జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించటం కలిసి వచ్చే అంశాలు. గత శుక్రవారం ఈ షేరు రూ.602 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.660/725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ విల్మార్ : కొద్ది నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ఇప్పుడిప్పుడే మూమెంటమ్ పెరుగుతోంది. గత వారం ఈ షేరు దాదాపు 13 శాతం మేర లాభపడింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ గణనీయంగా పెరిగింది. గత శుక్రవారం ఒక్కరోజే 8.12 శాతం లాభంతో 389.95 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.375 శ్రేణిలో ప్రవేశించి రూ.410/480 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.355 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

22,300 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గా ప్రారంభమైనా 22,000 వద్ద విఫలమై 300 పాయింట్ల మేరకు కరెక్షన్‌కు లోనైంది. కాని చివరి ట్రేడింగ్ రోజున బలమైన రికవరీ సాధించి జీవితకాల గరిష్ఠ స్థాయి 22,200 సమీపంలో క్లోజైంది. 22,000 వద్ద ఆరు వారాల పాటు సాగిన సైడ్‌వేస్, కన్సాలిడేషన్ అనంతరం గత వారం బ్రేకౌట్ సాధించింది. ఆకస్మిక బలహీనత ఏదైనా ఏర్పడితే తప్ప మార్కెట్ సానుకూల ట్రెండ్‌లో ఉంది. అమెరికా, భారత్ త్రైమాసిక జీడీపీ గణాంకాలు వెలువడనున్న దృష్ట్యా మార్కెట్‌కు ఈ వారం అత్యంత కీలకం. ఈ గణాంకాలకు మార్కెట్ బలంగా స్పందించే ఆస్కారం ఉంది. గత వారంలో మిడ్‌క్యాప్ 10, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కన్సాలిడేషన్ ధోరణిలో ట్రేడయ్యాయి. గతంలో ఏర్పడిన గరిష్ఠ స్థాయిల కన్నా దిగువనే ఉన్నాయి. గతవారం ప్రధాన నిరోధ స్థాయిల్లో బ్రేకౌట్ సాధించినందు వల్ల టెక్నికల్ పుల్‌బ్యాక్‌కు ఆస్కారం ఉంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. ఈ పుల్‌బ్యాక్‌లో కూడా సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో మార్కెట్ మద్దతు స్థాయిల కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ గత శుక్రవారం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి 22,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన కొత్త శిఖరాలకు బాటలు వేస్తుంది. మానసిక అవధి 22,600.

బేరిష్ స్థాయిలు: బలహీనతకు లోనైనా తక్షణ అప్‌ట్రెండ్ కోసం ప్రధాన మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఈ స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనత దిశగా అప్రమత్తతను సూచిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మైనర్ అప్‌ట్రెండ్‌లో ట్రేడయి 425 పాయింట్ల లాభంతో క్లోజైంది. కాని గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ అనిశ్చితంగా క్లోజ్ కావడం మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు సంకేతం. గత కొద్ది వారాలుగా ఈ సూచీ 47,000 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 47,300 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. మద్దతు స్థాయి 46,500 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: మార్కెట్‌కు 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ అయి తీరాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,300, 22,355
మద్దతు	22,160, 22,100

www.sundartrends.in

స్పోర్ట్స్



అశ్విన్ (5/51)

అదిగదిగో సిరీస్

భారత్ లక్ష్యం 192
ప్రస్తుతం 40/0
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 145

అశ్విన్‌కు 5, కుల్దీప్‌నకు 4 వికెట్లు
భారత్ రెండో ఇన్నింగ్స్ 307
ధ్రువ్ జురెల్ శతకం మిస్

1 సొంత గడ్డపై ఎక్కువ వికెట్లు (354) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. కుంబ్లే (350) రికార్డును అధిగమించాడు. అలాగే భారత్ తరపున ఎక్కువసార్లు (35) 5+ వికెట్లు తీసి కుంబ్లేతో సమంగా నిలిచాడు. ఓవరాల్‌గా నాలుగో బౌలర్.

స్టోక్స్-మెకల్లమ్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్ ఓ ఇన్నింగ్స్‌లో మూడు రన్‌రేట్ లోపే పరుగులు సాధించడం ఇదే తొలిసారి.



కుల్దీప్ (4/22)

రాంచీ: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు అనూహ్య మలుపులతో సాగుతోంది. తొలి రెండు రోజులు వెనుకబడిన టీమిండియా.. ఆదివారం జూలు విదిల్చి, మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తెచ్చుకుంది. ధ్రువ్ జురెల్ (90) అసామాన్య బ్యాటింగ్‌తో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్‌కు కేవలం 46 పరుగుల ఆధిక్యమే దక్కింది. ఆ తర్వాత బజ్‌బాల్ ఆటతో భారీ లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు ముందుంచాలనుకున్న ఇంగ్లండ్ ఆశలకు స్పిన్ ద్వయం అశ్విన్ (5/51), కుల్దీప్ (4/22) బ్రేకులు వేసింది. దీంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 53.5 ఓవర్లలో 145 పరుగులకే పరిమితమైంది. క్రాలే (60), బెయిర్‌స్టో (30) మాత్రమే ఆకట్టుకున్నారు. ఆ తర్వాత 192 పరుగుల ఛేదన బరిలోకి దిగిన భారత్ మూడో రోజు ముగిసేసరికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 రన్స్ చేసింది. ఓపెనర్లు రోహిత్ (24), జైస్వాల్ (16) క్రీజులో ఉండగా.. జట్టు సిరీస్ విజయానికి 152 పరుగుల దూరంలో ఉంది. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, చేతిలో పది వికెట్లున్న భారత్‌వైపే గెలుపు కనిపిస్తోంది.

జురెల్ పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 219/7తో ఆట ప్రారంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌కు మరో 88 పరుగులు జోడించడం విశేషం. కీపర్ జురెల్ తానాడుతున్న రెండో టెస్టులోనే పరిణతి చూపాడు. 96 బంతుల్లో 50 పరుగులు సాధించాక ఆటలో వేగం పెంచాడు. స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీ బంతులను సులువుగా ఆడేశాడు. 59 రన్స్ దగ్గర అతడిచ్చిన క్యాచ్‌ను రాబిన్సన్ వదిలేయగా, బషీర్ ఓవర్‌లో వరుసగా 4,6తో 90 రన్స్‌కు చేరువై సెంచరీ ఖాయమనిపించాడు. కానీ హార్ట్‌లీ అతడి ఆశలకు బ్రేక్ వేసి భారత్ ఇన్నింగ్స్‌ను కూడా ముగించాడు. అద్భుత సహకారమందించిన కుల్దీప్ (131 బంతుల్లో 28)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 76 రన్స్ జోడించిన జురెల్.. ఆకాశ్ (9)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 40 రన్స్ జత చేయడంతో స్కోరు 300 దాటింది.

స్పిన్‌కు దాసోహం: జురెల్ ఇన్నింగ్స్‌తో తమ ఆధిక్యం తగ్గినా ఇంగ్లండ్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌ను వేగంగా ఆడాలని చూశారు. కానీ భారత స్పిన్నర్లు వారిని చెడుగుడు ఆడేశారు. అశ్విన్, కుల్దీప్‌ల ముప్పేట దాటికి 25 పరుగుల వ్యవధిలోనే చివరి 6 వికెట్లను జట్టు కోల్పోయింది. ఓపెనర్ క్రాలే మాత్రమే ఆకట్టుకున్నాడు. కొత్త బంతితో అశ్విన్ మాయ చేస్తూ ఇంగ్లండ్ నడ్డి విరిచాడు. డకెట్ (15), పోప్ (0)లను ఐదో ఓవర్‌లోనే వరుస బంతుల్లో అవుట్ చేసిన అశ్విన్..కాసేపటికే రూట్ (11) పనిబట్టాడు. అటు కుల్దీప్ దాడికి క్రాలే, స్టోక్స్ (4) పెవిలియన్ చేరడంతో రెండోసెషన్‌లోనే జట్టు 5 వికెట్లు కోల్పోయింది. బెయిర్‌స్టో దీటుగా ఆడినట్టు కనిపించినా అతడిని ఆఖరిసెషన్ ఆరంభంలోనే జడేజా అవుట్ చేశాడు. ఆ తర్వాత అశ్విన్, కుల్దీప్ మిగిలిన 4 వికెట్లను పంచుకోవడంతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353;

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బషీర్ 73; రోహిత్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 2; గిల్ (ఎల్బీ) బషీర్ 38; రజత్ (ఎల్బీ) బషీర్ 17; జడేజా (సి) పోప్ (బి) బషీర్ 12; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) హార్ట్‌లీ 14; జురెల్ (బి) హార్ట్‌లీ 90; అశ్విన్ (ఎల్బీ) హార్ట్‌లీ 1; కుల్దీప్ (బి) అండర్సన్ 28; ఆకాశ్ (ఎల్బీ) బషీర్ 9; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 103.2 ఓవర్లలో 307 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-112, 4-130, 5-161, 6-171, 7-177, 8-253, 9-293, 10-307. **బౌలింగ్:** అండర్సన్ 18-4-48-2; రాబిన్సన్ 13-0-54-0; బషీర్ 44-8-119-5; హార్ట్‌లీ 27.2-6-68-3; రూట్ 1-0-1-0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) కుల్దీప్ 60; డకెట్ (సి) సర్ఫరాజ్ (బి) అశ్విన్ 15; పోప్ (ఎల్బీ) అశ్విన్ 0; రూట్ (ఎల్బీ) అశ్విన్ 11; బెయిర్‌స్టో (సి) రజత్ (బి) జడేజా 30; స్టోక్స్ (బి) కుల్దీప్ 4; ఫోక్స్ (సి అండ్ బి) అశ్విన్ 17; హార్ట్‌లీ (సి) సర్ఫరాజ్ (బి) కుల్దీప్ 7; రాబిన్సన్ (ఎల్బీ) కుల్దీప్ 0; బషీర్ (నాటౌట్) 1; అండర్సన్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0; **మొత్తం: 53.5 ఓవర్లలో 145 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-65, 4-110, 5-120, 6-120, 7-133, 8-133, 9-145, 10-145; **బౌలింగ్:** అశ్విన్ 15.5-0-51-5; జడేజా 20-5-56-1; సిరాజ్ 3-0-16-0; కుల్దీప్ 15-2-22-4.

భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (బ్యాటింగ్) 24; జైస్వాల్ (బ్యాటింగ్) 16; **మొత్తం: 8 ఓవర్లలో 40/0. బౌలింగ్:** రూట్ 4-0-17-0; హార్ట్‌లీ 3-0-22-0; బషీర్ 1-0-1-0.



ధ్రువ్ జురెల్ (90)

4 గంటలు.. 140 ఓవర్లు

టెస్టుల్లో సరైన కీపర్ కోసం చూస్తున్న టీమిండియాకు ధ్రువ్ జురెల్ రూపంలో సమాధానం లభించినట్టయ్యింది. ఆడుతోంది రెండో టెస్టులోనైనా తన బ్యాటింగ్‌లో సాధికారత చూసిన మాజీలు, విశ్లేషకులు కూడా అబ్బురపడుతున్నారు. ఏకంగా అతడిని ధోనీతోనే పోలుస్తున్నారు. జట్టు విపత్కర పరిస్థితిలో ఉన్నప్పటికీ ఒత్తిడిని దరి చేరనీయకుండా టెయిలెండర్ల ఆసరాతో సాగించిన పోరాటం అపూర్వం. తద్వారానే భారత్ ఒక్కసారిగా ఈ టెస్టును శాసించే స్థితికి చేరింది. తొలి శతకాన్ని మిస్ చేసుకున్నా అప్పటికే ఇంగ్లండ్ ఆధిక్యాన్ని నామమాత్రం చేయడంలో విజయం సాధించాడు. అయితే ఈ ట్రాక్‌పై స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీని సులువుగా ఆడడం వెనుక అతడి కఠోర శ్రమ కూడా దాగి ఉంది. టెస్టు అరంగేట్రానికి ముందు టాలెగావ్‌లోని రాజస్థాన్ రాయల్స్ హెచ్‌పీసీ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. అక్కడ ఒకే రోజులో 140 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేశాడట. విభిన్న స్పిన్ ట్రాక్‌లపై 4 గంటలపాటు ఏకధాటిగా బౌలర్లను ఎదుర్కొన్నాడట. ఇక, కార్గిల్ వార్‌లో పాల్గొన్న అనుభవమున్న తండ్రి మాదిరే.. తనయుడు జురెల్ కూడా అలాంటి మొక్కవోని పోరాటంతోనే ఇప్పుడు జట్టును ఆదుకోవడం విశేషం.

నాన్నకు సెల్యూట్

ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ నాలుగో టెస్టులో విలువైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే మూడో రోజు ఆటలో కెరీర్‌లో తొలి అర్ధసెంచరీ చేశాక కూడా తను పెద్దగా సంబరాలు చేసుకోలేదు. కానీ తన తండ్రికి గౌరవంగా సెల్యూట్ చేయడం కనిపించింది. ఆ సమయంలో తను అలా ఎందుకు చేశాడో ఎవరికీ అర్థం కాలేదు. కానీ మ్యాచ్ ముగిశాక జురెల్ అసలు విషయం చెప్పాడు. ఈ యువ కీపర్ తండ్రి నేమ్‌చంద్ మాజీ సైనికుడు. 1999 కార్గిల్ వార్‌లోనూ పాల్గొన్నాడు. 2008లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఆయన గౌరవార్థం సెల్యూట్ చేసినట్టు చెప్పాడు. తన అరంగేట్ర క్యాప్‌ను కూడా తండ్రికి అంకితమిస్తున్నట్టు రాంచీ టెస్టుకు ముందు ప్రకటించాడు.

వావ్.. ధీరజ్

ఆసియా ఆర్చరీలో మూడు స్వర్ణాలు కైవసం



బాగ్దాద్: తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ ఆర్చరీ ఆసియా కప్ స్టేజ్ 1 పోటీల్లో అదరగొట్టాడు. ఈ టోర్నీలో ఏకంగా మూడు స్వర్ణాలు సాధించి వహ్వా అనిపించాడు. వ్యక్తిగత విభాగం, టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగం ఫైనల్లో ధీరజ్ 7-3తో సహచరుడు తరుణ్‌దీప్‌ను చిత్తుచేసి పసిడి అందుకున్నాడు. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ ఫైనల్లో ధీరజ్/సిమ్రన్‌జీత్ ద్వయం 6-0తో బంగ్లాపై, పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌లతో కూడిన భారత త్రయం 5-2తో బంగ్లాపై గెలిచి స్వర్ణాలు దక్కించుకున్నారు. ఇక, వెటరన్ స్టార్ దీపికా కుమారి రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్లలో సత్తాచాటి రెండు స్వర్ణాలు ఖాతాలో వేసుకుంది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత ఆర్చర్లు 10 స్వర్ణాలు, 3 రజతాలు, ఓ కాంస్యంతో కలిపి 14 పతకాలు కొల్లగొట్టారు.

హాకీ లీగ్‌లో గెలుపు

రూర్కెలా: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో సొంతగడ్డపై పోరాటాన్ని భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 4-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. నీలకంఠ, ఆకాశ్‌దీప్, గుర్జాంత్, జుగ్‌రాజ్‌లు తలా గోల్ చేశారు.

ఆంధ్ర లక్ష్యం 170

ప్రస్తుతం 95/4 ● మధ్యప్రదేశ్‌తో రంజీ

ఇండోర్: బౌలర్ల ఆధిపత్యం సాగుతున్న నేపథ్యంలో.. ఆంధ్ర, మధ్యప్రదేశ్ మధ్య జరుగుతున్న రంజీ క్వార్టర్స్ మ్యాచ్ రసవత్తరంగా మారింది. ఎంపీ నిర్దేశించిన 170 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. మూడో రోజు ఆదివారం ఆట ముగిసేసరికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 95/4 స్కోరు చేసింది. విజయానికి ఇంకా 75 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 6 వికెట్లున్నాయి. విహారి (43), కర్ణ్ షిండే (5) క్రీజులో ఉన్నారు. కాగా, ఆంధ్ర బౌలర్లు నితీష్ (4/28), శశికాంత్ (3/20), లలిత్ (3/20) విజృంభించడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ 107 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ 62 రన్స్‌తో కలిపి ఎంపీ ఆధిక్యం మొత్తం 169 పరుగులకు చేరింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎంపీ 234, ఆంధ్ర 172 రన్స్ చేశాయి.

ముంబై సులువుగా..

- కెర్ ఆల్‌రౌండ్ షో
- రాణించిన హర్మన్
- గుజరాత్ ఓటమి



హర్మన్‌ప్రీత్ (46 నాటౌట్)



అమేలియా కెర్ (31, 4/17)

బెంగళూరు: అమేలియా కెర్ (31, 4/17) ఆల్‌రౌండ్ షోకు హర్మన్‌ప్రీత్ కౌర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 46 నాటౌట్) నిలకడైన ప్రదర్శన తోడవడంతో.. డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 126/9 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా.. తనూజ (28), కేథరిన్ బ్రైస్ (25 నాటౌట్) 8వ వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు గౌరవప్రద స్కోరు అందించారు. బెత్ మూనీ (24) రాణించింది. షబ్నం ఇస్మాయిల్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 5 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. తనూజ 2 వికెట్లు తీసింది. ఓపెనర్లు యాస్తిక (7), మాథ్యూస్ (7) వెంటనే వెనుదిరిగినా, సివర్ బ్రంట్ (22)కు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సహకారం అందించడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ముంబై 39/2తో నిలిచింది. అయితే, స్కోరు వేగం పుంజుకొంటున్న సమయంలో బ్రంట్ రనౌటవడంతో.. మూడో వికెట్‌కు 28 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో హర్మన్, కెర్ ధాటిగా ఆడుతూ నాలుగో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలిపారు. అమేలియాను తహూహూ ఎల్బీ చేసినా.. తుదికంటా నిలిచి హర్మన్ మరో 11 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. కెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
యూపీ X ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 126/9 (తనూజ 28, కేథరిన్ 25 నాటౌట్; కెర్ 4/17, షబ్నం 3/18).

ముంబై: 18.1 ఓవర్లలో 129/5 (హర్మన్‌ప్రీత్ 46 నాటౌట్, కెర్ 31; తనూజ 2/21).

హసరంగపై 2 మ్యాచ్‌ల సస్పెన్షన్

దుబాయ్: అంపైర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన శ్రీలంక కెప్టెన్ హసరంగపై ఐసీసీ క్రమశిక్షణా చర్యలు తీసుకొంది. రెండు టీ20 మ్యాచ్‌లకు అతడిపై సస్పెన్షన్ విధించడమే కాకుండా.. మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత వేసింది. 3 డీమెరిట్ పాయింట్స్‌ను అతడి ఖాతాలోకి చేర్చింది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో కమిందు మెండిస్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు.. వఫాదార్ వేసిన ఫుల్‌టాస్‌ను నో బాల్‌గా ప్రకటించలేదు. దీంతో ఫీల్డ్‌లోకి వచ్చిన హసరంగ.. అంపైర్ లిండన్ హనీబాల్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆ మ్యాచ్‌లో లంక 3 పరుగుల తేడాతో ఓడింది. కాగా, అంపైర్ హెచ్చరికలను పట్టించుకోకుండా పదేపదే బ్యాట్ గ్రిప్ మార్చిన అఫ్ఘాన్ బ్యాటర్ రహ్మనుల్లా గుర్బాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

ఆక్లాండ్: ఇప్పటికే వరుస రెండు విజయాలతో సిరీస్ దక్కించుకున్న ఆస్ట్రేలియా ఆఖరిదైన మూడో టీ20లోనూ న్యూజిలాండ్‌ను ఓడించి క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆసీస్ 27 పరుగుల తేడాతో గెలిచింది. మొదట ఆసీస్.. 10.4 ఓవర్లలో 118/4 స్కోరు చేసింది. 10 ఓవర్లలో 126 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్..10 ఓవర్లలో 98/3 స్కోరుకే పరిమితమైంది.

జనసేన సీట్లపై స్పష్టత!

» మెజారిటీ స్థానాలు ఖరారు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీతో పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించే సీట్లపై క్రమంగా స్పష్టత వస్తోంది. తాము 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మూడు ఎంపీ సీట్ల పరిధిలోని 21 అసెంబ్లీ సెగ్మెంట్లను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 45 సీట్లలో తమ పోటీ ప్రభావం ఉంటుందని ఆయన చెప్పారు. తెనాలి, అనకాపల్లి, నెల్లిమర్ల, కాకినాడ రూరల్, రాజానగరంలో పోటీచేసే తమ అభ్యర్థుల పేర్లను ఆయన శనివారమిక్కడ టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ప్రకటించారు. రాజోలులో తమ పార్టీయే పోటీ చేస్తుందని పవన్ గతంలో చెప్పారు. అంటే ఇప్పటికి ఆరు స్థానాలపై స్పష్టత వచ్చింది. రెండు పార్టీల అంతరంగిక వర్గాల సమాచారం ప్రకారం.. మిగిలిన 18 స్థానాల్లో మెజారిటీ సీట్లు ఖరారయ్యాయి. వాటిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం, అమలాపురం.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, నరసాపురం, నిడదవోలు, పోలవరం.. ఉమ్మడి కృష్ణా జిల్లా విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ, ఉమ్మడి విశాఖ జిల్లాలో యలమంచిలి.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ జనసేనకు ఖరారైనట్లు వినవస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ సీటును టీడీపీ తీసుకుంటున్నందుకు బదులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నిడదవోలు స్థానాన్ని జనసేనకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ప్రకాశం జిల్లాలో ఆ పార్టీ గతంలో దర్శి సీటు కోరగా తాజాగా గిద్దలూరు ఆ పార్టీ ఖాతాలో పడే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం లేదా పుట్టపర్తి ఇవ్వాలని కూడా కోరుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె స్థానం ఆ పార్టీకి లభించే సూచనలు కనిపిస్తున్నాయి. కడప జిల్లా బద్వేలు లేదా రైల్వే కోడూరు కూడా ఆ పార్టీ ఆశిస్తున్నవాటిలో ఉన్నాయి. మూడు ఎంపీ సీట్లలో మచిలీపట్నం, కాకినాడ, అనకాపల్లిలో జనసేన పోటీ చేయనుంది.

జనసేన ఫోకస్ అంతా విశాఖ, గోదావరిపైనే..!

బలమైన అభిమానులు ఉన్న పార్టీయే అయినా.. ఆ అభిమానాన్ని ఓటర్లు మలిచే నాయకులే కరువని జనసేన ముఖ్యులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని.. క్షేత్ర స్థాయిలో పార్టీ బలాబలాలను, నాయకుల సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సీట్లు జనసేనాని టీడీపీతో పొత్తులో భాగంగా 24 సీట్లలో పోటీచేయాలని నిర్ణయించుకున్నారని వారు అంటున్నారు. వీటిలో కూడా అత్యధికంగా 14 స్థానాలను విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోనే కోరుతున్నట్లు తెలిసింది. విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల, విశాఖపట్నం-అనకాపల్లి, తూర్పుగోదావరి-రాజానగరం, కాకినాడ రూరల్.. గుంటూరు జిల్లాలో తెనాలిలో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. మిగతా 19 నియోజకవర్గాల్లో కూడా విశాఖ, ఉభయగోదావరి జిల్లాలోనే ఎక్కువ సీట్లు పొందాలని భావిస్తున్నారు. ఉమ్మడి విశాఖలో యలమంచిలి, భీమిలి, గాజువాక, పెందుర్తి స్థానాలను కోరుతున్నారు.. తూర్పుగోదావరి రాజోలులో తామే పోటీ చేస్తామని పవన్ గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు పిఠాపురం, రామచంద్రపురం లేదా అమలాపురం కోరుతున్నారు. పశ్చిమ గోదావరిలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సీట్లను ఆశిస్తున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి.

ఇద్దరిని గుద్ది.. పారిపోతూ...!

» పాడి రైతుల బైక్‌ను ఢీకొన్న స్కార్పియో.. ఇద్దరు మృతి

» పారిపోతూ లారీకి ఢీ... ముగ్గురి దుర్మరణం

» మదనపల్లెలో ఘోర ప్రమాదం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 25: మద్యం మత్తు మృత్యుపాశమైంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ఐదుగురు బలయ్యారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లెకు చెందిన ఆరుగురు స్నేహితులు మద్యం తాగేందుకు స్కార్పియోలో కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న రాయల్పాడుకు వెళ్లారు. అక్కడ పీకల్దాకా మద్యం తాగి ఆదివారం రాత్రి 7.30 గంటలకు తిరిగి మదనపల్లె బయలుదేరారు. మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న కోళ్లవారిపల్లెకు చెందిన పాడి రైతులు చంద్ర(47), సుబ్రమణ్యం ఆచారి(65)లను వారి వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఇది గమనించిన యువకులు స్కార్పియోను మరింత వేగంగా ముందుకు పోనిచ్చారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని వీరి వాహనం ఢీకొంది. స్కార్పియోలో ఉన్న మదనపల్లె రామారావు కాలనీకి చెందిన విక్రమ్, తిలక్, శివ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన హరీశ్, చరణ్ పరిస్థితి విషమంగా మారడంతో బెంగళూరుకు తరలించారు. మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన స్కార్పియో వాహనం

జగన్ పాపాలకు జేపీ వెంచర్స్ బలి

(మొదటి పేజీ తరువాయి)

జరిమానా విధించింది. ఇసుక అక్రమ తవ్వకాలపై ఇటీవల ఎన్జీటీ ఇచ్చిన తీర్పులో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పెనాల్టీ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది. జగన్ సర్కారు వచ్చాక ఉచిత ఇసుక విధానం రద్దు చేసి 2021 మే 12 నుంచి 2023 మే 13 వరకు రెండేళ్ల పాటు ఇసుక కాంట్రాక్టును జేపీ వెంచర్స్‌కు ఇచ్చింది. 2021 మేలో ఇసుక టెండర్ అప్పగించగా.. అక్రమ ఇసుక తవ్వకాలు, పర్యావరణ విధ్వంసం చేస్తున్నారంటూ ఆగస్టులో జేపీ వెంచర్స్‌పై గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసు వేశారు. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (సియా), కాలుష్య నియంత్రణ మండలి, ఇంకా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని జాయింట్ కమిటీలతో ఎన్జీటీ విచారణలు చేయించింది. సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల్లో భారీ యంత్రాలు ఉపయోగించి ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, పర్యావరణ పరిరక్షణ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించారని విచారణలో తేలింది. దీంతో 2023 మార్చి 23న ఎన్జీటీ కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణా, గుంటూరు, చిత్తూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని రీచ్‌ల (110-బీ2 కేటగిరీ)కు ఇచ్చిన పర్యావరణ అనుమతుల(ఈసీ)ను రద్దు చేసింది. జేపీ వెంచర్స్ తీవ్రస్థాయిలో పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున పెనాల్టీ విధించింది. ఆ సొమ్ము చెల్లించాలని, ఆ తర్వాతే ఇసుక మైనింగ్‌కు కొత్తగా ఈసీలు తీసుకోవాలని ఎన్జీటీ ఆదేశించింది. రాష్ట్రంలో 2023 మార్చి 23 నాటికి బీ2 కేటగిరీ సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లు 110 ఉన్నాయి. వీటికి ఇచ్చిన ఈసీలు రద్దయ్యాయి. అలాగే, ఎన్జీటీ ఆదేశాల మేరకు జేపీ వెంచర్స్ ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున మొత్తం 110 రీచ్‌లకు కలిపి 1908 కోట్ల రూపాయల పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

సుప్రీంలో కేసు

పెనాల్టీ చెల్లించాలని ఎన్జీటీ ఆదేశించడంతో జేపీ వెంచర్స్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఎన్జీటీ ఆదేశాలపై తాత్కాలిక స్టే తెచ్చుకుంది. అయితే ఎన్జీటీ భారీ మొత్తంలో పెనాల్టీ విధించిన విషయం అప్పట్లో వెలుగులోకి రాలేదు. ఓ రీచ్‌కు మాత్రమే పెనాల్టీ విధించినట్టు బయటకు వచ్చింది. సుప్రీం కోర్టు స్టే ఇచ్చేనాటికి ఇసుక అక్రమాలపై కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ జాయింట్ కమిటీల నివేదికలు అందలేదు. 2023 ఆగస్టులో సుప్రీం తీర్పు ప్రకారం ఇసుక తవ్వకాలు చేపట్టడానికి కొత్తగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలి. కానీ ఈసీలు లేకుండా, ఇసుక రీచ్‌లకు కొత్తగా అనుమతి లేకున్నా 2023 నవంబరు నెలాఖరు వరకు జేపీ వెంచర్స్ ఇసుక తవ్వకాలు జరిపిందని, పర్యావరణ మార్గదర్శకాల ఉల్లంఘన జరిగిందని కేంద్ర అటవీ పర్యావరణ పరిరక్షణ విభాగం ఎన్జీటీకి నివేదించింది. ఈ నేపథ్యంలో ఈ నివేదికను సుప్రీంకోర్టు ముందుంచాలని ఎన్జీటీ ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కొత్త ఈసీలు తీసుకున్నాక మైనింగ్ చేయాలన్న ఆదేశాన్ని జేపీ వెంచర్స్ ఉల్లంఘించిందని కేంద్ర ఏజెన్సీలు సుప్రీం కోర్టుకు నివేదించనున్నాయి. జేపీ వెంచర్స్ తప్పుల మీద తప్పులు చేసిందని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు పక్కా ఆధారాలతో నివేదికలు రూపొందించాయి. అవి కాదనలేని వాస్తవాలు. సుప్రీం కోర్టు ఈ నివేదికలను పరిగణనలోకి తీసుకొంటే ఎన్జీటీ విధించిన పెనాల్టీ అంశంపైనే తొలి విచారణ జరగనుంది. గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ కూడా ఇదే అంశంపై మరో పిటిషన్ దాఖలు చేశారు.

పీకల్లోతు చిక్కుల్లో జేపీ

జగన్ మాటలు నమ్మి జేపీ వెంచర్స్ ఇసుక వ్యాపార రంగంలోకి దిగింది. అడ్డగోలుగా తవ్వకాలు చేసి చట్ట ఉల్లంఘనలకు, పర్యావరణ విధ్వంసానికి పాల్పడింది. ఇప్పుడు ఏకంగా రూ.1,908 కోట్ల పెనాల్టీ కేసును ఆ సంస్థ ఎదుర్కొంటోంది. ఎన్జీటీ ఆదేశంపై సుప్రీం కోర్టులో స్టే తెచ్చుకున్న ఆ సంస్థ, ఇప్పుడు న్యాయ చిక్కుల్లో కూరుకుపోయింది. ఆ సంస్థ అనేకానేక తప్పులు, చట్ట ఉల్లంఘనలకు పాల్పడిందని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు కోర్టుకు నివేదికలు సమర్పించనున్నాయి. జగన్ కోసం రాష్ట్రానికి వచ్చిన జేపీ వెంచర్స్ చేసిన వ్యాపారం తక్కువ. వైసీపీ నేతలు చేసిన వ్యాపారం చాలా ఎక్కువ. అనధికారికంగా రెండేళ్లలో 20 వేల కోట్ల ఇసుక వ్యాపారం జరిగిందని ప్రాథమిక అంచనా. లాభంలో సగం వాటా ముఖ్యనేతకే వెళ్లిందన్న ప్రచారం ఉంది. పేరుకే జేపీ అని, వ్యాపారమంతా తాడేపల్లి కనుసన్నల్లో సాగిందని ఇసుక కాంట్రాక్టర్లు బాహాటంగా చెబుతున్నారు. ఇసుక కాంట్రాక్టు చేసిన జేపీ వెంచర్స్ ఏమో ఇప్పుడు తీవ్ర న్యాయ చిక్కుల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో ఆ సంస్థను జగన్ ఆదుకుంటారా.. లేక చేతులెత్తేస్తారా అని కాంట్రాక్టు వర్గాలు చర్చించుకుంటున్నాయి. జగన్ ఆదుకోకపోతే ఆ సంస్థ పరిస్థితేమిటన్న చర్చ జరుగుతోంది. గత డిసెంబరు నుంచి ఇసుక అమ్మకాలు 18 జిల్లాల్లో ప్రతిమ, 8 జిల్లాల్లో జీసీకేసీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇసుక కాంట్రాక్టు ఈ సంస్థలకు అప్పగించడంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. కొత్తగా పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే తవ్వకాలు చేపట్టాలంటూ హైకోర్టు గనుల శాఖను, 2 కాంట్రాక్టు సంస్థలను ఆదేశించింది. ఈసీలు వచ్చాకే మైనింగ్ చేస్తారని గనుల శాఖ డైరెక్టరేట్ హైకోర్టుకు నివేదించింది. కానీ నిరుడు డిసెంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఆ రెండు సంస్థలు ఈసీలు లేకుండా చట్ట విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాయంటూ కేంద్ర ఏజెన్సీలు బయటపెట్టాయి. అంటే.. కొత్త సంస్థలు కూడా అక్రమాల బాటలోనే నడుస్తున్నాయన్నమాట.

ఉచితం రద్దు చేసి..

రాష్ట్రంలో 2019 సెప్టెంబరు వరకు పేదలకు ఉచితంగా ఇసుక సరఫరా చేశారు. జగన్ సర్కారు వచ్చాక 2019 అక్టోబరులో ఉచిత ఇసుక విధానం ఎత్తివేశారు. ఇసుకను ప్రైవేటుకు ఇచ్చి వ్యాపారం చేయాలని 2020లో నిర్ణయించారు. రెండేళ్లపాటు ఇసుక కాంట్రాక్టును జేపీ వెంచర్స్‌కు ఇచ్చారు. కాంట్రాక్ట్ విలువ 1535 కోట్లు. రెండేళ్ల వ్యవధిలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేపట్టినందుకు ఆ సంస్థ రూ.1,535 కోట్లు అసలు, దానిపై 18 శాతం జీఎస్టీ కలిపి చెల్లించాలి. ప్రభుత్వానికి 850 కోట్ల విలువైన ఇసుక సరఫరా చేసినట్లు ఆ సంస్థ లెక్కలు చెబుతోంది. ఇది పోను 685 కోట్లు చెల్లించాలి. ఇందులో జీఎస్టీ కింద చెల్లించాల్సిన 233 కోట్లను బిడ్ విలువగా చూపించారని తెలిసింది. ఆ సంస్థ ఇంకా సర్కారుకు 453 కోట్ల మేర చెల్లించాల్సి ఉన్నట్లు గనుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతోపాటు జీఎస్టీ బకాయిలు ఉన్నాయని సమాచారం.

రాజమండ్రి రూరల్‌లో..
బుచ్చయ్యకు లైన్‌క్లియర్!

» ఫోన్లో మాట్లాడిన చంద్రబాబు

» జనసేన నేత కందుల దుర్గేశ్‌తో కూడా..?

» సీనియర్లను నివాసానికి పిలిపించి మంతనాలు

» గంటాతో చీపురుపల్లి సీటుపైనే చర్చ

» భీమిలిపై మాజీ మంత్రి ఆసక్తి.. ఆలపాటికి ఏదో ఒక చాన్సు!

» బాబు నిర్ణయం శిరోధార్యం: దేవినేని

» అధినేతను కలిసి వచ్చినా అసంతృప్తిలోనే పీలా గోవింద్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రాజమహేంద్రవరం రూరల్ స్థానం నుంచే ఎన్నికల బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. పార్టీలో అత్యంత సీనియర్ అయిన ఆయన పేరు శనివారం ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో లేకపోవడం కలకలం రేపింది. అదే సీటును జనసేన నేత కందుల దుర్గేశ్ కూడా ఆశిస్తుండడంతో కొంత ఉత్కంఠకు దారితీసింది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారమిక్కడ తన నివాసం నుంచి బుచ్చయ్యతో ఫోన్లో మాట్లాడారు. ఆయనకు ఖాయంగా అవకాశం లభిస్తుందని, ఆందోళన చెందవద్దని సముదాయించారు. జనసేన నేతలతో కూడా మాట్లాడుతున్నానని, ఒకట్రెండు రోజుల్లో అక్కడే ఆయన్ను అభ్యర్థిగా ప్రకటిస్తామని భరోసా ఇచ్చారు. బుచ్చయ్య ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. దుర్గేశ్‌తో కూడా చంద్రబాబు ఫోన్లో మాట్లాడినట్లు సమాచారం. మరో సీట్లో సర్దుబాటు చేసుకోవాలని కోరగా ఆయన అంగీకరించినట్లు చెబుతున్నారు.

ఇతరత్రా అవకాశాలిస్తా..

తొలి జాబితాలో పేర్లు రాని కొందరు సీనియర్లను చంద్రబాబు ఆదివారమిక్కడ తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. పార్టీపరంగా ఉన్న పరిస్థితిని వివరించారు. వారికి ఇతరత్రా అవకాశాలు కల్పిస్తామని, పార్టీకి సహకరించాలని కోరారు. వారిలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి), దేవినేని ఉమామహేశ్వరరావు (మైలవరం), గంటా శ్రీనివాసరావు (విశాఖ ఉత్తరం), మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ (విశాఖ దక్షిణ), పీలా గోవింద్ (అనకాపల్లి), రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, రైల్వే కోడూరు పార్టీ నేత ముక్కా రూపానందరెడ్డి తదితరులు ఉన్నారు. గంటాతో భేటీలో చీపురుపల్లి స్థానంపైనే చర్చ జరిగినట్లు సమాచారం. అక్కడ మంత్రి బొత్స సత్యనారాయణపై గంటా పోటీ చేస్తే విజయావకాశాలు బాగుంటాయని సర్వే నివేదికలు వస్తున్నాయని, అక్కడ బరిలో దిగాలని చంద్రబాబు సూచించారు. అయితే తనకు భీమిలిపై ఆసక్తి ఉందని, అది కాకపోయినా విశాఖ జిల్లాలో ఎక్కడ అవకాశమిచ్చినా పోటీ చేస్తానని గంటా చెప్పారు. తాను విశాఖ నివాసినని, వేరే జిల్లాలో పోటీ చేయడం తనకు ఇబ్బందని కూడా అన్నారు. ఎక్కడ నిలపాలో తాను నిర్ణయం తీసుకుంటానని, అది తనకు వదిలిపెట్టాలని చంద్రబాబు తనకు చెప్పారని గంటా ఆ తర్వాత విలేకరులకు తెలిపారు. తన మైలవరం సీటుపై దేవినేని ఉమ ముప్పావు గంట అధినేతతో చర్చించారు. అక్కడి సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలోకి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 'ఒక్కో చోట ఒక్కో రకమైన సమీకరణలు ఉంటాయి. విజయావకాశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. నీ శ్రమ నాకు తెలుసు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా సహకరించు. నిన్ను ఎలా సర్దుబాటు చేయాలో నేను చూసుకుంటాను' అని చంద్రబాబు ఉమతో అన్నారు. చంద్రబాబు కుటుంబానికి తాను సైనికుడి వంటివాడినని, ఆయన మాట తనకు శిరోధార్యమని బయటకు వచ్చిన తర్వాత దేవినేని వ్యాఖ్యానించారు. జనసేనతో పొత్తు వల్ల తెనాలి సీటు ఇవ్వలేకపోతున్నామని మాజీ మంత్రి ఆలపాటికి చంద్రబాబు చెప్పారు. మరెక్కడైనా సర్దుబాటు చేసే వీలుంటే ప్రయత్నం చేస్తానని.. కుదరకపోతే ఆ తర్వాతైనా ఏదో ఒక అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీ తనకు సంతృప్తి కలిగించిందని రాజా తర్వాత విలేకరులతో చెప్పారు. కాగా.. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్‌ను తీసుకుని చంద్రబాబు నివాసానికి వచ్చారు. ఆయన్ను కలిసి వచ్చిన తర్వాత కూడా గోవింద్ అసంతృప్తిగానే కనిపించారు. ఇంకోవైపు.. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పొత్తులో బీజేపీకి వెళ్లకపోతే దానికి బొడ్డు వెంకటరమణ పేరు పరిశీలిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజంపేట అసెంబ్లీ సీటుకు తన పేరు పరిశీలించాలని రూపానందరెడ్డి అధినేతను కోరారు.

నాపై అవమానకర పోస్టులు పెడుతున్నారు

» టీ-సైబర్ క్రైం పోలీసులకు వైఎస్ షర్మిల ఫిర్యాదు

» యూట్యూబర్ శ్రీరెడ్డి సహా 10 మందిపై కేసు



హైదరాబాద్, ఫిబ్రవరి 25: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫిర్యాదు మేరకు యూట్యూబర్ శ్రీరెడ్డి సహా పది మంది వ్యక్తులపై తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో తనపై అవమానకరమైన పోస్టులు పెడుతున్నారంటూ షర్మిల ఫిర్యాదు చేశారు. దోషులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో సైబర్ క్రైం పోలీసులు శ్రీరెడ్డి తదితరులపై కేసు నమోదు చేశారు.

నేడు అనంతలో కాంగ్రెస్ శంఖారావం.. రానున్న ఖర్గే

అనంతపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే సోమవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం 4గంటలకు న్యాయ సాధన సభ పేరుతో బహిరంగ సభను నిర్వహించనున్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో నిర్వహించే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ సభావేదిక నుంచే ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన కొన్ని పథకాలను ప్రకటించనున్నట్లు ఆ పార్టీ ముఖ్యులు తెలిపారు.

టీడీపీకే మా మద్దతు

» మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి దృష్ట్యా తెలుగుదేశం పార్టీకే తమ సంపూర్ణ మద్దతునిస్తున్నామని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రకటించింది. విజయవాడలో ఆదివారం సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమితి అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన ఫారూఖ్ షిబ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాబోయే ఎన్నికల్లో మైనారిటీలు, ముస్లింలు ఏ పక్షాన ఉండాలన్న దానిపై కొన్ని తీర్మానాలు చేశారు. వైసీపీ ప్రభుత్వం మైనారిటీలకిచ్చే అన్ని పథకాలనూ రద్దు చేసిందన్నారు. తిరిగి ఎన్నికల్లో గెలుపొందడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను మోసం చేయడానికి సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి టీడీపీతో కలిసి నడుస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమితి పతాకాన్ని మాజీ న్యాయాధికారి ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మైనారిటీలు, ముస్లింలపై చేసిన దాడులు, అన్యాయాలకు సంబంధించి ఎనిమిది పేజీల పుస్తకాన్ని విడుదల చేశారు.

వైసీపీ మునిగిపోయే నావ

» వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోవడం ఖాయం: గంటా

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మునిగిపోయే నావ అని, రాష్ట్రంలో ప్రతివర్గం ఆ పార్టీని వ్యతిరేకిస్తోందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ-జనసేన విడుదల చేసిన మొదటి జాబితాపై మంచి ఫీడ్‌బ్యాక్ వస్తోందన్నారు. తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత నిజమో.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం కూడా అంతే నిజమని జోస్యం చెప్పారు. తొలి జాబితాలో పేరు లేనంతమాత్రాన సీనియర్లను అవమానించినట్లు కాదన్నారు. పొత్తుల వల్ల కొందరికి సీట్లు దక్కకపోవచ్చని, వారికి పార్టీ న్యాయం చేస్తుందని చెప్పారు. పొత్తులు, సీట్లు సర్దుబాటు అనేది టీడీపీ-జనసేన పార్టీల అంతర్గత వ్యవహారమని వైసీపీకి ఎందుకని ప్రశ్నించారు. వైసీపీలో ఇమడలేక చాలా మంది ఆ పార్టీని వీడుతున్నారని తెలిపారు. 70 మందిని ప్రకటించడానికే వైసీపీ ఏడు లిస్టులు విడుదల చేసిందని, అయినా స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తనను తిట్టారంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

ఏలూరులో రేపే బీజేపీ భేరి!

» 16 వేల మంది బూత్ కార్యకర్తలతో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల భేరికి బీజేపీ కూడా సమాయత్తమైంది. ఏలూరులో మంగళవారం 16 వేల మంది పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లతో భారీ సమావేశం నిర్వహిస్తోంది. 25 లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి మొదటి సమావేశాన్ని ఏలూరులో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టింది. దేశంలోనే ఇది మొదటి క్లస్టర్ భేటీ కూడా కావడం గమనార్హం. దీనిని ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో తలపండిన మాజీ జాతీయ అధ్యక్షుడు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించనుండడం మరో విశేషం. ఈ భేటీకి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు, నరసాపురం లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ నుంచి ఇద్దరు క్రియాశీల కార్యకర్తలను ఆహ్వానించారు. ఎన్నికల నిర్వహణ గురించి బూత్ ఏజెంట్లకు రాజ్‌నాథ్ వివరిస్తారు. ఉచిత రేషన్, రైతు భరోసా (రూ.6 వేలు), ఉజ్వల గ్యాస్, ఆయుష్మాన్ భారత్, పక్కా గృహాలు, ఉపాధి పనులు మొదలైన పథకాలు అమలు చేస్తున్నది మోదీ ప్రభుత్వమేనన్న సంగతి ఓటర్లకు వివరించాలని చెబుతారు. తర్వాత నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ, అనంతపురంలో జరిగే క్లస్టర్ సమావేశాలకు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్, జేపీ నడ్డా తదితర అగ్రనేతలు హాజరవుతారని.. సమయాన్ని బట్టి ఏదో ఒక కార్యక్రమానికి ప్రధాని మోదీ వచ్చే అవకాశముందని రాష్ట్ర బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల్లో పొత్తులను కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందని, తాము 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీకి సంసిద్ధమవుతున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. పొత్తులపై అగ్ర నాయకత్వం స్పష్టత ఇచ్చిన తర్వాత ఢిల్లీ పెద్దల ఆదేశాల మేరకు ఏ నియోజకవర్గంలో మిత్రపక్షానికి సహకరించాలి.. ఏ నియోజకవర్గంలో వారి ఓట్లు తాము తీసుకోవాలనే దానిపై సమన్వయం చేసుకుంటామని ఆ పార్టీ నేతలు వివరిస్తున్నారు.

నేడు కుప్పానికి జగన్

» రామకుప్పంలో హంద్రీ-నీవా జలాలు విడుదల

» ఎన్నికల ముంగిట ప్రచారానికే!

చిత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సోమవారం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రామకుప్పం మండలంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం శాంతిపురం మండలంలో బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి తానే నీరిచ్చానని ప్రచారం చేసుకునేందుకే ఆయనీ సభ తలపెట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ హయాంలో 80 శాతానికి పైగా పూర్తయిన ఈ కాలువ పనులను మొత్తం తామే పూర్తి చేశామని వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అధికారులు ఎంత ప్రయత్నించినా నియోజకవర్గంలోకి హంద్రీ-నీవా నీళ్లు రాకపోవడంతో జగన్ పర్యటన ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా పడింది. తాజాగా రామకుప్పం మండలం వరకు నీళ్లు వచ్చినా ప్రవాహం లేకపోవడంతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు, చెరువులకు వెళ్లే అవకాశం లేదు.

గాజాలో ప్రజలకు కలుపు మొక్కలే ఆహారం!

ఖాన్‌యూనిస్, ఫిబ్రవరి 25: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం గాజా వాసుల ఆకలి కేకలకు కారణమవుతోంది. ఇజ్రాయెల్‌పై దాడిలో ఐక్య రాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సిబ్బంది పాత్ర వెలుగులోకి వచ్చాక.. ఆ సంస్థ కూడా గాజా నుంచి పూర్తిగా వైదొలగింది. ఇంతకాలం శరణార్థులకు అన్నపానీయాలను అందించిన యూఎన్ఆర్‌డబ్ల్యూఏ గాజాను వీడడంతో.. ఆకలి కేకలు పెరిగాయి. ముఖ్యంగా 22 లక్షల జనాభాలో 80% మంది దక్షిణ గాజాలోని రఫాలో తలదాచుకుంటుండగా.. ఆ ప్రాంతంలో ఆహార సమస్య తీవ్రమైంది. దాంతో 'మాలో' అనే కలుపు మొక్కలను సేకరిస్తున్న వ్యాపారులు.. ఒక కట్ట మొక్కలకు 80 ఇజ్రాయెలీ షాకెల్స్(భారత కరెన్సీలో సుమారు రూ.1,800) వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఈ మొక్కను నోటి ఎలర్జీ, గొంతునొప్పి వంటి రుగ్మతలకు ఔషధంగా వాడుతారు. ఆహారంగా ఈ మొక్కను తీసుకోవడం ప్రమాదమని తెలిసినా.. ఆకలిని తట్టుకోవడానికి మరో మార్గం లేదని గాజా వాసులు వాపోతున్నారు. ఉత్తర గాజాలో మాత్రం నీరు, ఆహారం, ఔషధాల కొరత లేదని తెలుస్తోంది. అయితే.. గాజాకు ఉత్తరాన, వెస్ట్‌బ్యాంక్‌లోని జబాలియా శిబిరంలోనూ ఆకలి కేకలు తీవ్రమయ్యాయి. దీంతో.. గుర్రాలను చంపి, వంట చేసి, పిల్లల కడుపు నింపాల్సి వస్తోందని శరణార్థులు వాపోతున్నారు. 1.4 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన ఈ శిబిరంలో లక్ష మంది ఉండగా.. భిక్షమెత్తుకుని బతకాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. రంజాన్‌లోపు కాల్పుల విరమణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈజిప్ట్ వర్గాలు వెల్లడించాయి.

సీటొచ్చిందని ఈగో వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

మార్చేందుకు ఎంత మాత్రం వెనుకాడను. ప్రతి వారం మీ పనితీరు సమీక్షిస్తా. ఎన్నికల వరకు వారానికోసారి సర్వే చేయిస్తా. తేడా వస్తే వేటు తప్పదు' అని హెచ్చరించారు. తటస్థులను కలవాలని, రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వివరించి అన్ని వర్గాల మద్దతూ కోరాలని సూచించారు. మంచివారు పార్టీలోకి వస్తే ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలతో పాటు గెలుపే లక్ష్యంగా టీడీపీ అభ్యర్థుల ఎంపిక జరిగిందని చెప్పారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, 5కోట్ల మంది భవిష్యత్ కోసమే టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. 'గతంలో ఎప్పుడూ ఇంతముందుగా అభ్యర్థుల ప్రకటన జరుగలేదు. వచ్చే 40రోజులు అత్యంత కీలకం. నిత్యం ప్రజల్లో ఉండి వారికి నమ్మకం, ధైర్యం అందించాలి. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించాం. ఇప్పుడు 99 చోట్ల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించాం. ప్రజలతో ఓట్లు వేయించాల్సిన బాధ్యత మీపై ఉంది. మన మిత్రపక్షమైన జనసేన నేతలను గౌరవించి వారిని కలుపుకొని పోవాలి. రెండు పార్టీల నేతల సమన్వయంతో పనిచేస్తే నూటికి నూరు శాతం ఓట్ల బదిలీ జరుగుతుంది' అని తేల్చిచెప్పారు.

జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధం

చరిత్రలో చూడని విధ్వంస పాలకుడైన జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు చెప్పారు. అతడి అహంకారమే అతడి పతనానికి నాందిగా పేర్కొన్నారు. 'ఎన్నికలకు జగన్ సిద్ధంగా లేరు. 'సిద్ధం' పేరిట సభలు పెడుతున్నా... అభ్యర్థులను ప్రకటించలేకపోయారు. పిలుపిచ్చారు. ప్రతి అభ్యర్థీ ఒక న్యాయవాదిని నియమించుకోవాలన్నారు. ప్రచార విభాగాన్ని బలోపేతం చేసుకోవాలని, ప్రభుత్వ విధానాలతో పాటు స్థానిక ఎమ్మెల్యేల పనితీరును ఎండగట్టేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సూచించారు. ఐదేళ్ల పాలనపై గ్రామాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు కూడా అసంతృప్తితో ఉన్నారని తెలిపారు.

నేడు సిక్కోలులో భారీ సభ

శ్రీకాకుళం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం చంద్రబాబు సోమవారం శ్రీకాకుళంలో 'రా కదలిరా' సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుంది. టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన తర్వాత.. తొలిసారి చంద్రబాబు శ్రీకాకుళం వస్తున్నందున భారీ స్థాయిలో సభ నిర్వహించాలని భావిస్తున్నారు. ఆయన ఇప్పటి వరకు 21 లోక్‌సభ స్థానాల్లో 'రా కదలిరా' సభల్లో పాల్గొనగా.. ఇది 22వది.

ఐఏఎస్‌లకూ జగన్ టోపీ

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్ రైజింగ్‌లో ఉన్నప్పుడు దక్కాల్సిన రాబడులు తమకు దక్కకుండా పోతాయని ఐఏఎస్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల రిటైర్మెంట్ తర్వాత తమకు పెన్షన్ రూపంలో అందాల్సినసొమ్ము సామాజిక పెన్షన్ల కంటే తక్కువగా ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదని భావిస్తున్నారు. పైగా ఈ ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు వచ్చే ప్రభుత్వం ఇస్తుందన్న గ్యారంటీ లేదని, ఇప్పుడు గట్టిగా ఒత్తిడి చేయకపోతే మొదటికే మోసం వస్తుందని నిర్ణయానికి వచ్చారు. ఈ అంశంపై సీరియస్‌గా చర్చించాలని ఐఏఎస్‌లు నిర్ణయించుకున్నారు. అంతేకాదు, ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకోవాలని తమ సంఘం నాయకులకు తేల్చి చెబుతున్నారు. ఈ సమస్యే ప్రధాన అజెండాగా సోమవారం ఐఏఎస్‌ల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మీటింగ్ జరగనుంది. అయితే, ఈ సమస్యను సమావేశం అజెండాలో చేర్చితే, అది మీడియాకు లీకైతే ప్రభుత్వం పరువుపోతుందని అసోసియేషన్ నాయకులు వేదన పడుతున్నారు. అందుకే ఈ అంశాన్ని అప్పటికప్పుడు టేబుల్డ్ ఐటమ్‌గా చర్చించాలని నిర్ణయించారు. 25 నెలల నుంచి ఐఏఎస్‌లకు ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమ కావడంలేదన్న విషయం బయటకుపొక్కితే తీవ్రచర్చనీయాంశం అవుతుందని, ఈ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని అసోసియేషన్ నాయకులు భావిస్తున్నారు. అందుకే గుట్టుచప్పుడు కాకుండా చర్చించి, మీడియాకు దూరంగా ఉంచాలని నిర్ణయించారు.

ఉద్యోగులకు ఏదాదిగా ఎగవేత: ప్రభుత్వ ఉద్యోగులు తమకు హక్కుగా అందాల్సిన ప్రయోజనాలపై నాలుగున్నరేళ్ల నుంచి వివిధ రూపాల్లో జగన్ సర్కారుపై పోరాటం చేస్తున్నారు. 2022 నవంబరులో తమకు సీపీఎస్ కంట్రిబ్యూషన్ జమ చేయాలంటూ మంత్రులకు, సెక్రటరీలకు వినతిపత్రాలిస్తూ నిరసన వ్యక్తంచేశారు. దీంతో ప్రభుత్వం 2023, మార్చి వరకు సీపీఎస్ కంట్రిబ్యూషన్ జమ చేసింది. అంతే, అప్పటి నుంచి కంట్రిబ్యూషన్ కింద ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో మార్కెట్‌లో పెట్టుబడుల ద్వారా ఉద్యోగులకు దక్కాల్సిన మెరుగైన రాబడులను వారు కోల్పోతున్నారు. ఫలితంగా రిటైర్మెంట్ తర్వాత వారికి అందే అరకొర పెన్షన్‌లో భారీకోత పడనుంది. మరోవైపు ప్రభుత్వం మాత్రం ప్రతినెలా ఉద్యోగుల వేతనం నుంచి 10 శాతం సొమ్మును కట్ చేస్తూ దానిని సొంత అవసరాలకు వాడేస్తోంది.

ఎన్‌పీఎస్ కంట్రిబ్యూషన్ జమ అంటే

2004 సెప్టెంబరు నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి ఎన్‌పీఎస్ కింద పెన్షన్ ఇస్తున్నారు. దీనికిగాను ఉద్యోగుల వేతనంలో 10 శాతం కట్ చేసి, ఆ సొమ్ముకు మరో 10 శాతం కలిపి ప్రభుత్వం ఎన్ఎస్‌డీఎల్‌కి జమ చేస్తే వారు మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తారు. మార్కెట్ హెచ్చుతగ్గులను బట్టి రాబడులు ఉంటాయి. ఉద్యోగులు రిటైరయ్యే నాటికి రాబడులతో కలిపి జమయిన మొత్తం సొమ్ములో 60శాతం ఉద్యోగులకు ఇస్తారు. 40శాతం సొమ్మును తిరిగి పెట్టుబడి పెట్టి, దానిపై వచ్చిన రాబడిని ఉద్యోగికి పెన్షన్‌గా నెలనెలా అందిస్తారు. ఈ పెన్షన్ మొత్తం ఎక్కువగా ఉండాలంటే ఎప్పటికప్పుడు మార్కెట్లో ఇన్వెస్ట్ చేయాలి. కానీ, జగన్ సర్కార్ ఈ పని చేయడం లేదు.

ఎన్‌పీఎస్ కింద ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను సకాలంలో జమచేయడంలో, అసలు జమచేయని సందర్భాల్లో ఉద్యోగులకు నష్టపరిహారం చెల్లించాలని కేంద్ర ఆర్థిక శాఖ 2019లోనే అన్ని రాష్ట్రాలకు మెమో ఇచ్చింది. ఎంతకాలమైతే ఆలస్యమైందో ఆ కాలానికి వడ్డీని ఉద్యోగుల ఖాతాలో వేయాలని కేంద్రం ఆదేశించింది. జీపీఎఫ్‌పై అమలయ్యే వడ్డీరేటునే ఈ ఆలస్యపు డిపాజిట్లపై అమలు చేయాలని కేంద్రం పేర్కొంది. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క నెల కూడా సకాలంలో ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వం జమచేయలేక పోయింది. అయినప్పటికీ, ఏ ఒక్క సందర్భంలో కూడా ఉద్యోగులకు వడ్డీ చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ కింద తన కంట్రిబ్యూషన్‌ను 14 శాతానికి పెంచి, ఉద్యోగులకు మెరుగైన రాబడులు అందించేందుకు ప్రయత్నిస్తోంది. కేంద్రం తరహాలోనే చాలా రాష్ట్రాల ప్రభుత్వాలు తమ కంట్రిబ్యూషన్‌ను 14 శాతానికి పెంచి ఉద్యోగులకు మేలు చేస్తున్నాయి. చంద్రబాబు హయాంలో చివరి ఏడాదిలో ఉద్యోగులతో జరిగిన చర్చల్లోను, టక్కర్ కమిటీ నివేదికలోనూ ఈ కంట్రిబ్యూషన్‌ను 14 శాతానికి పెంచేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం సిద్ధమైంది. కానీ, తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ మాత్రం కంట్రిబ్యూషన్‌ను 10 శాతం వద్దే ఉంచి, దాన్ని కూడా సకాలంలో జమ చేయకుండా ఏళ్ల తరబడి ఉద్యోగులకు కుచ్చుటోపీ పెడుతున్నారు.



బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దేశ సత్వరాభివృద్ధే లక్ష్యం

- మంగళగిరి ఎయిమ్స్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ
- గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా కార్యక్రమం

మంగళగిరి, హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 25: దేశ సత్వర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రూ.1618.23 కోట్ల వ్యయంతో నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆస్పత్రిని ఆదివారం ఆయన గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మంగళగిరితోపాటు రాయ్‌బరేలీ, కళ్యాణి, భాటిండా నగరాలలో నిర్మితమైన ఎయిమ్స్ ఆస్పత్రులను కూడా మోదీ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. తాను బాధ్యతలు చేపట్టాక ఈ పరిస్థితులను మార్చి ఢిల్లీకి వెలుపల దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించామని అన్నారు. గతంలో ఢిల్లీకి మాత్రమే పరిమితమైన ఎయిమ్స్‌ను నేడు దేశంలోని 22 వేర్వేరు ప్రాంతాల్లో ఢిల్లీ ఎయిమ్స్‌కు దీటుగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. రూ.233 కోట్లతో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద తొమ్మిది క్రిటికల్‌కేర్ హెల్త్‌బ్లాకులను రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే విశాఖపట్నంలో మైక్రో బయాలజీ ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ప్రారంభోత్సవంతోపాటు రాష్ట్రంలో మరో నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి, సహాయమంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, రాజ్యసభ సభ్యులు సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు.

హిందూపురంలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శ్రీకారం

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆవిష్కరించారు.

ఎయిమ్స్‌కు జగన్ ప్రభుత్వం ఇచ్చిన నిధులు సున్నా
కాదని నిరూపిస్తే రూ.లక్ష బహుమతి

మంగళగిరి, ఫిబ్రవరి 25: మంగళగిరి ఎయిమ్స్ వద్ద బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం సృష్టించింది. మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిని జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా హాజరైన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్‌తోపాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు భౌతికంగా హాజరయ్యారు. ఈ క్రమంలో బీజేపీ యువమోర్చా నేతలు ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద 'రూ.లక్ష బహుమతి పొందే గొప్ప అవకాశం' అంటూ ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు రూ.1,618 కోట్లను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమే ఇచ్చిందని, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన నిధులు సున్నా అంటూ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. కాదని ఏ పార్టీ నాయకులైనా నిరూపిస్తే రూ.లక్ష బహుమతి అందిస్తామని అందులో పేర్కొన్నారు. పోలీసులు ఈ ఫ్లెక్సీని తొలగించేందుకు ప్రయత్నించగా బీజేపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్యా తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. బీజేపీ శ్రేణులపై తాడేపల్లి సీఐ మధుసూదనరావు దాడిచేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. కాగా, యువమోర్చా నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమర్థించారు. అందులో తప్పేమీ లేదన్నారు. ఎయిమ్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి మాత్రమే ఇచ్చిందని, మిగతా నిర్మాణ వ్యయమంతా కేంద్రమే భరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం నీరు కూడా అందించడంలేదన్నారు.

ఢిల్లీలో 2 వేలకోట్ల డ్రగ్స్ రాకెట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఢిల్లీలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. 50 కిలోల రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో తమిళనాడుకు చెందిన ఓ సినీ నిర్మాత మాస్టర్ మైండ్‌గా ఉన్నట్టు గుర్తించారు. ఈ గ్యాంగ్ మూడేళ్లలోనే దాదాపు రూ.2వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలకు సరఫరా చేసింది. డ్రగ్స్ ముఠా కొబ్బరి పొడి, హెల్త్ మిక్స్ పౌడర్లలో దాచి ఆ దేశాలకు సరఫరా చేస్తున్నారు. కాగా, ఈ ముఠాకు మాస్టర్ మైండ్‌గా ఉన్న తమిళ సినీ నిర్మాత పరారీలో ఉన్నాడని అధికారులు వెల్లడించారు.

మోదీ స్కూబా డైవింగ్

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకృష్ణుడిని ప్రార్థించారు. నెమలి ఈకలను సమర్పించారు. బయటకు వచ్చిన అనంతరం తన అనుభవాలను పంచుకుంటూ.. అత్యంత దివ్యమైన అనుభూతి కలిగిందని, ద్వారక సందర్శనకు ధైర్యంకన్నా విశ్వాసమే కీలకమని చెప్పారు. ప్రాచీన నగరాన్ని స్పృశించినప్పుడు 21వ శతాబ్దంలో వైభవోపేత భారతదేశం తన ముందు కదలాడిందని, చాలాసేపు నీళ్లలోనే గడిపానని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలచాలన్న తన నిశ్చయం మరింత బలపడిందన్నారు. 'సముద్రంలో మునిగిపోయిన ద్వారక గురించి పురాతత్వవేత్తలు చాలా రాశారు. మన పురాణాల్లో కూడా దాని గురించి ఎంతో ఉంది. విశ్వకర్మ స్వయంగా ఈ నగరాన్ని నిర్మించారని అంటారు. ప్రణాళికబద్ధంగా, అభివృద్ధికి చిహ్నంగా నిర్మించిన గొప్ప నగరం ద్వారక. ఆ నగరాన్ని దర్శించుకున్నప్పుడు నాటి ప్రాచీన వైభవాన్ని, దివ్యత్వాన్ని అనుభూతి చెందాను. నాతోపాటు నెమలి ఈకలను తీసుకెళ్లి శ్రీకృష్ణుడికి సమర్పించాను' అని వెల్లడించారు. ద్వారకను సందర్శించాలన్న తన కోరిక దశాబ్దాల నాటిదని, నేడు అది పూర్తి కావటంతో అపరిమితమైన సంతోషం కలిగిందని మోదీ తెలిపారు. ఎక్స్‌లో కూడా ప్రధాని కొన్ని ఫొటోలను షేర్ చేశారు.

కాంగ్రెస్‌పై విమర్శల వర్షం

అంతకుముందు ప్రధాని మోదీ.. దేశంలోనే అతి పెద్ద కేబుల్ బ్రిడ్జి 'సుదర్శన్ సేతు'ను ద్వారకలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ విపక్ష కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. దేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన ఆ పార్టీకి ప్రజల కనీసావసరాలు తీర్చాలనే చిత్తశుద్ధి,


సుదర్శన్ సేతును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

అంకితభావం లేనేలేదన్నారు. ఆ పార్టీ శక్తియుక్తులను ఒక్క కుటుంబం అభివృద్ధి కోసం, ఐదేళ్లపాటు ప్రభుత్వాన్ని నడపటం కోసం, కుంభకోణాలను దాచిపెట్టడం కోసం వినియోగిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నాయని, తాను ప్రధాని అయిన తర్వాత వాటిని అడ్డుకున్నానని.. దానివల్లే దేశంలో సుదర్శన్ సేతు వంటి భారీ మౌలిక సదుపాయాల నిర్మాణం సాధ్యమైందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను తీర్చే సామర్థ్యం కాంగ్రెస్‌కు లేనందువల్లే వారి హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ప్రజల ఆశీర్వాదంతో తాను ప్రధాని అయిన తర్వాత ఈ పదేళ్లలో భారత్ 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేసిన సుదర్శన్ సేతను ప్రారంభించటం తన అదృష్టమని, మోదీ గ్యారెంటీకి ఇది నిదర్శమని చెప్పారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమోదం లభించలేదని మోదీ తెలిపారు.

కేరళకు మరోసారి మోదీ

ప్రధాని మోదీ మరోసారి కేరళలో పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మోదీ పదేపదే కేరళలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు నెలల కాలంలో కేరళకు మోదీ రావడం ఇది మూడోసారి. దక్షిణాది రాష్ట్రాలలో బలపడాలన్న బీజేపీ వ్యూహం మేరకు ఈ ప్రాంతంపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో పోయిన జనవరిలో కేరళలో పర్యటించిన ప్రధాని మోదీ ఈ నెల27వ తేదీన మళ్లీ కేరళకు రానున్నారు. ఆ రాష్ట్ర బీజేపీ నేతలు చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

వంతెనతో ద్వారకానాథ్ సందర్శన ఇక సులువు

పాత, కొత్త ద్వారకలను అనుసంధానించే 2.32 కి.మీ.ల పొడవైన సుదర్శన్ సేతును రూ.980 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీనిద్వారా ద్వారకానాథ్ ఆలయాన్ని సందర్శించే భక్తులకు సులువుగా వెళ్లిరావటానికి వీలవుతుంది. ద్వారకానాథ్ ఆలయం ద్వారక నగరానికి 30 కి.మీ.ల దూరంలో బెట్ ద్వారక అనే దీవిలో ఉంది. ఈ ఆలయానికి భక్తులు ఓఖా నౌకాశ్రయం నుంచి పడవల మీద వెళ్లివస్తుంటారు. కేబుల్ బ్రిడ్జి వల్ల ఇప్పుడు ఆ అవసరం లేదు. కేబుల్ బ్రిడ్జి ఫుట్‌పాత్ పైభాగం మీద సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. బ్రిడ్జి మీద మార్గాన్ని నాలుగు లేన్లుగా మలిచారు. వంతెనకు ఇరువైపులా భగవద్గీతలోని శ్లోకాలు, శ్రీకృష్ణుడి చిత్రాలను చిత్రించారు. దీంతో ఈ తీగల వంతెన ఓ పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంది.

గ్రూప్-2లో 'ఆడుదాం ఆంధ్రా'

- మెంటల్ ఎబిలిటీ ప్రశ్నల్లో వైసీపీ ప్రభుత్వ పథకాలకు చోటు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఏపీపీఎస్సీ అభ్యర్థులకు చుక్కలు చూపించింది. చదవడానికి తక్కువ సమయం ఇచ్చి ఎన్నికల కోసం హడావుడిగా పరీక్ష నిర్వహించమే గాక కఠిన ప్రశ్నలతో ఇబ్బంది పెట్టింది. కొత్తగా తీసుకొచ్చిన 'ఇండియన్ సొసైటీ' విభాగంలో అత్యంత కఠిన ప్రశ్నలు వచ్చాయని అభ్యర్థులు చెప్పారు. గిరిజన తెగలు, జాతీయ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై సిలబస్ అని పేర్కొన్న ఏపీపీఎస్సీ వాటికి సంబంధం లేని ప్రశ్నలు ఇచ్చిందని వాపోతున్నారు. అలాగే ప్రభుత్వ పథకాల ప్రచారానికి కూడా ప్రభుత్వం గ్రూప్-2ను వాడుకుంది. అసలు సంబంధమే లేని విభాగంలో బలవంతంగా 'ఆడుదాం ఆంధ్రా' పథకం పేరును ఇరికించింది. మెంటల్ ఎబిలిటీకి సంబంధించిన ప్రశ్నల్లో ఈ పథకం పేరుతో ఒక పేరా ఇచ్చి, అందులో నుంచి మూడు ప్రశ్నలు అడిగింది. అలాగే జగనన్న తోడు, చేదోడు, వైఎస్సార్ నవోదయం పథకాల గురించి ప్రశ్నలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 4.04 లక్షల మంది గ్రూప్-2 ప్రిలిమ్స్ రాసినట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ తెలిపారు. ప్రిలిమ్స్‌పై అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 150 మార్కుల పేపరుకు 70 మార్కులు రావడం కూడా గగనమేనని, 100 ప్రశ్నలు దాటి సమాధానాలు పెట్టినవారే ఉండరని అంచనా వేస్తున్నారు. కాగా, ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష విశాఖ జిల్లాలో 105 కేంద్రాల్లో జరిగింది. 39,300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం కేంద్రాల్లో 9,060మంది, ప్రకాశం జిల్లాలో గ్రూప్-2 పరీక్షకు 49 కేంద్రాల్లో 17,860 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

చిత్తూరులో నకిలీ హాల్ టికెట్ కలకలం

చిత్తూరులో ఓ అభ్యర్థి నకిలీ హాల్‌టికెట్ వ్యవహారం కలకలం రేపింది. మహేంద్ర అనే అభ్యర్థి గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్న కలెక్టరేట్ పరీక్షల విభాగానికి, ఆర్డీవో విభాగానికి తన హాల్‌టికెట్‌ను సెల్‌ఫోన్ ద్వారా పంపి అడ్రస్ చెప్పాలని కోరాడు. అయితే ఆ అభ్యర్థి పంపిన ఐడీ కోడ్ నెంబరు వేరుగా ఉండడంతో వారు ఈ వ్యవహారాన్ని ఏపీపీఎస్సీ కాల్‌సెంటర్‌కు తెలిపారు. ఐడీకోడ్ వేరుగా ఉండటంతో నకిలీదని తేల్చారు. ఈ వ్యవహారం బయటపడడంతో ఆ అభ్యర్థి పరీక్ష రాయకుండా జారుకున్నాడు.

టిప్పర్ ఢీకొని.. రోడ్డు ప్రమాదం

గ్రూప్ 2 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఉమ్మడి కృష్ణాజిల్లా పెద ఓగిరాలకు చెందిన ఎండీ రియాజ్ ఆదివారం చల్లపల్లిలోని ఎగ్జామ్ సెంటర్‌కు సోదరుడి బైకుపై బయల్దేరాడు. చల్లపల్లి-నడకుదురు రోడ్డులో రాముడుపాలెం అడ్డరోడ్డు దగ్గర్లో రియాజ్ బైకును టిప్పర్ ఢీకొంది. దీంతో రియాజ్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

పొత్తు పొడిచింది!

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో స్పష్టత వస్తుందని, ఏ పార్టీకి ఎన్ని సీట్లు అన్నదానిపై చర్చలు నడుస్తున్నాయని వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు తొలుత 2 సీట్లే కేటాయిస్తానని చెప్పిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పుడు 5 సీట్ల వరకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని, అయితే తమకు అస్సాంలో 2 సీట్లు, మేఘాలయలో ఒక సీటు కావాలని ఆమె కోరారని పేర్కొన్నాయి. చర్చలు చివరి దశలో ఉన్నాయని, పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి దెబ్బతినకుండా చూడటం చారిత్రక అవసరమని మిత్రపక్షాలు భావిస్తున్నాయని వెల్లడించాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ 14, ఉద్ధవ్ ఠాక్రే శివసేన 15, శరద్ పవార్ ఎన్సీపీ 9 సీట్లలో పోటీ చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని, మిగిలిన 8 సీట్లపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలియజేశాయి.

యూపీలో పొత్తు కీలకం

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య సీట్ల ఒప్పందం కుదరడం కీలక రాజకీయ పరిణామంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎస్పీ 63 సీట్లు, కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇండియా కూటమి నుంచి ఆర్ఎల్డీ తప్పుకొని బీజేపీతో చేతులు కలపడంతో.. కాంగ్రెస్‌కు యూపీలో గణనీయమైన సంఖ్యలో సీట్లు లభించాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన ప్రకటనతో.. రైతుల సంఖ్య గణనీయంగా ఉన్న పశ్చిమ యూపీలో కాంగ్రెస్‌కు ప్రయోజనం లభించవచ్చునని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఆర్ఎల్డీ ప్రభావం అధికం. ఇక్కడ కాంగ్రెస్ ఐదు స్థానాల్లో పోటీ చేస్తోంది. ఎస్పీ, కాంగ్రెస్ పొత్తు వల్ల యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో కనీసం 24 స్థానాలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాలో 19 శాతం పైగా ఉన్న ముస్లింలు ఈ 24 స్థానాల్లో గణనీయంగా ఉన్నారు. వారి ఓట్లు చీలకుండా ఉండాలన్న లక్ష్యంతోనే ఎస్పీ, కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయి. ఈ పార్టీల పొత్తుతో.. యూపీలో బీజేపీ గత ఎన్నికల్లో గెలిచిన 64 సీట్లను కూడా నిలబెట్టుకోలేకపోవచ్చునని రాజకీయవిశ్లేషకుల అంచనా.

ఆశ్చర్యంలో బీజేపీ నేతలు

ఢిల్లీ, హరియాణా, గుజరాత్, చండీగఢ్, గోవాల్లో కాంగ్రెస్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య సీట్ల పంపిణీ సజావుగా జరగడంపై బీజేపీ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జేడీయూ, ఆర్ఎల్డీ నిష్క్రమణతో ఇండియా కూటమి బీటలు వారిందని అనుకుంటే.. మళ్లీ పుంజుకోవటంతో వారు పునరాలోచనలో పడుతున్నారు. గత ఎన్నికల్లో గుజరాత్‌లో మొత్తం 26 సీట్లు, హర్యానాలో మొత్తం 10 సీట్లు, ఢిల్లీలో మొత్తం 7 సీట్లు దక్కించుకున్న బీజేపీకి.. కాంగ్రెస్, ఆప్ కలయిక వల్ల.. ఈ 43 సీట్లలో ఎదురు గాలి తప్పదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పంజాబ్‌లో విడివిడిగా పోటీ చేయాలని కాంగ్రెస్, ఆప్ నిర్ణయించడం వ్యూహాత్మకంగా జరిగిందని, దీని వల్ల తమకు నష్టం కలగదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక బిహార్‌లో నితీశ్ నిష్క్రమణతో ఇండియా కూటమి పక్షాలకు సీట్ల పంపిణీ మరింత సులువైంది. మొత్తం 40 సీట్లలో ఆర్జేడీ 28, కాంగ్రెస్, వామపక్షాలు చెరో 6 సీట్ల చొప్పున పోటీ చేస్తాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత ఎన్నికల్లో బిహార్‌లో 39 సీట్లు గెలుచుకున్న ఎన్డీఏకు ఈసారి 10-15 సీట్ల వరకు నష్టం జరగవచ్చని, వాటిని తమ కూటమి కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కేరళలో వామపక్ష ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మధ్యే పోరు కేంద్రీకృతం కానుంది. అక్కడ బీజేపీ నామమాత్రంగానే ఉంది. మొత్తం 20 సీట్లలో కాంగ్రెస్ 16 సీట్లకు పోటీ చేస్తుందని, మిగతా నాలుగు సీట్లు కేరళ కాంగ్రెస్, ఐయూఎంఎల్, ఆర్ఎస్పీలకు కేటాయిస్తుందని సమాచారం. తమిళనాడులోని 38 సీట్లలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి. వీసీకే, మనితనీయ మక్కలి కచ్చి, కమల్‌హాసన్ నేతృత్వంలోని మక్కల్‌నీది మయ్యం పార్టీలకు కూడా సీట్లు కేటాయించాల్సి ఉన్నందున గతంలో 9 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ ఈసారి ఒకటి రెండు సీట్లు త్యాగం చేయాల్సి ఉంటుందని డీఎంకే వర్గాలు కోరాయి. ఈ విధంగా ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లు, మహారాష్ట్ర-48, బిహార్-40, పశ్చిమబెంగాల్-42, తమిళనాడు-39, గుజరాత్-26, కేరళ-20, జార్ఖండ్-14, అస్సాం-14, పంజాబ్-13, హరియాణా-10, ఢిల్లీ-7, గోవా-2, మేఘాలయ-2, చండీగఢ్-1.. మొత్తం 358 సీట్లలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య పొత్తులపై క్రమంగా స్పష్టత వస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఇండియా కూటమి పక్షాలు సీట్ల పంపకాల దిశగా అడుగులు వేస్తుండగా.. ఎన్డీఏ పార్టీల మధ్య పొత్తులు ఒక కొలిక్కి రావల్సి ఉంది.


జోడో న్యాయ్ యాత్రలో రాహుల్, ప్రియాంక

చైనా వస్తువులతో
చిన్న పరిశ్రమలు కుదేలు

- భారత్ జోడో న్యాయ యాత్రలో రాహుల్
- అలీగఢ్‌లో యాత్రకు హాజరైన అఖిలేశ్

అలీగఢ్, ఫిబ్రవరి 25: చైనా వస్తువులు వరదలా వచ్చి పడుతుండడంతో స్వదేశీ, చిన్న, కుటీర పరిశ్రమలు కుదేలు అవుతున్నాయని, వృత్తిదారులు ఉపాధి కోల్పోయి నానా కష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్న ఆయన ఆదివారం మొరాదాబాద్ నుంచి సంభల్ మీదుగా అలీగఢ్‌కు చేరుకున్నారు. రాహుల్ యాత్రలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్‌కు కాంగ్రెస్, ఎస్పీ కార్యకర్తలు, మద్దతుదారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. వారిని ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. తాళాల పరిశ్రమకు అలీగఢ్ ప్రసిద్ధి చెందిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ చైనా నుంచి చౌక ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ముంచెత్తుతూ ఇలాంటి పరిశ్రమలను దెబ్బ తీస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక మాట్లాడుతూ సైన్యంలో చేరాలని కలలు కన్న యువత కలలను మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం భగ్నం చేసిందని విమర్శించారు. ఈ 'అన్యాయ కాలం'లో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సంక్షోభంగా ఉందన్నారు. అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తున్నారని, వారి శక్తి నుంచి కేంద్రం భయపడుతోందన్నారు. ఇండియా కూటమి బీజేపీని గద్దె దింపుతుందని వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


ఎస్ఆర్ఆర్ కళాశాలలో తమ నెంబర్లను చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు


చెరో లైనులో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న స్త్రీ, పురుష అభ్యర్థులు

నగరంలోని పలుచోట్ల నిర్వహించిన గ్రూప్ -2 స్క్రీనింగ్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన అభ్యర్థులతో ఆయా కళాశాలలు కిక్కిరిసిపోయాయి. అభ్యర్థులను గేటువద్ద స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి లోపలికి పంపించారు.


ఎస్ఆర్ఆర్ కాలేజీలో భద్రపరిచిన అభ్యర్థుల సెల్‌ఫోన్లు


స్టెల్లా కాలేజీ వద్ద బయటికి వస్తున్న అభ్యర్థులు


ఎస్ఆర్ఆర్ కాలేజీ వద్ద బయట ఉన్న ఫుట్‌పాత్‌పై వేచి ఉన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులు


కానూరులోని సిద్దార్థ న్యాయ కళాశాల వద్ద రీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

టీడీపీ, జనసేన విజయానికి సహకరించండి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా విజ్ఞప్తి

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 25: రాష్ట్రాభివృద్ధి కాంక్షించే అన్ని సామాజిక వర్గాలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని టీడీపీ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు కోరారు. సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వైసీపీని గద్దె దించేందుకు, టీడీపీ, జనసేన కూటమికి మద్దతుగా నిలవాలని కాపు సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నవరంగ్ థియేటర్ సమీపంలో అమరావతి కాపునాడు రాష్ట్ర నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తుకు కారణం అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని రక్షించడానికేనన్నారు. రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు వ్యక్తిగత స్వార్థం లేదని, నీతి, నిజాయితీలకు మారుపేరన్నారు. అమరావతి కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు (కబాడీ శ్రీను) మాట్లాడుతూ రంగా ఆశయాల కోసం నిరంతరం శ్రమించే బొండా ఉమా లాంటి వ్యక్తిని అసెంబ్లీకి పంపితే రంగా ఆశయాలు సాధించవచ్చన్నారు. ఇతర సామాజిక వర్గాలను కలుపుకుని టీడీపీ, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఐక్య కాపునాడు అధ్యక్షుడు బేతు రామమోహనరావు, కాపు సంఘాల నేతలు పిళ్లా శ్రీదేవి, అడపా ప్రతాప్ చందు, ఆళ్లమళ్ల సుబ్రహ్మణ్యం, చలమలశెట్టి కోటేశ్వరరావు, ముత్యాల రమేష్, జయ, ఎంఎస్ స్వామి, మామిడి సత్యం, ఒగ్గు రాంబాబు, బీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన బ్రాహ్మణులను ఉద్దేశించి మాట్లాడుతున్న బొండా ఉమామహేశ్వరరావు

బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యం

సత్యనారాయణపురం: వైసీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. రామకృష్ణాపురంలో పురోహిత సంఘం ఉపాధ్యక్షుడు వీరుభొట్ల అరుణ్‌కుమార్, టీడీపీ బ్రాహ్మణ సాధికర సమితి రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 200 మంది బ్రాహ్మణులు బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులకు అండగా ఉంది టీడీపీనేనన్నారు. వైసీపీ హయాంలో బ్రాహ్మణులకు ఒరిగిందేమి లేదన్నారు. పెద్దసంఖ్యలో బ్రాహ్మణులు టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా రూ.350 కోట్లు న్యాయం చేసిందన్నారు.సెంట్రల్‌లో 15,000 మందికి కార్పొరేషన్ ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, గార్లపాటి విజయకుమార్ రాచకొండ సుబ్రహ్మణ్యశర్మ, హరిగోపాలకృష్ణ, రాంపల్లి వెంకట మారుతీ, రామశర్మ, కుప్పుతేజ జనసేన నేతలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో బీసీలకు అవమానం

వన్‌టౌన్: టీడీపీ హయాంలో బీసీలకు స్వర్ణయుగంలా నడిచిందని, వైసీపీ హయాంలో అవమానాలు తప్ప మిగిలిందేది లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బీసీల అభ్యున్నతికి నాగవంశ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ఎరుబోతు రమణారావు ఆధ్వర్యంలో ఆదివారం ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్లకు రూపాయి విడుదల చేయలేదని అంతా జగన్ భజనమయమైందని విమర్శించారు. బీసీల హక్కులను కాపాడడంలో టీడీపీ ముందుందని, ఎన్టీఆర్ హయాం నుంచే బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. జగన్ హయాంలో బీసీ మంత్రులు నామమాత్రమేనన్నారు. బీసీలను అవమానించడం తప్ప ఇప్పటి ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. ఎరుబోతు రమణరావు మాట్లాడుతూ, బీసీ-డీ నుంచి బీసీ-ఏకి మార్పుకోసం తాను ఎంత దూరమైనా వెళతానన్నారు. నాగవంశ జాతి ప్రజలకు మేలు జరిగేందుకు ఇది మంచి అవకాశమన్నారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన సీనియర్ నేత ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులు లేకపోవడంతో నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. నాగవంశ సామాజిక వర్గానికి న్యాయం జరగడం కోసం తలపెట్టిన ధర్నాకు పూర్తి మద్దతు ఉందన్నారు. కే నాగుల్ మీరా, వీరంకి గురుమూర్తి, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న బొండా ఉమా

వెలంపల్లి, రుహుల్లా ముస్లింలకు క్షమాపణలు చెప్పాలి

● ఖబరిస్తాన్‌ను పరిశీలించిన బొండా ఉమా

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 25: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఖబరిస్తాన్‌ను మనుషులతో కాకుండా పెద్ద బుల్డోజర్లతో పెద్దల సమాధులను కూల్చడం హేయమైన చర్యని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబే కాలనీ రోడ్డులోని ముస్లిం ఖబరిస్తాన్‌ను వైసీపీ నేతలు ఎక్కకవేటర్లు, ట్రోజర్లతో పగలగొట్టి నేలమట్టం చేస్తున్నారని తమ మనోభావాలు దెబ్బతిన్నాయని స్థానిక ముస్లిం, టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఆ ప్రాంతాన్ని స్థానిక ముస్లిం నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సంప్రదాయం ప్రకారం షబేభారాత్ పెద్దల పండుగను పురస్కరించుకొని కుటుంబంలో చనిపోయిన పెద్దలను స్మరించుకొని మసీదులో ప్రార్థనలు చేసిన అనంతరం పెద్ద సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా దువా చేస్తారన్నారు. వైసీపీ నేతలు ఖబరిస్తాన్ అభివృద్ధి పేరుతో పెద్దల సమాధులను బరియల్ గ్రౌండ్‌లో నేలమట్టం చేయడం చూసి కన్నీరు మున్నీరవుతున్నారని ధ్వజమెత్తారు. తమ పూర్వీకులు, పెద్దల సమాధులు ఎక్కడున్నాయో ఆనవాలు కూడా లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులకు ఏం సమాధానం చెబుతారన్నారు. ఎవరైతే ఈ ఘటనలకు పాల్పడ్డారో వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారని, అధికారంలో ఉన్నామని సంప్రదాయాలను, మనోభావాలను కించపరిచేలా ఇలాంటి పనికిమాలిన చేష్టలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బరియల్ గ్రౌండ్ అభివృద్ధి పరిచేటప్పుడు ముస్లిం మతగురువులను కానీ ముస్లిం పెద్దలనుగాని సంప్రదించారా, వారి మనోభావాలు దెబ్బతినకుండా ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో సంప్రదాయాలను మంటగలిపితే ఉపేక్షించేది లేదన్నారు. ముస్లిం సమాజానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా క్షమాపణలు చెప్పి యథాతథంగా సమాధులను ఉంచాలన్నారు. లేకుంటే తదనంతర పరిణామాలకు వారే బాధ్యులవుతారని, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సెంట్రల్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా, షేక్ గౌస్ బాషా, జాన్ వలి, బాజి, మొతుకూరి ఖసీం, సలిమ్, గౌస్ సుభాని, మస్తాన్ పాల్గొన్నారు.


ఖబరిస్తాన్‌ను పరిశీలిస్తున్న బొండా ఉమా

నేటి యువతకు మాస్టర్స్ అథ్లెట్లు స్ఫూర్తి

విజయవాడ స్పోర్ట్సు ఫిబ్రవరి 25: లేటు వయసులోనూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలతో సత్తా చాటుతున్న మాస్టర్స్ అథ్లెట్లు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఏపీ జెన్‌కో ఏఎస్‌వో బి.మెహర్‌బాబు, ప్రాఫిట్ షామార్ట్స కంపెనీ ఎండీ బి.కోటేశ్వరరావు కితాబిచ్చారు. మహారాష్ట్రలోని పూణే ఛత్రపతి స్టేడియంలో ఇటీవల జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన ఉమ్మడి కృష్ణా అథ్లెట్లు ఏడుగురిని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కంది గంగాధరరావు, జీవీ ప్రసాదరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా దుశ్శాలువాలు, మెమెంటోలతో స్థానిక ఐజీఎంసీలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం సత్కరించారు. సీహెచ్.రామస్వామి, బి.జోజి, ఏవీ సుబ్బలక్ష్మి, కే.గీతాంజలి కే.రణధీర్ కుమార్, రోశయ్య ఎస్.ఆంజనేయకుమార్ మొత్తం 10 పతకాలను సాధించారు. భవిష్యత్తులోనూ మరిన్ని పతకాలను సాధించాలని ముఖ్య అతిథులు ఆకాంక్షించారు.

సాహితీ 'జీవీ' పూర్ణచందు



డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన 'సొంపైన తెలుగు-అరుదైన మాటల సంచికట్టు' గ్రంథావిష్కరణ చేస్తున్న మాజీ ఉపసభాపతి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త జీవీ పూర్ణచందు సాహితీ పరిపూర్ణుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన 50 ఏళ్లుగా సాహిత్య ప్రయాణం చేస్తున్నారన్నారు. నగరంలోని ఠాగూర్ గ్రంథాలయంలో పూర్ణచందు రాసిన 143వ రచన 'సొంపైన తెలుగు-అరుదైన మాటల సంచికట్టు' గ్రంథావిష్కరణ ఆదివారం రాత్రి జరిగింది. ఇదే వేదిక పూర్ణచందు సాహితీ స్వర్ణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఆయన సాహితీ రచనలతోపాటు ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన పుస్తకాలను, వివిధ పత్రికలకు శీర్షికలను రాశారన్నారు. తెలుగు భాష, సంస్కృతీ మూలాలను తవ్వితీసిన పరిశోధకుడిగా, తెలుగువారి ఆహార చరిత్ర నిర్మాతగా పూర్ణచందు బహుముఖ పాత్ర పోషించారన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఐదుసార్లు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించారని కొనియాడారు. మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ 'సొంపైన తెలుగు-అరుదైన మాటల సంచికట్టు' పుస్తకాన్ని ఆవిష్కరించి పూర్ణచందును ఘనంగా సత్కరించారు. గుత్తికొండ సుబ్బారావు, గుమ్మా సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, దండమూడి సుమతీ రామ్మోహన్, జమలపూర్ణమ్మ, సిలికానాంధ్ర వర్సిటీ ఆచార్యుడు శ్రీనివాస్, విజయభాస్కర్ పాల్గొన్నారు.



సీఎం కొత్త బస్సులొచ్చాయ్!



● ఆంధ్రజ్యోతికి చిక్కిన దృశ్యాలు ● మూడు ఐషర్ నాన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో రెండు రాక! ● పొడవైన ఓల్వో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కూడా డెలివరీకి రెడీ ● గోప్యంగా ఉంచుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కోసం సమకూర్చిన 'మీటింగ్ బస్సులు' నగరానికి వచ్చాయి. ఐషర్ కంపెనీకి సంబంధించి మొత్తం మూడు బస్సుల్లో రెండు నగరానికి చేరుకున్నాయి. ఈ రెండూ నాన్ బుల్లెట్ ప్రూఫ్ మినీ బస్సులు. ఈ బస్సుల్లో అంతర్గతంగా మీటింగ్ హాల్ ఉంటుంది. సోఫాలు వేసి ఉన్నాయి. టాయ్‌లెట్స్, బయట పరిస్థితులు తెలుసుకునేందుకు డిస్‌ప్లే సిస్టమ్ ఉన్నాయి. బయట అమర్చిన సీసీ కెమెరాల ద్వారా లోపలున్న డిస్‌ప్లే యూనిట్ ద్వారా వీటిని వీక్షించవచ్చు. ఈ బస్సులెక్కి ప్రచారం చేయటానికి వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేశారు. నాలుగు వైపులా మైకులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో, సీఎం జగన్ ఈ బస్సులను ఆర్టీసీ నుంచి అద్దెకు తీసుకోనున్నట్టు సమాచారం. గ్రామాల్లో తిరిగేందుకు ఈ బస్సులను జగన్ ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా నియోజకవర్గాల్లో తిరిగే సందర్భంలో నేతలతో సమావేశాలు కావటానికి వీలుగానే ఈ బస్సుల్లో ఇన్నర్ డిజైన్ చేయించినట్టుగా తెలుస్తోంది. ఈ మూడు బస్సులను భద్రతా కారణాల రీత్యా మార్చి, మార్చి ఉపయోగిస్తారని తెలుస్తోంది. వీటికంటే పొడవైన అత్యంత విలాసవంతమైన, దుర్భేద్యమైన ఓల్వో కంపెనీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఇంకా రాలేదు. ఈ బస్సులు డెలివరీకి సిద్ధమయ్యాయి. ఈ బస్సులను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే చేయించినట్టు తెలుస్తోంది. ఓల్వో కంపెనీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ బస్సులో హాల్, మీటింగ్ హాల్, కిచెన్, బెడ్‌రూమ్, టాయ్‌లెట్స్, కమ్యునికేషన్స్ తదితర వ్యవస్థలను ఏర్పాటు చేయించినట్టు తెలుస్తోంది. ఈ బస్సులను ఢిల్లీ పెద్దలకు బహూకరిస్తారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, వీటిని ఎవరికిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. సీఎం అవసరాల కోసం ఇప్పటికే రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులున్నాయి. ఇటీవలే ఆ బస్సులను రూ.1.50కోట్ల వ్యయంతో మెయింటెనెన్స్ పనులు చేయించారు. ఇది ముఖ్యమంత్రే ఉపయోగిస్తే రాబోయే ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో తరిగేటపుడు ఉపయోగిస్తారని తెలుస్తోంది. దాదాపుగా రూ.40కోట్ల వ్యయంతో ఐదు ఖరీదైన బస్సుల కొనుగోలుకు సంబంధించిన విషయాలను ఆర్టీసీ అధికారులు అత్యంత రహస్యంగా ఉంచటం గమనార్హం.



ఎమ్మెల్యే గద్దెకు బుద్దా సత్కారం

వన్‌టౌన్ ఫిబ్రవరి 25: తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మొదటి జాబితాలోనే చాన్స్ పొందిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న ఘనంగా సత్కరించారు. ఆదివారం వన్‌టౌన్‌లోని బుద్దా నివాసంలో ఆయన్ను గద్దె రామ్మోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న టికెట్ పొందిన రామ్మోహన్‌కు దుశ్శాలువ కప్పి, అభినందించారు. ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించారు.

రవాణాశాఖ సాంకేతిక విభాగం

అధికారుల సంఘం నూతన కమిటీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 25: రవాణాశాఖ సాంకేతిక విభాగం అధికారుల సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం బెంజిసర్కిల్ వద్ద ఒక హోటల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో కమిటీకి ఎన్నికలు జరిగాయి. సంఘం రాష్ట్ర కార్యవర్గంలో 27 పదవులకు గాను 26 పదవులు ఏకగ్రీవం కాగా ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో 56 ఓట్ల ఆధిక్యతతో ఆర్ ప్రవీణ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గెలిచారు. అధ్యక్షుడిగా టి.దుర్గాప్రసాదరెడ్డి,సహాధ్యక్షులుగా వై పూర్ణచంద్రరావు, వై ప్రసాద్, టీఎన్ సుబ్బారావు, జి.సత్యంనాయుడు, ఉపాధ్యక్షులుగా జి తిమ్మరుసు నాయుడు, జి భాస్కరరావు, జి నాగమురళి, ఆర్ సుధీర్, కార్యనిర్వాహక కార్యదర్శితోపాటు ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారిగా సీహెచ్ రాంబాబు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా ఎన్‌జీవో జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్, సహాయ ఎన్నికల అధికారిగా పీ రాజశేఖర్ వ్యవహరించారు. మూడేళ్లపాటు కమిటీ పదవీకాలం ఉంటుంది. ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, కార్యదర్శి కె శివారెడ్డి, కోశాధికారి రంగారావు కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నాకూ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి: బొమ్మసాని

గొల్లపూడి, ఫిబ్రవరి 25: టీడీపీకి కట్టుబడి పనిచేశా. పార్టీ కోసం 35రోజులు రాజమండ్రి జైల్లో ఉన్నా. పారీ నియమాలను ఎన్నడూ దాటలేదు. నాకు 55 ఏళ్లు వచ్చాయి. ఒక్కసారి ఎమ్మెల్యేగా పార్టీ అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేసుకుంటానని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు అధినేత చంద్రబాబుకు విన్నవించుకున్నాడు. ఆదివారం ఆయన గొల్లపూడిలో తన కాంపౌండ్‌లో బొమ్మసానికి మైలవరం టికెట్ ఇవ్వాలని సభ నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు నేతలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక ఎమ్మెల్యే పార్టీ మారినంత మాత్రాన పార్టీకి ఏం ఉపయోగం ఉండదన్న విషయాన్ని పార్టీ అధిష్టానం గుర్తించాలన్నారు. తనకు ఎమ్మెల్యే సీటివ్వాలని పార్టీ అభిమానులు ఉత్తరాలు పంపాలని బొమ్మసాని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు.


గొల్లపూడిలో మాట్లాడుతున్న బొమ్మసాని సుబ్బారావు



అలరించిన శివలీలా వైభవం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శారద నృత్య కళాపీఠం బృందం ప్రదర్శించిన శివలీలా వైభవం నృత్యరూపకం ప్రేక్షకులను అలరించింది. హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం దృశ్యవేదిక సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలను నృత్యరూపకంతో ప్రారంభించారు. నాట్యాచార్య ఎ.సంతోష్ దర్శకత్వంలో ఈ రూపకం సాగింది. వి.సాహిత్ అను, కె.శాన్విశ్రీ, జె.ప్రజ్ఞ, ప్రవల్లిక, అమృతవర్షిణి, చిన్న, లిఖిత, రక్షితప్రియ, హిమబిందు, అనూష, జ్యోత్స్న, ప్రవల్లిక, బర్నశ్రీ, గాయత్రి ప్రధాన పాత్రల్లో నర్తించి, అభినయించి మెప్పించారు. కనకదుర్గా నృత్య మందిర్ బృందం ప్రదర్శించిన జానపద నృత్యాలు మైమరపించాయి. యల్లాజోస్యుల అనురాధ నృత్య దర్శకత్వంలో రిషిక్, సహస్ర, భూమిక, భవన, జానకి, మల్లిక, భార్గవి, హర్షిత, సన్నిధి, కావ్య నృత్యాలు ప్రదర్శించారు. భారతీయనృత్యంపై మాజేటి సురేంద్రనాథ్, గుమ్మా సాంబశివరావు ప్రసంగించారు.

సౌరశక్తి అమోఘమైన శక్తి: ఫణిచంద్ర

పటమట, ఫిబ్రవరి 25: సౌరశక్తి అమోఘమైన శక్తి అని ఏపీ ఎనర్జీ కమిటీ వైస్ చైర్మన్ బి.ఫణిచంద్ర తెలిపారు. కోనేరు నరేంద్ర బాబు అధ్యక్షతన వాసవ్య మిత్రమండలి సమావేశ మందిరంలో ఆదివారం సమభావనా మిత్రమండలి 97వ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర ఎనర్జీ కమిటీ వైస్ చైర్మన్ టి.ఫణిచంద్ర మాట్లాడుతూ కొండలపైన ఇళ్లపైన, నదులపైన ప్రత్యేకమైన పరికరాలు అమర్చి సౌరశక్తిని ఉత్పత్తి చేయవచ్చునన్నారు. ప్రస్తుతం 42శాతంపైగా సౌరశక్తి వినియోగంలో ఉందని, 2030 నాటికి 500 కిలోవాట్ల సౌరశక్తిని వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. వ్యాపార సంస్థలు సౌరశక్తిని ఏర్పాటు చేసుకుంటే 3ఏళ్ల వరకు 60శాతం పన్ను మినహాయింపు ఉంటుందన్నారు. సౌరశక్తి మీద జీఎస్టీ తగ్గించాల్సి ఉందని, తద్వారా సౌరశక్తి మరింత వినియోగంలోకి వస్తుందన్నారు. సౌరశక్తి వినియోగదారులందరికీ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. సభికులు ప్రశ్నలకు ఫణిచంద్ర తగురీతిలో సమాధానాలు ఇచ్చారు. అనంతరం సమభావనా మిత్రమండలి సభ్యులు ఫణిచంద్ర దంపతులను సత్కరించారు. టి.శోభనాద్రీ, వై.రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సిహెచ్. వెంకటరెడ్డి, డాక్టర్ ఎంవి.రావు, కొండపల్లి మాధవరావు, గోళ్ల నారాయణరావు, కె.భీమేశ్వరరావు, కె.భాస్కరరావు, డాక్టర్ జంధ్యాల శంకర్, పిఆర్‌కె.ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల

పెన్షన్ అప్‌డేట్ ప్రక్రియ చేపట్టాలి

ఆలిండియా బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైన్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 25: విశ్రాంతి బ్యాంకు ఉద్యోగులు చాలీచాలని పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెన్షన్ అప్‌డేట్ ప్రక్రియ కోసం అనేక ఏళ్లుగా కేంద్రప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నా, విజయం సాధించలేకపోయామని, పెన్షన్ అప్‌డేట్ ప్రక్రియ చేపట్టడం ద్వారా పెన్షన్ సమస్యను పరిష్కరించాలని ఆలిండియా బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ జైన్ డిమాండ్ చేశారు. ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ 3వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైన్ ప్రసంగిస్తూ విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ దశాబ్దాలు గడిచినా పెరుగుదల లేదని, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి, ఎంపీలకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం కనబడలేదన్నారు. ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎస్ రెడ్డి, సంయుక్త ప్రధాన కార్యదర్శి కె. విశ్వనాథ్ నాయక్, ఫెడరేషన్ ఏపీ అధ్యక్షుడు బీవీ కొండలరావు, ప్రధాన కార్యదర్శి, ఎల్లారావు, ఛైర్మన్ ఎంటీ శంకర్రావు, ఉపాధ్యక్షుడు ఎఎస్‌రావు, నేతలు వి.జగన్‌మోహనరావు, ఎస్ కృష్ణమోహన్, పి.వీరారెడ్డి ప్రసంగించారు.

ఏపీ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక..

సమావేశంలో ఫెడరేషన్ ఏపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎంటీ శంకరరావు, అధ్యక్షుడిగా బీవీవీ కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా ఏ ఎల్లారావు, కోశాధికారిగా నరేంద్రదేవ్, సహాయ కోశాధికారిగా ఎస్ కృష్ణమోహన్, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా వి.జగన్మోహనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎంవీఎస్ శర్మ, పి. నారాయణరావు, జి. కృష్ణవేణితో పాటు 33 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్యారమ్స్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 25: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెటరన్ క్యారమ్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 24మంది పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల వెటరన్ సింగిల్స్ విజేతగా ఎం.రత్నరాజు నిలవగా రన్నరప్‌ను కె.సృజన్ కుమార్ వశం చేసుకున్నారు. మహిళల వెటరన్ సింగిల్స్ విజేతగా ఎస్.నిర్మల, రన్నరప్‌గా స్వప్నరాణి నిలిచారు. వీరికి ట్రోఫీలను రైల్వేస్ వెటరన్ పురుషుల క్రీడాకారుడు, ఏపీవో కె.శ్రీనివాసరావు అందించారు. జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జె.మురళీకృష్ణ, చీఫ్ రిఫరీ ఎస్‌కే అబ్బంతుల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడికి బెదిరింపు కాల్స్

▸ పోలీసులకు ఫిర్యాదు చేసిన రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ(విశాఖ సిటీ), ఫిబ్రవరి 25: విశాఖ పట్నం తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబుకు పలు నంబర్ల నుంచి వరుసగా బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో ఆయన ఆదివారం ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... శని వారం రాత్రి 8.30 గంటల నుంచి 11 గంటల మధ్య 65138 19922, 89819 11614, 73865 19973 నంబర్ల నుంచి రంజన్ అనే పేరుతో వెలగపూడికి బెది రింపు కాల్స్ వచ్చాయి. నానా దుర్భాషలాడుతూ, చంపుతామని బెదిరించారు. తనకు తగిన రక్షణ కల్పించి, ఫోన్‌చేసి బెదిరించిన వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వెలగపూడి తన ఫిర్యాదులో కోరారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

వైసీపీకి మైండ్ బ్లాంక్: నాగుల్ మీరా

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన కూటమి ఉమ్మడిగా 99 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగానే వైసీపీకి దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అయిందని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. వైసీపీ నాయ కుల మాటల్లోనే వారి ఓటమి తెలిసిపోతుందని, వైనాట్ 175 అన్న జగన్‌కు టీడీపీ-జనసేన అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో భయం పట్టుకుందని ఆయన అన్నారు. ఆదివారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాబు-పవన్ కలయికతో వైసీపీ ఉనికి కోల్పోయే ప్రమాదమున్నందునే ఆ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నా రని ధ్వజమెత్తారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో ఆయనే ప్రకటిస్తారని, దానిపై వైసీపీ నాయకులకు ఎందుకంత ఆసక్తి అని నాగుల్ మీరా నిలదీశారు. జగన్ 77 మంది అభ్యర్థులను ప్రకటించడానికి నానా యాతనలు పడ్డారని, టీడీపీ-జనసేన కూటమి 99 మందిని ఒకేసారి ప్రకటించడం సంచలనాత్మకని అన్నారు.

ఏఎన్‌ఎంలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయండి

▸ ఏపీ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం డిమాండ్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయి విధులు నిర్వహించే సిబ్బందికి బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.ఆస్కారరావు కోరారు. సంఘం కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం విజయవాడలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఏఎ న్‌ఎంలకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందికి యాప్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. జీవో 143, జీవో 32 ద్వారా వైద్య, ఆరోగ్యశాఖలో సిబ్బందిని సర్దుబాటు చేశారని, వారికి జీతాలు మాత్రం విడుదల చేయడం లేదన్నారు. తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సచివాలయ ఏఎన్‌ఎం గ్రేడ్-3లు కేవలం వైద్య ఆరోగ్యశాఖకు చెందిన విధులనే నిర్వర్తించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నప్పటికీ పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల్లో వారికి పనులు కేటాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాలపై సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమస్యలన్నీ ఆర్థికేతర అంశాలే అయినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావే శంలో 28 డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని ఆస్కారరావు కోరారు.

క్యాన్సర్ చికిత్సలో భారతీయ మసాలాలు

▸ పేటెంట్ పొందిన ఐఐటీ మద్రాస్ పరిశోధకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: క్యాన్సర్ చికిత్సలో భారతీయ మసాలాల వాడకానికి గానూ ఐఐటీ మద్రాస్ పరిశోధకులు పేటెంట్ హక్కులు పొందారు. 2028 నాటికి ఈ మందులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వెల్లడించారు. భారతీయ మసాలా దినుసుల్లోని నానోమెడిసిన్లు ఊపిరితిత్తులు, రొమ్ము, పెద్దపేగు, గర్భాశయ, నోటి, థైరాయిడ్ కణాలకు వ్యతి రేకంగా కేన్సర్ నిరోధక చర్యను చూపించాయని, సాధారణ కణాలపై మాత్రం ఎలాంటి ప్రభావం చూపించకుండా వాటిని సురక్షితంగా ఉంచాయని పేర్కొ న్నారు. జంతువులపై చేసిన అధ్యయనాలు ఇటీవల విజయవంతంగా ముగిశా యని, 2027-28 నాటికి ఈ మందులను మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసు కొచ్చే లక్ష్యంతో క్లినికల్ ట్రయల్స్ ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

డ్రైవర్ లేకుండానే 80 కిలోమీటర్లు నడిచిన గూడ్స్

▸ చివరకు ఇసుకబస్తాలతో అడ్డు.. తప్పిన పెను ప్రమాదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఆ మధ్య వచ్చిన హాలీవుడ్ సినిమా 'అన్‌స్టాపబుల్' తరహాలో ఓ గూడ్స్ రైలు అందరినీ భయపెట్టేసింది. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ లేకుండా ఏకంగా దాదాపు 80 కిలో మీటర్లు దూసుకెళ్లింది. జమ్ము కశ్మీర్‌లోని కథువా నుంచి పంజాబ్‌లోని హోశియార్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామం వరకు ప్రయాణించింది. ఆదివారం ఉదయం 7:25 నుంచి 9 గంటల మధ్య ఈ సంఘటన జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చిప్ స్టోన్లను లోడ్ చేసిన ఈ గూడ్స్ జమ్ము నుంచి పంజాబ్‌కు బయల్దేరింది. డ్రైవర్ మార్పు కోసం కథువా రైల్వే స్టేషన్‌లో దీన్ని ఆపారు. లోకో పైలట్, అసి స్టెంట్ లోకో పైలట్ దిగిపోయాక వాలుగా ఉన్న ట్రాక్‌పై గూడ్స్ నెమ్మదిగా పరుగులు పెడుతూ వేగం పుంజుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే అధికా రులు ఆ మార్గంలో రాకపోకలు, రైలు-రోడ్డు క్రాసింగ్‌ల వద్ద భద్రతపై సిబ్బం దిని అప్రమత్తం చేశారు. చివరకు పంజాబ్‌లోని ఉంచి బస్సి రైల్వే స్టేషన్ సమీ పంలో అధికారులు ఇసుక బస్తాల సాయంతో గూడ్సును ఆపేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గత దశాబ్దకాలంలో తలసరి వ్యయం డబుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: దేశంలో నెలవారీ కుటుంబ తలసరి వ్యయం గత దశాబ్దకాలంలో రెండింతలకుపైగా పెరిగిందని తాజా అధ్యయనంలో వెల్ల డైంది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) 2022 ఆగస్టు నుంచి 2023 జూలై వరకు కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్)ను నిర్వహించింది. ఈ సర్వే వివరాలను శనివారం విడుదల చేయగా ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఇక దేశ ప్రజలు బియ్యం, గోధు మలు వంటి ఆహార పదార్థాలపై తక్కువగా.. ప్రాసెస్ చేసిన ఆహారం, టీవీలు, ఫ్రిడ్జ్‌లు వంటి ఉత్పత్తులపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్టు వెల్లడైంది. ఆహా రంపై గ్రామీణ వినియోగదారుల నెలవారీ ఖర్చు 2011-12లో 53% ఉండగా.. అది 46 శాతానికి తగ్గింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో 43% నుంచి 39 శాతా నికి తగ్గిపోయింది. గోధుమలు, బియ్యం, పప్పులు వంటి వాటిపై తక్కువగా.. పానీయాలు, ఫలహారాలు, ప్రాసెస్ చేసిన ఆహారంపై ఎక్కువగా ఖర్చు చేస్తు న్నారు. సర్వే ప్రకారం.. ప్రస్తుత ధరల వద్ద నెలవారీ కుటుంబ తలసరి వ్యయం (ఎంపీసీఈ) పట్టణప్రాంతాల్లో 2011-12లో రూ.2,630 ఉండగా.. 2022-23లో రూ.6,459కి పెరిగింది. అంటే రెండింతలకు పైగా పెరిగినట్టు లెక్క. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఇది ప్రస్తుత ధరల వద్ద రూ.1,430 నుంచి రూ.3,773కు దూసుకుపోయింది.

సందేశ్‌ఖాలీకి నిజనిర్ధారణ బృందం

▸ మాజీ సీజే జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలో స్వతంత్ర కమిటీ పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పశ్చిమ బెంగాల్‌లోని వివాదాస్పద సందేశ్‌ఖాలీ ప్రాంతానికి వెళ్తున్న నిజ నిర్ధారణ బృందాన్ని పోలీసులు అరెస్టు చేశారు. పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలోని స్వతంత్ర కమిటీకి చెందిన ఆరుగురు సభ్యులను కొద్దిసేపు అదుపులోకి తీసుకు న్నారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని భోజర్హాట్ ప్రాంతాన్ని దాటొద్దని తాము అభ్యర్థించామని, అయితే కమిటీ సభ్యులు చట్ట విరుద్ధంగా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని డిప్యూటీ కమిషనర్ (భంగర్ డివిజన్) సైకత్ ఘోష్ తెలిపారు. సందేశ్‌ఖాలీలోని కొన్ని ప్రాంతాల్లో అమలులో ఉన్న 144 సెక్షన్ కింద వారిని అరెస్టు చేయాల్సి వచ్చిందని చెప్పారు. మహిళలపై లైంగిక వేధింపులు, చేపల చెరువుల కోసం టీఎంసీ నేతలు భూ కబ్జాలు చేశారన్న ఆరోపణలతో సందేశ్‌ఖాలీకి 52 కిలోమీటర్ల దూరంలో ఉన్న భోజర్హాట్ వివాదానికి కేంద్రంగా మారింది. కమిటీ సభ్యులను పోలీసులు అరెస్టు చేసి కోల్‌కతాలోని పీహెచ్‌క్యూ లాల్ బజార్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. కాగా, పోలీసుల చర్యను కమిటీ తప్పుబ ట్టింది. తమను సీఆర్‌పీసీ 151 కింద అరెస్టు చేసినట్లు జస్టిస్ నరసింహారెడ్డి తెలిపారు. తాము ఏమీ చేయకపోయినా కూడా పోలీసులు అరెస్టు చేశారని, బెంగాల్‌లో మాత్రమే ఈ విధంగా జరుగుతుందని మండిపడ్డారు. బాధితులు తీవ్ర ఒత్తిడిలో ఉంటే నేరస్థులు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారని ఆరోపిం చారు. ఈ విషయాన్ని సీఎం మమతా బెనర్జీ, గవర్నర్ సీవీ ఆనంద బోస్‌కు వి వరిస్తామని, అవసరమైతే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి కూడా తీసుకువెళ్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, అరెస్టయిన టీఎంసీ నేత శిబప్రసాద్ హజ్రా కోళ్ల ఫారాలను తగులపెట్టిన ఆరోపణలపై ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ నాయకురాలు ఆయేషా బీబీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన స్థానికులను అదుపులోకి తీసుకున్నారు.

వైసీపీ డీలా!

- నేతలు, కార్యకర్తల ముఖాల్లో కనిపించని జోష్
- పరాజయం తప్పదని తేల్చేసిన సర్వేలు
- ఏడు జాబితాల్లో అసెంబ్లీకి 65 మంది పేర్లే
- 33 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు మొండిచేయి
- తొలి జాబితాలోనే 99 పేర్లతో ప్రతిపక్షాల హుషారు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు ముంగిట అధి కారపక్షం ఒక్కసారిగా డీలా పడిపో యింది. ఆ పార్టీ ముఖ్య నేతల నుంచి కార్యకర్తల దాకా ఎవరిలోనూ ఎన్నికల సంరంభమే కనిపించడం లేదు. వైసీపీ ఓటమి ఖాయమని ప్రజల్లో విస్తృత ప్రచారం జరుగుతుండడం, ఐ-ప్యాక్, సొంత సర్వేలూ అవే చెబుతుండడం.. వాటి సాకుతో 33 మంది సిటింగ్‌లకు సీఎం జగన్మోహన్‌రెడ్డి మొండిచేయి చూపడం.. వంటి పరిణామాలు నేతల్లో నిస్తేజానికి ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. అలాగే కొందరు ఎమ్మెల్యేలను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిచి.. ఈ దఫా మీరు ఓడిపోతున్నారు.. టికెట్లు ఇవ్వనని తేల్చేస్తు న్నారు. నోరున్నవాళ్లు నిలదీస్తున్నారు.. లేనివాళ్లు ఉసూ రుమంటూ బయటికొస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితి చూశాక టికెట్లు రాక పోవడమే మేలనుకుంటున్నవారూ ఉన్నారు. అటు నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గ డంతో.. ప్రచార పటాటోపం కోసం వైసీపీ పెద్దలు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదా రుల నుంచి ప్రధాన కూడళ్ల దాకా 'సిద్ధం' అంటూ జగన్ కటౌట్‌లు పెట్టుకుంటున్నా రని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. చాలా మంది సిటింగ్‌లలో టికెట్లు వస్తాయో రావోనన్న ఉత్కంఠే లేదు. టికెట్లు వచ్చిన వారూ సంతోషం వ్యక్తం చేయడం లేదు. టికెట్లు దక్కని వారిలో నిరాశానిస్పృహలు, ఆగ్రహావేశాలు అస్సలు లేవు. ఇక ప్రకటించిన జాబితాలో చోటు దక్కించుకున్న వారు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న దాఖ లాలూ పెద్దగా కనిపించడం లేదు. అభ్యర్థుల ప్రకట నకు ముందు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్ర మంతో కొద్ది మంది నేతలైనా ఊళ్లలో తిరిగేవారు. ఇప్పుడా కార్యక్రమం ముగిసిపోవడంతో .. కొత్త ఇన్‌చా ర్జులు గ్రామాల్లో ప్రచారానికి ఇంకా దిగలేదు. ఇప్పటి దాకా ఏడు జాబితాల్లో 65 మంది ఇన్‌చార్జుల పేర్లు ప్రకటించారు. దాదాపు సగం మంది ఎమ్మెల్యేలకు టికెట్ దక్కకపోయినా, నియోజకవర్గాల్లో వారి అనుచరులు ఆందోళనలు, నిరసనలకు దిగడం లేదు. ఓడిపోయి ఆర్థి కంగా చితికిపోవడం కంటే.. ఎన్నికల రేసుకు దూరంగా ఉంటే గౌరవమైనా నిలబడుతుందని పలువురు నాయ కులు అభిప్రాయపడుతున్నట్లు చెబుతున్నారు.

ఓటమి సంకేతాలు..?

నిరుడు డిసెంబరు 27వ తేదీన జగన్ 11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేశారు. ముగ్గురు మంత్రులు ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జున, విడ దల రజని సిటింగ్ స్థానాలను మార్చారు. సురేశ్‌ను ఎర్ర గొండపాలెం (ఎస్సీ) నుంచి కొండపి (ఎస్సీ) స్థానానికి.. నాగార్జునను వేమూరు (ఎస్సీ) నుంచి సంతనూతల పాడు (ఎస్సీ)కి.. రజనిని చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు బదిలీచేశారు. అలాగే మాజీ మంత్రి మేకతోటి సుచరితను ప్రత్తిపాడు (ఎస్సీ) నుంచి తాడికొండ (ఎస్సీ)కి బదలాయించారు. ప్రస్తుత స్థానా ల్లోనే పోటీచేస్తే ఓటమి తప్పదని సర్వేల్లో తేలడమే దీనికి కారణం. ఈ మార్పుల ద్వారా వారి ఓటమి ఖాయ మని ముఖ్యమంత్రే పరోక్షంగా సంకేతాలిచ్చారన్న అభి ప్రాయం వైసీపీ వర్గాల్లో వ్యక్తమైంది. 175 అసెంబ్లీ సీట్లు, 25 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటికి ఏడు జాబితాల్లో 65 మంది అసెంబ్లీ, 16 ఎంపీ సీట్లకు మాత్రమే ఇన్‌చా ర్జులను ఖరారుచేశారు. లోలోపల సిటింగ్‌లు అసంతృ ప్తిగా ఉండడం, కొందరు టీడీపీ వైపు చూస్తుండడంతో.. వారిని బుజ్జగించడానికి.. మళ్లీ సర్వేలు చేస్తున్నామని.. ఎమ్మెల్యేలకు అనుకూలంగా వస్తే వారికే తిరిగి టికెట్లు ఇస్తామని వైసీపీ పెద్దలు లీకులిచ్చారు. ఇది కొత్త ఇన్‌చా ర్జుల్లో అలజడి రేపుతోంది. దీంతో వారిలో చాలా మంది ప్రచారానికి ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ శనివారం తమ తొలి జాబితాలోనే 99 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించడం వైసీపీ నేతలను విస్మయానికి గురి చేయగా.. ఆయా పార్టీల కార్యకర్తల్లో కదనోత్సాహాన్ని నింపిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

తొలి ఓటు దేశానికే!

నవ యువ ఓటర్లకు ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: యువ ఓటర్లు తమ మొదటి ఓటును దేశం కోసం వేయాలని ప్రధాని మోదీ కోరారు. రికార్డు స్థాయిలో భారీగా తరలివచ్చి ఓటు హక్కు విని యోగించుకోవాలని పిలుపిచ్చారు. వచ్చే (18వ లోక్‌సభ) వారి ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఆదివారం ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' 110వ సంచికలో ఆయన ప్రసంగించారు. లోక్‌సభ ఎన్ని కల కోడ్ అమల్లోకి వస్తున్నందున వచ్చే 3 నెలల పాటు 'మన్ కీ బాత్'కు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. 111వ సంచికతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడిం చారు. ఈ ఎపిసోడ్‌లో యువత, నారీశక్తి గురించి ప్రత్యే కంగా ప్రస్తావించారు. 'అన్ని రంగాల్లో నారీశక్తి ముందుంది' అన్నారు. మహిళల కోసం తాము అమలు చేస్తున్న పథకాలను ప్రస్తావించారు. 'కోటి మంది లక్షాధి కారిణులను తయారుచేసే 'లఖ్‌పతీ దీదీ' పథకం అమలు చేస్తున్నాం. 'నమో డ్రోన్ దీదీ' స్కీం మన గ్రామాల్లో మహిళలను జీవితాలను మార్చేస్తోంది. ప్రకృతి సాగులో,జలసంరక్షణ, పారిశుద్ధ్యంలో మహిళలు తమ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారు' అని కొని యాడారు. మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం జరుపకోనున్న విషయాన్ని మోదీ ప్రస్తావించారు. ప్రభుత్వ కృషి కారణగా గడచిన కొన్నేళ్లలో పెద్దపులుల సంఖ్య పెరిగిందన్నారు. మాదకద్రవ్యాలకు యువత బాని సలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన మోదీ.. ఈ మహమ్మారిపై పోరాటానికి పటిష్ఠ కుటుంబాలు అవసర మన్నారు. కాగా, పశుసంవర్ధకం గురించి మాట్లాడితే జనం గోవులు, గేదెల పెంపకం గురించి మాత్రమే అను కుంటున్నారని.. కానీ మేకలు కూడా ముఖ్యమైనవని ప్రధాని పేర్కొన్నారు. ఒడిసాలోని కలహండి జిల్లా సాలె భటా గ్రామానికి చెందిన దంపతుల గురించి ప్రస్తావి స్తూ.. వారు సృష్టించిన 'గోట్ బ్యాంక్ (మణికస్తు మేకల బ్యాంకు)'ను కొనియాడారు.

సీమ స్టేషన్లకు మహర్దశ!

అమృత్ భారత్ పథకంలో 13 స్టేషన్ల ఎంపిక

- ▸ 127.67 కోట్లతో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- ▸ కడప రైల్వేస్టేషన్‌కు అత్యధికంగా 20.35 కోట్లు
- ▸ అన్నమయ్య జిల్లాలో సీటీఎం, రాజంపేట స్టేషన్‌ల ఎంపిక
- ▸ నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ



కలికిరి, ఫిబ్రవరి 25: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా ఆధునికీకరణ కోసం రాయలసీమలో 13 రైల్వేస్టేషన్లు ఎంపికయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమ వారం వాటికి వర్చువల్‌గా శంకుస్థాపన చేయను న్నారు. గతేడాది ఫిబ్రవరిలో కేంద్రం అమృత్ భారత్ పథకాన్ని ఆచరణలోకి తెచ్చింది. వందే భారత్ రైళ్లకు ఉన్నత స్థాయి వర్గాల నుంచి మంచి ఆదరణ లభిం చిన విషయం తెలిసిందే. ఇక ద్వితీయ శ్రేణి వర్గాలకు కూడా అందుబాటులో ఆధునిక వసతులతో కూడిన రైళ్లను నడపాలని అమృత్ భారత్ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. సాధారణ ప్రయాణీకుల కోసం ఆధు నిక వసతులతో రైళ్ల వేగాన్ని గరిష్ఠంగా పెంచడం, బోగీల్లో సాంకేతికత జోడించిన సదుపాయాలు, ప్రధా నంగా అమృత్ భారత్ స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చి దిద్ది కావలసిన వసతులను సమకూర్చడం అమృత్ భారత్ పథకం ప్రధాన ఉద్దేశాలు. వీటికి అనుగు ణంగా బోగీల్లో భద్రతా ప్రమాణాలను పెంచనున్నారు. ఇక రైల్వేస్టేషన్లలో సౌకర్యవంతమైన వెయిటింగ్ హాళ్లు, అందుబాటులో వైఫై సదుపాయం, ప్రయాణీలకులకు సౌకర్యవంతంగా ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజీలు, తాగునీటి కియోస్కీలు, పరిశుభ్రమైన ఆధు నిక మరుగుదొడ్లు తదితర వసతులను అమృత్ భార త్‌కు ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి చేయనున్నారు. ఇక అమృత్ భారత్ రైళ్లలో గరిష్ఠంగా 22 నాన్ ఏసీ కోచ్ లుంటాయి. ఈ రైళ్లన్నింటినీ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగానే పరిగ ణిస్తారు. అవసరమైన రూట్లలో డిమాండును బట్టి ఏసీ కోచ్‌లను జత చేస్తారు. సాధారణ కోచ్‌లలో కూర్చుని ప్రయాణం చేయడమే కాకుండా త్రీ టయర్ పడకలు కూడా వుంటాయి. గరిష్ఠంగా గంటకు 130 కి.మీ. వేగంతో ఇవి నడుస్తాయి. ఆధునిక సాంకేతిక తను అందిపుచ్చుకుని వందే భారత్ రైళ్లకు దీటుగా అమృత్ భారత్ రైళ్లు కూడా రాయలసీమలో పట్టాలె క్కనున్నాయి. అదే విధంగా ఈ రైళ్లకు అనువుగానే కొన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లను కూడా భారీ ఖర్చుతో ఆధునికీకరించనున్నారు.

రాయలసీమలో ఎంపికైన స్టేషన్లు

గతేడాది ఆగస్టులో రాష్ట్రానికి 18 అమృత్ రైల్వేస్టే షన్లు మంజూరు కాగా అందులో రాయలసీమకు రూ.42.60 కోట్లతో కేవలం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ఒక్కటే మంజూరైంది. తాజాగా రెండు రోజుల క్రితం రాష్ట్రానికి మొత్తం రూ.613.30 కోట్లతో 34 అమృత్ రైల్వే స్టేషన్లు మంజూరు కాగా అందులో రాయలసీ మకు రూ.127.67 కోట్లతో 13 స్టేషన్లు దక్కాయి. డోన్, ఆదోని, మంత్రాలయం, కర్నూలు, అనంతపురం, కదిరి, మదనపల్లె రోడ్డు (సీటీఎం), పాకాల మార్గంలో తిరు పతికి ఒక రూటు, అదే విధంగా కర్నూలు, కడప, రాజంపేట మార్గంలో మరో రూటు అమృత్ రైళ్లు నడ పడానికి మార్గం సుగమమైంది. ఆదోని రైల్వేస్టేషన్ ఆధునిక వసతులతో కూడిన పునర్వ్యవస్థీకరణకు (రూ.10.26 కోట్లు), అనంతపురం (రూ.9.29కోట్లు), చిత్తూరు (రూ.13.99 కోట్లు), ధర్మవరం (రూ.7.14 కోట్లు), డోన్ రూ.(8.64 కోట్లు), గుత్తి (రూ.10.81 కోట్లు), కడప (రూ.20.35 కోట్లు), సీటీఎం (రూ.8.01 కోట్లు), నంద్యాల (రూ.10.6 కోట్లు), మంత్రాలయం రూ.(3.58 కోట్లు), పాకాల (రూ.7.28 కోట్లు), రాజం పేట (రూ.5.93 కోట్లు), శ్రీకాళహస్తి (రూ.11.79 కోట్లు) స్టేషన్లు ఎంపికయ్యాయి.

ఎవరి కోసం కొత్త కాలేజీలు?

- ▸ డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు నోటిఫికేషన్
- ▸ ప్రస్తుతం ఏటా 2 లక్షల సీట్లు ఖాళీ
- ▸ విద్యార్థుల్లేక వెలవెలబోతున్న కాలేజీలు
- ▸ అయినా కొత్త కాలేజీల నిర్మాణానికి మొగ్గు?
- ▸ ఎన్నికల ముందు ప్రచారానికి ఎత్తుగడ
- ▸ ఏప్రిల్ చివరికి మంజూరుచేసేలా షెడ్యూలు
- ▸ కోర్టుకు వెళ్లాలని యాజమాన్యాల నిర్ణయం!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

> పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్న విద్యార్థు లను ఆపలేని జగన్ ప్రభుత్వం ఎన్ని కల ముందు కొత్త ఎత్తు వేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేస్తామంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రైవేటు కాలేజీలు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. అసలు రాష్ట్రంలో ఉన్న కాలేజీలే విద్యార్థుల్లేక దీన స్థితిలో ఉంటే ఇక కొత్త కాలేజీలు ఎందుకనేది ప్రశ్న.

రాష్ట్రంలో కొత్త కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే.. ఈ ఏర్పాటు వెనుక ఎన్నికల ఎత్తుగడ ఉందనే వాదన వినిపి స్తోంది. ఎందుకంటే, గత మూడేళ్లుగా ఏటా 2 లక్ష లకు పైగా డిగ్రీ సీట్లు రాష్ట్రంలో మిగిలిపోతున్నాయి. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన డిగ్రీ కాలేజీలు ఇప్పుడు పూర్తిగా వెలవెలబోయే స్థితికి చేరాయి. ఈ నేపథ్యంలో ఐదేళ్లపాటు మౌనం వహించిన జగన్ ప్రభుత్వం సరిగ్గా ఎన్నికలకు ముందు కొత్త కాలేజీల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేయడం వెనుక ఆంతర్యం ఏంటనే అనుమానాలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కాలేజీలు ఏర్పాటు చేస్తు న్నామని, అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నా మని ప్రచారం చేసుకునేందుకే ఇలా ఎన్నికల ఎత్తు వేశారనే వాదన వినిపిస్తోంది.

విద్యార్థుల్లేని కాలేజీలు

రాష్ట్రంలో 1,180 ప్రైవేటు, 165 ప్రభుత్వ, 51 ఎయి డెడ్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 3.60 లక్షల సీట్లు ఉన్నాయి. 2023-24లో కేవలం 1.65 లక్షల మంది విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల్లో చేరారు. 2022-23లో 1.4 లక్షల మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. అంటే ఏటా 2లక్షల సీట్లు మిగిలిపోతు న్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత ఎక్కువ మంది ఇంజ నీరింగ్ బాట పట్టడం దీనికి ప్రధాన కారణం. అదేవి ధంగా ఎంపీసీయేతర గ్రూపులు చదివిన వారు కూడా ప్రైవేటు యూనివర్సిటీలకు, ఇతర రాష్ట్రాల కాలేజీలకు వెళ్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్ మెంట్ చేయకపోవడం, హడావుడిగా సింగిల్ మేజర్ డిగ్రీ విధానం ప్రవేశపెట్టడం లాంటి చర్యలు డిగ్రీ అడ్మిషన్లు పడిపోవడానికి కారణంగా మారాయి. బ్యాచి లర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ) లాంటి కోర్సులు ఇంజనీరింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఉండ టంతో వాటి కోసమే కొందరు డిగ్రీ కోర్సుల్లో చేరుతు న్నారు. సాధారణ బీఏ, బీకాం కోర్సుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. మరోవైపు ఏటా రకరకాల కార ణాలతో ఉన్నత విద్యామండలి డిగ్రీ అడ్మిషన్లను జాప్యం చేయడం కూడా అడ్మిషన్లు తగ్గిపోవడానికి కారణమవుతోంది.

అన్ని జిల్లాల్లో కాలేజీలట!

గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఓ కమిటీని నియ మించి డిగ్రీ కాలేజీల అవసరంపై అధ్యయనం చేయించింది. 40 శాతం అడ్మిషన్లు లేని కాలేజీలు అవసరం లేదని, కొత్త కాలేజీల అవసరం తలెత్తదని ఆ కమిటీ సిఫారసు చేసింది. దీంతో అప్పటి ప్రభుత్వం ఆ ప్రక్రియను నిలిపివేసి, విద్యల నాణ్య తపై దృష్టి పెట్టింది. జగన్ ప్రభుత్వం కూడా ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఈ విషయాన్ని పట్టించుకో లేదు. కానీ, ఎన్నికల ముందు హఠాత్తుగా కొత్త కళా శాలల నిర్మాణానికి నోటిఫికేషన్ జారీ చేసింది. 26 జిల్లాల్లో కనీసం నాలుగైదు ప్రాంతాల్లో కాలేజీల అవ సరం ఉన్నట్లు అంచనా వేసింది. సీఎం సొంత జిల్లా కడపలోని బద్వేలు, కడప, జమ్మలమడుగు, ప్రొద్దు టూరు ప్రాంతాలను గుర్తించింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత జిల్లా విజయనగరం లోని బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, ఎస్.కోట, విజయనగరం, రాజాంలను కాలేజీల ఏర్పా టుకు గుర్తించింది. కొత్త కాలేజీ ఏర్పాటుకు మెట్రోపా లిటన్ నగరాల్లో 2 ఎకరాలు, ఇతర నగరాలు, ప్రాంతాల్లో 5 ఎకరాల స్థలం ఉండాలని నోటిఫికేష న్‌లో పేర్కొంది. 12 వేల చదరపు అడుగుల కార్పెట్ ఏరియా ఉండాలని, ప్రతి తరగతి గది 900 చదరపు అడుగుల్లో ఉండాలని స్పష్టం చేసింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన భవనాలుంటేనే అనుమతి ఉంటుందని, నిర్మాణంలో ఉంటే దరఖాస్తుకు అర్హులు కారని తెలిపింది.

మాకే లేకపోతే మళ్లీనా?

ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తుత డిగ్రీ కాలేజీల యాజ మాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే 1,180 ప్రైవేటు కాలేజీలున్నాయని, ఏ కాలేజీలోనూ 50శాతం అడ్మిషన్లు జరగడం లేదని, ఈ క్రమంలో కొత్త కాలేజీలు తీసుకురావడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికే 2 లక్షల సీట్లు ఖాళీగా ఉంటే, కొత్త కాలేజీల వల్ల ఆ సంఖ్య ఇంకా పెరుగుతుందని, అంతే తప్ప లాభం ఉండదని భావిస్తున్నాయి. పైగా, కొత్త కాలేజీల వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, కాలేజీలు మూతపడే పరి స్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేప థ్యంలో సర్కారు నోటిఫికేషన్‌పై హైకోర్టును ఆశ్రయిం చాలని యాజమాన్యాలు నిర్ణయించాయి.

ప్రియుడితో కలిసి భర్త హత్య

- ▸ గుండెపోటుగా చిత్రీకరించే యత్నం
- ▸ భార్య అరెస్టు, పరారీలో ప్రియుడు
- ▸ సూర్యాపేట లో ఘటన



మేళ్లచెర్వు, ఫిబ్రవరి 25: ప్రియుడితో ఏకాంతంగా ఉండ గా చూసిన భర్తను హత్య చేసి గుండె పోటుతో మృతి చెందినట్లు బంధు వులను నమ్మించింది. అం త్యక్రి యల సమయంలో మృతదేహంపై గాయాలను చూసిన బంధువులు భార్యను నిలదీయడంతో ఆమె బండారం బయటపడింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. మేళ్లచెర్వు ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరా ల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నేర్నకంటి వీరగోపయ్య(32)కు కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన వీరకుమారితో ఏడేళ్ల క్రితం వివాహమైం ది. వీరికి ఐదేళ్ల కుమార్తె వినీత, మూడేళ్ల కుమారుడు వినయ్‌కుమార్ ఉన్నారు. వీరకుమారికి గ్రామానికి చెందిన వార్డు మెంబరు భర్త ఎస్‌కే సైదాహుస్సే న్‌తో మూడేళ్ల క్రితం వివాహేతర సంబంధం ఏర్పడింది. కుటుంబసభ్యులు పలుమార్లు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. శనివారం వీరగోపయ్య ఓ వివాహానికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వీరకుమారి ప్రియుడు సైదాహుస్సేన్‌తో ఏకాంతంగా ఉంది. ఈ విషయం బయటకు తెలుస్తుందని ప్రియుడితో కలిసి భర్తపై దాడి చేసింది. వీరగోపయ్య కాళ్లను ప్రియుడు సైదా హుస్సేన్ పట్టుకోగా ముఖంపై దిండు అదిమి పట్టుకుని ఊపిరాడకుండా చేసి భర్తను హత్య చేసింది. భర్త గుండెపో టుతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడని బంధు వులను నమ్మించింది. ఆదివారం సాయంత్రం అంత్యక్రియల ఏర్పాట్లలో భాగంగా వీరగోపయ్య మృతదేహానికి స్నానం చేయించడానికి చొక్కాను తీయగా శరీరంపై గాయాలు కని పించాయి. అతడి బంధువులు వీరకుమారిపై దాడిచేసి నిల దీయడంతో ప్రియుడి సాయంతో భర్తను హత్య చేశానని అంగీకరించింది. వెంటనే పోలీసుల కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వీరకుమారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరగోపయ్య అక్కలు నాగలక్ష్మి, రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ తెలిపారు. ప్రియుడు పరారీలో ఉన్నాడని చెప్పారు.

'జగన్ విముక్త ఏపీ'నే జనసేన లక్ష్యం

- ▸ దానికోసమే పవన్ కల్యాణ్ పోరాటం
- ▸ దుష్టుడి పాలనను అంతం చేసేందుకు నసేనానితో కలసి అడుగులు వేయండి
- ▸ చెన్నై 'జనసేన టీం' ఆత్మీయ సమావేశంలో నేతలు



జ్యోతి వెలిగించి ఆత్మీయ సమావేశాన్ని ప్రారంభిస్తున్న జనసేన నేతలు

చెన్నై, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): "జగన్ విముక్త ఏపీ కోసమే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోరాటం చేస్తున్నారు. ప్రజానీకమంతా ఆయన వెంట నిలబడా లి" అని జనసేన పార్టీ సీనియర్ నేతలు పిలుపు నిచ్చారు. జనసేన చెన్నై విభాగం ఆత్మీయ సమావేశం ఆదివారం చెన్నై టి.నగర్‌లో జరిగింది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, ఆ పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము, ప్రముఖ సినీ నిర్మాత ఏ.ఎం. రత్నంతో పాటు చెన్నై విభాగం అధ్యక్షుడు అరిగల తమ్మయ్య నాయుడు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, ఏపీ విభజన కంటే సీఎం జగన్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశా రు. అందుకే జగన్ విముక్త ఏపీ కోసం పవన్ కల్యాణ్ పోరాటం చేస్తున్నారని తెలిపారు. సమాజంలోని అట్ట డుగు వర్గాల ప్రజలకు రాజ్యాధికారం దక్కాలని, వారికి అండగా నిలవాలన్న ఏకైక లక్ష్యంతో పవన్ ముందుకు సాగుతున్నారని చె ప్పారు. ఏపీలో ఒక దుష్టుడి పాలన సాగుతోందని, ఆ పాలన నుంచి ఏపీ వి ముక్తి పొందేందుకు మీవంతు కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజారాజ్యం స్ఫూర్తితో పవన్ కల్యాణ్ పేదలు, బడుగుల కోసం పాటుపడు తున్నారని చెప్పారు. "ఏపీని ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోని నెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం లోని బీజేపీని సమన్వయం చేసుకుంటూ, బలమైన ఓటు బ్యాంకు ఉన్న టీడీపీతో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించారు. మున్ముందు ప్రకటించే జాబితాలో జనసేనకి మరికొన్ని టికెట్లు ఉంటాయన్న నమ్మకం ఉంది" అని పేర్కొన్నారు. వచ్చే మూడు నెలలు ఎంతో కీలకమని తెలిపారు.

జగనాసురుడిని రాష్ట్రం నుంచి తరిమేద్దాం: బుచ్చి రాంప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ పాలనలోనే దేవాలయా లపై దాడులు జరుగుతున్నాయని టీడీపీ బ్రాహ్మణ సాధి కార కమిటీ కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ఆరోపించారు. ఆదివారం మాట్లాడుతూ తాను అర్జునుడినని చెప్పుకొం టున్న జగన్ నిజానికి అసురుడని, హిందూమత ద్వేషి అని టీటీడీ ప్రధానార్చకులు రమణదీక్షితులు వీడియో వి డుదల చేశారని రాంప్రసాద్ వ్యాఖ్యానించారు. హిందూ మతాన్ని గౌరవించి, పరిరక్షించే చంద్రబాబుకు ఓటేసి జగ నాసురుడిని రాష్ట్రం నుంచి తరిమేయాలంటూ రాంప్ర సాద్ పిలుపునిచ్చారు.